నవశక్తి

Vol. 2, no. 11

(Feb. 22, 1939)

బెజవాడ, 1939

Record no. 682

Navaśakti

Vol. 2, no. 11

(Feb. 22, 1939)

Bejavāḍa, 1939

Record no. 682

చిట్టివలస కాల్వులు

Regd. No. M. 3824

నవశక్తి

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వారపత్రిక

సంపుటం 2 } బుధవారం 22–2–39 బెజవాడ {సంచిక 11

★ భారత దేశానికి కమ్యూనిస్టు ప్రముఖుల సందేశాలు! ★



"మార్చి నెలలో అఖిల భారత కాంగ్రెసు మహా సభ సమావేశం కాబోతూంది. అక్కడ చాల ముఖ్యమైన నిర్ణయాలకు రావలసి వుంది: మొట్టమొదట ఫెడరేషన్ ప్రవేశ పెట్టబడకుండా పోరాటం సాగించాలి: బ్రిటనులో మా పార్టీ కూడా, ఫాసిస్టులకు సహాయము చేస్తూన్న ఛాంబర్లేన్ ప్రభుత్వాన్ని కూలద్రోసి, భారత ప్రజల స్వాతంత్ర్య పోరాటానికి పూర్తి సహకారము ఇస్తుంది...."

—హారీ పాలిట్

బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి

★

"నిరుడు భారత దేశములో, జాతీయ కాంగ్రెసు, కార్మిక కర్షకోద్యమాలు అద్భుతంగా అభివృద్ధి పొందాయి. ఈ స్వాతంత్ర్య శక్తుల ఐక్యతపైననే భావి భారత విజయం ఆధారపడి వుంది. బ్రిటిష్ సామ్రాజ్య వాదం ఫెడరేషన్‌ను అమలు జరపడానికి బలాబలాలు చూచుకుంటూంది. కనుక ఇప్పుడే అట్టి ఐక్యత ఎక్కువ అవసరం. ఈ సంవత్సరంలోనే భారత స్వాతంత్ర్య పోరాటం ఫలించుతుందని ఆశిస్తున్నాను...."

—రజనీ పామీ దత్తు,

అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు.





"జాతీయ సాంఘిక భద్రతకై, స్వాతంత్రోద్యమాన్ని పెంపొందించండి....."

—ఎరల్ బ్రౌడర్,

అమెరికన్ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి.

★

పై సందేశాలను "నేషనల్ ఫ్రంటు" వార్షిక సంచికద్వారా పంపారు.

నవశక్తి

చందా వివరాలు

సంవత్సరం చందా	రూ 3—0—0
అర్థ సంవత్సర చందా	1—10—0
విడిప్రతి	0—1—0

బర్మా రేట్లు

సంవత్సర చందా	రు 5—0—0
విడి ప్రతి	0—1—6

ప్రకటన రేట్లు

"కాలం" వెడల్పు 2" (2 అంగుళాలు)

20 అంగు లోపల ప్రతి అంగుళానికి రూ.	0—6—0
20" అంగు పైన ..	0—4—0
100" అంగు పైన ..	0—3—0
పేజీ	రు 10—0—0 లు
½ పేజీ	6—0—0 లు
¼ పేజీ	3—0—0 లు

షరా:—ఈ రేట్లుపైన కమిషన్లు. డిస్కౌంటులు ఇవ్వబడవు. రు 0—8—0 లకు తక్కువ ప్రకటనలు తీసుకొనబడవు. సెలసరి చెల్లు ముందుగా ఇవ్వవలెను.

ప్రత్యేక చోటునకు, ప్రత్యేక రేట్లు.

* * *

	ఫిబ్రవరి నెల కోటా	రెండవ వారంలో చేర్పించినది.
విశాఖపట్టణం	5	2
తూ. గోదావరి	30	4
ప. గోదావరి	50	20
కృష్ణా జిల్లా	50	15
గుంటూరు	30	14
నెల్లూరు	20	18
రాయలసీమ	10	0
ఇతర స్థలాలు	5	1
	200	74

విదేశాలలో మా ఏజెంట్లు

జి. కాళిదాసు. 209 ఫేయర్ స్ట్రీట్
రంగూన్.

పబ్లిషర్స్ బుక్ హౌస్. 14 కింగ్సు స్ట్రీట్.
లండన్. W. C. 2.

లీగ్ ఆఫ్ ఇండియాన్ ప్రీడం, 112 ఈస్టు 19 వ స్ట్రీట్.
న్యూయార్కు సిటీ

నవశక్తి

(త్రిపురి కాంగ్రెస్ సంచిక)

అడ్వర్టైజ్‌మెంటు రేట్లు

టైటిల్ వెనుక పేజీ	రు 20—0—0
పూర్తి పేజీ (¼ క్రౌన్)	15—0—0
అర పేజీ	8—0—0
పావిక పేజీ	4—8—0
అంగుళం	0—6—0

షరా:—కాలం వెడల్పు 2 అంగుళాలు. రూపాయికి తక్కువ ప్రకటనలు తీసుకోబడవు. కమీషన్లు, డిస్కౌంట్లు ఈ రేట్ల పైన లేవు.

ది బలరామా ఆయుర్వేదిక్ ఫార్మశీ వారి

స్త్రీజనామృతమ్

స్త్రీలకుగల తెలుపు, ఎరుపు, వ్యాధులు నివారింపజేయుటకు అమూల్యమైనది. నీరసము, గుండెదడ, సంతాన నష్టము పోగొట్టి మంచి పుత్సాహము, సత్సంతానము గలిగింపగలదు గుణమున కొక్క సీసాచాలును, సీసా రు 2—0—0 లు. కేటలాగు, కేలండరు పుచితము.

వలయువారు:— ఉరిటి బ్రదర్సు
వైద్యశాఖ, ఏలూరు, (ఆంధ్రా)

గెల్లి కృష్ణమూర్తి & బ్రదర్సు

పొగాకు బ్యారిన్సు యినుప సామాన్లు పింగాణీరాళ్ళు మార్బుల్‌రాళ్ళు సిమెంటురాళ్ళు అన్నిరకములు సరసమైన ధరలకు చిల్లరగాను టోకుగాను అమ్మబడును.

జనరల్ మార్కెట్టు వద్ద
కాలువ వొడ్డు.
బెజవాడ.

ఒక రూపాయికి 7 గ్రంధాలు.

తిరుగుబాటు (నాటకం)	0—4—0
మాలపల్లె (నవల)	0—4—0
క్రాంతి గీతాలు	0—4—0
మన సంపద	0—1—0
కమ్యూనిజానికే జయం	0—1—0
వలస దేశాల సమస్య	0—1—0
స్టాలిన్ - ఎచ్.జి.వెల్సుల సంభాషణ	0—1—6

ఒక రూపాయి M. O. ద్వారా పంపితే పోస్టు ఖర్చులు భరించి పంపబడతాయి.

అభ్యుదయ గ్రంధమండలి, ఎలమర్రు. (కృష్ణా జిల్లా)

ఆంధ్ర రాడికల్ లిటరేచర్ సెల్లింగు డిపో, గుంటూరు

1 రు. పైబడు— డిస్కౌంటు 25%

రాజకీయ గ్రంథాలన్నీ కావాలంటే

ఏజంట్లు:—

1 సిటీ స్టూడెంట్సు ఎంపోరియం, గుంటూరు
2 సి. హెచ్. రాధాకృష్ణమూర్తి, తెనాలి
3 ఆర్ మహాదేవ్, హైదరాబాద్
4 ఎం. ఓ. సుబ్రహ్మణ్యం, నెల్లూరు
5 వెంకట రంగా & కో, బందరు
6 మోడరన్ న్యూస్ ఏజెన్సీ, బెజవాడ
7 సి. సి సుబ్బయ్య, గూడూరు
8 ఎం. ఆర్. మూర్తి, రంగూన్
9 పి. లోకనాథం, బాపట్ల
10 ఎం. వీరభద్రరావు, సత్తెనపల్లి
11 బి. వి. అప్పలరాజు, నందిపాడు
12 కె. సుబ్బరాజు, పాలకొల్లు
13 యల్. వి. రావు, విజయనగరం
14 డి. శ్రీరామమూర్తి, భీమవరం
15. కె, క్రిష్ణారావు. చీరాల
16. కామ్రేడ్ శెట్టిపల్లి. గుడివాడ

సి. పి సారధి,
మేనేజరు.

చదువ వలసిన హిందీ వార పత్రికలు

నయా హిందూస్థాన్ బెయిర్లనా, అల్లాబాద్. సంగి చందా 2—0—0.

జనతా బంకీపూరు, పాట్నా. సంగి చందా రు 3—0—0.

అడ్వైజరు

(ఆంధ్రాంగ్ల మాస పత్రిక)
విజయనగరము

చక్కని కథలు, వ్యాసాలు ఉంటాయి.
తక్కువ వ్యయ ప్రయాసాలతో వర్తక పారిశ్రామికాభివృద్ధి చేయు పత్రిక యిదియే.

సాలు చందా 8 అణాలు మాత్రం.
విడి పత్రిక 1 అణా.

రత్నపురుష లేహ్యాం

బలము రక్తము, వీర్యవృద్ధికి
20 తు॥ కి 1-0-0

ఈశ్వరఫార్మసీ, పాలకొల్లు.

హీట్ కిల్లర్

మేహములకు సంజీవి.

శ్రీరామకృష్ణా ఆయుర్వేద ఫార్మశీ
విజయనగరము.

ఆంధ్రవాణి

బెజవాడ నుండి వెలువడు ద్వైవారపత్రిక

హైదరాబాద్ సంస్థాన వార్తలను, స్వదేశీ సంస్థానాల ప్రజా ఉద్యమాలను గురించి తెలసికోవాలంటే ఆంధ్రవాణి చదవాల.

వివరాలకు:— మేనేజరు
'ఆంధ్రవాణి'
గవర్నరుపేట—బెజవాడ.

విద్యావనం

బాలబాలికలకు ఆదర్శప్రాయమైన పాఠశాల

వివరాలకు:—
అన్నాప్రగడ సరళాదేవి,
మంతెనవారిపాలెం,
(via) పొన్నూరు
గుంటూరు జిల్లా.

NEW AGE

Editor: S. V. GHATE

Are you yet going without the New Age? It is the only Marxist Monthly in India. You are missing a lot. It is within your reach as cheapest as you could desire.

Annual Subscription Rs. 1-8-0
Single Copy 0-2-0
270 Triplicane High Road
Madras.

సంపుటం 2

సంచిక 11

నవశక్తి

బుధవారం

22-2-39

సంపాదకవర్గం: మద్దుకూరి చంద్రశేఖరరావు (సంపాదకుడు). కంభంపాటి సత్యనారాయణ. పుచ్చలపల్లి సుందరయ్య. తుమ్మల వెంకట రామయ్య.

మద్రాసు మంత్రివర్గమా ఎక్కడికి?

గాంధీజీ జైలునందున్నపుడు తాను సంపాదకత్వం వహించి, 'యంగ్ ఇండియా' పత్రికలో వ్రాస్తూ, ప్రభుత్వం ప్రతిష్టకోసమని ఉద్యోగుల తప్పులను సమర్ధించడాన్ని రాజాజీ ఆక్షేపించారు. తమ ఉద్యోగుల తప్పులను అంగీకరించి వారిపై చర్య గైకొనుట వల్లనే ప్రభుత్వం ప్రతిష్ట యినుమడించుతుందని వ్రాసాడు. నాడు రాజాజీ బ్రిటీషు సామ్రాజ్యవాదుల నుండి ఆవిధంగా ఆశించుట ఆకాశహర్మ్యములు నిర్మించుటే కావచ్చును. ఏమంటే ఉద్యోగుల దుండగాలను సమర్ధించుట సామ్రాజ్యవాద ప్రభుత్వాలకు సహజం. ప్రజాభిమానం వారికి ఎటులా లేనేలేదు; అందుచే ఉద్యోగుల విశ్వాసంపైనే ఆధారపడాలి సామ్రాజ్యవాదులు. కాని నేడు ప్రజాభిమానం చూరగొని, ప్రజాశక్తిపైన ఆధారపడి ప్రభుత్వ మలంకరించిన మద్రాసు కాంగ్రెసు మంత్రివర్గం సైతం వెనుకటి నిరంకుశ ప్రభుత్వాల వలెనే ఉద్యోగుల చర్యల సమర్ధించుటకే ఉబలాటపడుట ఎంత విషాదకరం!

చిట్టివలస జ్యూట్ మిల్లు బ్రిటీషు కంపెనీ అగు పీలియాడ్ అండ్ కో వారిది. క్రిందటి ఏప్రియల్ నుండి మూడు మాసాలు కార్మికులు సమ్మె చేశారు. కాంగ్రెసు మంత్రివర్గం కోర్టు ఆఫ్ ఎంక్వయిరీ వేస్తామని వాగ్దానం చేయుటచే సమ్మె మానివేశారు. కోర్టు ఆఫ్ ఎంక్వయిరీ 10 రోజులు కాజువల్ శెలవు యివ్వాలనీ, 15 రోజులు నోటీసు లేనిదే కార్మికులను తొలగించరాదని, అపరాధం విధించుటకు ముందు కార్మికులకు సంజాయిషీ చెప్పుకొను అవకాశ మివ్వాలనీ సూచన లిచ్చారు. ఈ సూచనలను కంపెనీవారు యింతవరకు అమలుజరుపలేదు. అమలుజరిపించడానికి ప్రభుత్వం, లేబరు మంత్రి గిరిగారు ఎట్టిచర్య తీసికోలేదు.

ఈ నెల 5 వ తారీఖున మిల్లు యజమానులు నేత డిపార్టుమెంటులో 100 మందికి పని తక్కువ చేస్తున్నారని వార్నింగు యిచ్చారు. 12 వ తేదీని ఒక కార్మికుని రు. 27 ల జీతాన్నుండి రు. 7 లు జీతానికి తగ్గించారు. 14 వ తేదీ 1 గంటకు నేత డిపార్టుమెంటు కార్మికులు సమ్మె చేయడానికి తీర్మానించారు. యజమానులు సాయంత్రం 4–30 గంటలకు మిల్లు అన్ని డిపార్టుమెంటుల్లో పని ఆపుచేసారు. అందుపై కార్మికులు మిల్లులోనేవుండి సత్యాగ్రహంచేయుటకు తీర్మానించారు.

వెంటనే రిజర్వు పోలీసు రప్పించబడింది. జిల్లా కలెక్టరు వగైరా ఉద్యోగులు తర్వాత వచ్చారట. అర్ధరాత్రివేళ 12-30 గంటలకు మిల్లులో శాంతంగావున్న కార్మికులపై తుపాకి కాల్పులు! అపుడు లైట్లు సైతం ఆర్పారట! మిల్లు యొక్క మూడుగేట్లలో ఒకటే తెరచి వుందట. జిల్లా మేజస్ట్రీటు సమక్షాన కాల్పులు సాగాయట. పది రౌండ్లు కాల్పులు; ఒకని మరణం. ఇద్దరు హాస్పిటలులో అపాయకరమైన స్థితిలో వున్నారు. 100 మందికి గాయాలు తగిలాయని యూనియన్ ప్రకటన తెల్పుతూంది.

చిట్టివలసలో వున్నది సివిల్ గవర్నమెంటేనా అని ప్రశ్నిస్తాము. అర్ధరాత్రివేళ కాల్పులు జరుపవలసిన అసాధారణ పరిస్థితు లేమిటి? కార్మికుల ప్రాణాలు యజమానుల, యీ ప్రభుత్వోద్యోగుల, దృష్టిలో అంత చవుకయా? జరిగిన యీ ఘోరాన్ని మదరాసు ప్రభుత్వ ప్రకటన మరింత విషాదకరము చేస్తోంది. పోలీసులపై నాలుకండెలు ఇంకా ఏమేమో విసిరారట; అందుచే కాల్చవలసి వచ్చిందని కాల్పుల వార్తతోపాటే వెలువడింది ప్రభుత్వ ప్రకటన. ఇది కాంగ్రెసు మంత్రుల ప్రకటనయేనా? తాము విచారించలేదు. కాంగ్రెసు యం. యల్. ఏ. అధ్యక్షుడుగా వున్న కార్మిక సంఘ అభిప్రాయాన్ని కనుగొనలేదు. మనుష్య జీవితాన్ని బలిగొన్న ఉద్యోగుల చర్యను సమర్ధించుటకు వీరి కింత ఆతురతయేల? ఇట్టి విధానమును ప్రజాభిమానముచేతనే అచట వుండగలిగిన కాంగ్రెసు మంత్రులకు తగదనీ, మద్రాసు మంత్రివర్గము తన కర్తవ్యాన్ని విడనాడిందని మనవి చేస్తాము.

కాంగ్రెసు మంత్రిత్వము స్వీకరించుట ప్రజల యిక్కట్టుల తెలిసికొని, తొలగించుటకు ప్రయత్నించుటకుగాని, ఉద్యోగుల రిపోర్టునే ఆధారముచేసికొని వారిని సమర్ధించుటకు కాదు. కోర్టు ఆఫ్ ఎంక్వయిరీ సూచనల అమలు జరిపించుటలోలేని ఆతురత కాల్పుల సమర్ధించుటలో ఎందుకో? 19 వ తేదీ ప్రతికలలో యిద్దరు ఐ. సి. యస్. ఉద్యోగులు విచారణ సల్పుటకు చిట్టివలస వెళ్ళినటుల వార్త ఉంది. మంత్రి గోపాలరెడ్డిగారు విచారణ సంఘాన్ని నియమిస్తామన్నారు. చీరాల, బొంబాయి విచారణ సంఘాల ఫలితాలు చూచి, ప్రజలు వీనివలన లాభముండదని గ్రహించారు. అందుచే నేడు కావాలిసింది, ప్రభుత్వ విచారణ సంఘము కాదు. ఐ. సి. యస్.ల విచారణ అంతకంటే కాదు. రాష్ట్రి కాంగ్రెసు సంఘము విచారణ జరపాలి. చీరాలలోవలె గాక రాష్ట్రి కాంగ్రెసు నిర్ణయాన్ని కాంగ్రెసు మంత్రులు అంగీకరించి తీరాలి. వెంటనే ప్రభుత్వము యీ కాల్పులకు కారకులైన ఉద్యోగులను డిస్మిస్ చేయాలి. కాల్పులలో చనిపోయినవారి కుటుంబానికి, గాయపడినవారికి మిల్లు యజమానులచే నష్టపరిహార మిప్పించాలి.

ఆంధ్ర దేశమందలి కాంగ్రెసువాదులు, సోషలిస్టులు, కార్మికులు యిందుకై బ్రహ్మాండమైన ఆందోళన చేయాలి. కాంగ్రెసు మంత్రులు తమ తప్పును గుర్తించునట్లు చేయు బాధ్యత ప్రజలపై వుంది. ప్రజలు మనుష్యుల జీవితానికి ఎక్కువ విలువ యిస్తారనీ, ఉద్యోగుల అవకతవకలను సమర్ధించుట కాంగ్రెసు మంత్రుల కర్తవ్యం కాదనీ గుర్తించేటట్లు చేదాము. రాష్ట్రి కాంగ్రెసు నాయకులు, పార్లమెంటరీ బోర్డు, కాంగ్రెసు శాసన సభ్యులు, మంత్రివర్గము తన కర్తవ్యాన్ని నెరవేర్చునట్లు చేయాలి. గ్రామ గ్రామాన, ప్రతి పట్టణములో యిందుకై సభలు పెట్టాలి. ఉద్యోగుల చర్యను ఖండించాలి. బ్రిటీషు పెట్టుబడిదారుల లాభాన్ని రక్షించడానికి భారత కార్మికులపై చేయు కాల్పులను ప్రజలు సహింపజాలరని తెలియచేయాలి. మన కోర్కెలు చనిపోయినవారి కుటుంబానికి గాయపడినవారికి యజమానుల ఖర్చుపై నష్టపరిహారమిప్పించాలి. కాల్పులకు కారకులయిన ఉద్యోగుల వెంటనే డిస్మిస్ చేయాలి.

రాష్ట్రి కాంగ్రెసు విచారణనే తుది నిర్ణయముగా కాంగ్రెసు మంత్రివర్గము యెంచి అమలు జరపాలి.

కాంగ్రెసు మంత్రులు ఉద్యోగుల చర్యలను సమర్ధించుట మానాలి.

ii

18 వ తేదీ ఆంధ్రపత్రికలో, ఏజెన్సీలో రిజర్వు పోలీసు వెళ్ళి స్థానికకాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసారనీ, కాంగ్రెసు చావడి తగులపెట్టబడిందని తెలియచున్నదని వార్త వుంది. ఈ వార్త నిజమే అయితే మనం యిపుడు కాంగ్రెసు మంత్రివర్గ పరిపాలనలోనే వున్నామా? అనే సందేహము కల్గి తీరుతుంది. ఈపని మంత్రివర్గ అనుమతితోనే జరిగిందా? అని ప్రశ్నిస్తాము. కాంగ్రెసు మీటింగు అని ప్రజలను పిలిపించి, "మీ రాజాజీగారే అరెస్టు చేయమన్నా"రని కూడ చెప్పినట్లు రిపోర్టుచేయబడుతోంది.

కాంగ్రెసు మంత్రులు దీన్ని గురించి వెంటనే ప్రకటన చెయ్యాలి. కారకులయిన ఉద్యోగులపై కఠిన చర్య తీసికోవాలి.

పశ్చిమ గోదావరిజిల్లా కాళీపట్నము, పాతపట్నము గ్రామాలలో 60 మంది రైతులపై 144 సెక్షను జారీ చేసారు. ఈ ఉత్తరవు ఆ గ్రామాలలో వున్న ప్రజలందరికి అనువర్తించునటుల అర్ధము వస్తోంది. రైతులు సత్యాగ్రహము సల్పుటకు తయారుగా వున్నారని కూడా వార్తలు వస్తున్నాయి. ప్రభుత్వము వెంటనే జోక్యము కలిగించుకోవాలి. అచటి రైతులు తగవులో వున్న భూమిలో చేపలు పట్టుకొను అనాది సిద్ధమైన హక్కును కల్గి వున్నారు. ప్రభుత్వము ఆ భూమిని సాగులోనికి తెచ్చు ఏర్పాటులు గావించునవుడు జమీందారు రైతులకు సాగుకు యిస్తానని వాగ్దానముచేయుటచేతనే రైతులపుడు అంగీకరించారు. అట్టిచో నేడు ఎట్టిప్రతిఫలముకూడా యివ్వకుండానే చేపలు పట్టుకొను హక్కును రద్దు చేసి, రైతులను భూమి నుంచి తొలగించుటకు ప్రయత్నించుట చాల అన్యాయము. డాక్యుమెంటరీ సాక్ష్యము లేదని చెప్పవచ్చు. అమాయక రైతులకు వ్యతిరేకముగా ఎన్ని కాగితాలయినా సృష్టించవచ్చు డబ్బు, అధికారము వున్నవారు. కాంగ్రెసు మంత్రులు వెంటనే జోక్యం కలుగజేసికొని, అనేకమందిచే వాగ్దానము చేసినట్లు చెప్పబడుచున్న 800 ఎకరా లయినా కనీసము రైతులకు యిప్పించాలి.

మన రాజకీయాలు

మదరాసు బడ్జట్

ఈనెల 20 వ తేదీని మదరాసు ప్రధాని రాజగోపాలాచారిగారు, మదరాసు శాసనసభలో ఆదాయవ్యయ పట్టికను ప్రతిపాదించారు. మూడు జిల్లాలలో మద్యపాన నిషేధం అమలుపరచడంవల్లనూ, ప్రజోపయోగం కొరకు స్టాంపుడ్యూటీ, రిజిస్ట్రేషన్ డ్యూటీలు తగ్గించడం వల్లనూ, గత సంవత్సరములో సుమారు 45 లక్షల రూపాయల తరుగు యేర్పడింది. చిన్నరేవుల నిధికి ప్రత్యేకించబడిన $42\frac{1}{2}$ లక్షల రూపాయలు ప్రభుత్వం స్వాధీనపరచుకొన్నందున యీ తరుగు చాలవరకు పూర్తి చేయబడుతోంది. అయితే, మద్యనిషేధ కార్యక్రమం ఉత్తర ఆర్కాటు జిల్లాలోకూడా ప్రవేశపెట్టడానికి $13\frac{1}{2}$ లక్షల రూపాయల ఆదాయం నష్టం వస్తుందని ఆయన తన ఉపన్యాసములో చెప్పాడు. అంటే, నాలుగు జిల్లాల మీద సుమారు 66 లక్షలు నష్టం వస్తూన్నదన్నమాట. ఇదిగాక, పంటల రెమిషన్‌కి యిదివరలో ప్రకటించిన 75 లక్షలు, కరవు ప్రదేశాలలో ప్రకటించిన రెమిషన్ 50 లక్షలు కూడా పూర్తి చేయవలసియున్నది. గత సంవత్సరపు పన్నులే ఈయేడుకూడా అమలుపరిస్తే, 43 లక్షలకు పైగా తరుగు కనపడుతోంది. కాబట్టి, కొత్తపన్నులు ప్రవేశపెట్టిక తప్పినది కాదు. పెట్రోలు, విద్యుచ్ఛక్తి, సారాయి—వీటి అమ్మకాలమీద కొత్తగా పన్ను విధించడానికి రాజాజీ తీర్మానించాడు. వీటిద్వారా ప్రభుత్వానికి వచ్చే రాబడి 25 లక్షలని అంచనా వేయబడింది. కనుక పూర్తి చేయవలసిన తరుగు ఇంకా 17 లక్షల రూపాయలు మిగిలింది. దీన్ని పూర్తి చేయడానికి పొగాకుమీద, సినీమాలు—నాటకాలు మొదలయినవాటి మీద, సరకుల విడుదల (టర్నోవర్) మీద, పన్నులు అదనంగా విధించవలసిన అవసరం యేర్పడింది. వీటికి ప్రత్యేకంగా బిల్లులు ప్రతిపాదించబోతున్నారు. మొత్తం రాష్ట్రం యొక్క ఆదాయం 16 కోట్ల 23 లక్షల రూపాయలు. ఖర్చు 16 కోట్ల 40 లక్షలు.

పన్నుల విషయంలోను, ఇతర విషయాలలోను, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈయబడిన అధికారంకంటె కేంద్ర ప్రభుత్వానికి ఈయబడిన అధికారమే ఎక్కువగుటవల్ల కాంగ్రెసుమంత్రులు అనేక యిబ్బందులకు లోనుగావలసి వస్తూందని రాజాజీ తన ఉపన్యాసంలో స్పష్టీకరించాడు. చాలవరకు యిది నిజమే. ఇండియా ఆక్టును కాంగ్రెసు ఖండించడానికి యిదొక ప్రధాన కారణం. అయినా ఆక్టులోనే మంత్రులకు ఈయబడిన అధికారాలను మన ప్రధాని వినియోగించు కొనలేకపోయాడు. ఉదాహరణ: ప్రొవిన్షియల్ లిస్టులో 41 వ అంశం ప్రకారం, భూములవల్ల వచ్చేరాబడి మీద పన్నువిధించవచ్చు. పెద్దపెద్ద భూస్వాముల ఆదాయంలో కొంతభాగాన్ని యీవిధంగా వినియోగించుకొనవచ్చు. లేక, 45 వ అంశములో చెప్పబడిన 'కాపిటేషన్ పన్ను'లు విధించవచ్చు. ఈ విధంగాచేస్తే, బీద ప్రజలకు అదనంగా అనేక సౌకర్యాలు చేయవచ్చు. ఇప్పుడైనా మించిపోయినది లేదు. త్వరలో బిల్లులు ప్రతిపాదించి, శాసన సభ్యులచేత అంగీకరింపజేయవచ్చు. రాజాజీ యిందుకు పూనుకుంటాడా?

సరిహద్దు మంత్రి వర్గం

సరిహద్దు కాంగ్రెసు మంత్రుల పరిపాలన ఒక తరహా, ఇతరరాష్ట్రాల కాంగ్రెసు ప్రభుత్వాల పరిపాలన ఒకతరహా. సరిహద్దు రాష్ట్రానికి పొలిమేరలో చైనా, రష్యా, అఫ్ఘనిస్థాన్ దేశాలున్నాయి. రాబోయే ప్రపంచ సంగ్రామంలో సరిహద్దు ప్రజలు తిరుగుబాటుచేశారా, బ్రిటిష్ సామ్రాజ్యానికి తీరనిదెబ్బే. అందువల్ల, ఇండియా ఆక్టు ప్రకారం యితర రాష్ట్రాలలో కాంగ్రెసు మంత్రుల కీయబడిన స్వల్ప అధికారాలు కూడా అక్కడ నిరాకరించబడుతున్నాయి. ప్రభుత్వోద్యోగులు మంత్రివర్గానికెట్టి సహాయం చేయకపోగా, అనేక సందర్భాలలో ఎదురు తిరుగుతున్నారని కాంగ్రెస్ శాసన సభ్యులు, రాష్ట్రకాంగ్రెసు కమిటీ, ఫిర్యాదుచేయగా పార్లమెంటరీ కమిటీ సభ్యుడైన అబ్దుల్ కలాం అజాదు విచారణ నిమిత్తమై అక్కడికివెళ్లాడు. పరిస్థితులన్నీ ఆయనకు పూసగుచ్చినట్లు చెప్పారు. చీటికీ, మాటికీ, కేంద్ర ప్రభుత్వం జోక్యం కలుగజేసుకొని, కాంగ్రెసు ప్రభుత్వాన్ని లెక్కచేయకుండా ప్రవర్తిస్తూన్న సమయంలో కాంగ్రెస్ సంస్థయొక్క గౌరవాన్ని కాపాడేటందుకు మంత్రులు రాజీనామా యిచ్చి రావలసినదని అనేకమంది కాంగ్రెస్‌పార్టీ సభ్యులు అజాద్‌తో చెప్పారు. రాష్ట్రకాంగ్రెస్ కమిటీ సభ్యులుకూడా అనేకమంది అట్టి అభిప్రాయమే తెలియజేశారు. అజాద్ ఒక బహిరంగ సభలో ఉపన్యసిస్తూ, సరిహద్దు రాష్ట్రంలో ప్రభుత్వోద్యోగులు "అతి ప్రమాదకరమైన స్థితి"ని తెచ్చిపెట్టుచున్నారని పలికాడు తరువాత అతడు సుమారు 10 గంటలసేపు మంత్రులతో సంప్రతించి, మంత్రివర్గానికీ—ఎసెంబ్లీ కాంగ్రెసు పార్టీకి—రాష్ట్ర కాంగ్రెసు కమిటీకి మధ్య ఉండవలసిన సంబంధాన్ని గురించి కొన్ని ఉత్తరువులు వ్రాసి యిచ్చాడట. అవియేవో ఎవరికీ తెలియదు. "రాష్ట్రప్రభుత్వానికి ప్రత్యామ్నాయంగా కేంద్ర ప్రభుత్వంకూడా పరిపాలన చేస్తూన్న"దని అజాద్ ఒక ప్రకటన చేశాడు.

పాఠకులకు

మార్చి 8 వ తేదీని త్రిపురీ సంచిక ప్రకటించ దలచుటచే వచ్చే వారము నవశక్తి వెలువడదు.

ఈ వారము శివరాత్రి శెలవగుటచే 20 పేజీలే వేయగలిగినాము. దీనికి పాఠకులు మన్నింతురు గాక.

—సంపాదకుడు.

దీన్నిబట్టి, సరిహద్దు రాష్ట్రంలో ఏర్పడిన క్లిష్టపరిస్థితి ఎంతవరకు వచ్చిందో ఊహించుకొనవచ్చు. గత 17 మాసాల నుంచీ యీ యదార్థస్థితిని దాచి యుంచడానికి అక్కడి నాయకులు ప్రయత్నించారు. ఇప్పుడైనా సరిహద్దు కాంగ్రెసు మంత్రులు ప్రభుత్వోద్యోగులను లొంగుబాటు చేసుకొనడమో, చేతగాకపోతే, బయటికి రావడమో చేయాలి!

బొంబాయి మ్యునిసిపాలిటీ

ఈనెల 7 వ తేదీని జరిగిన బొంబాయి మ్యునిసిపల్ ఎన్నికలలో, వోటర్లు కాంగ్రెసు అభ్యర్థులకే వోట్లిచ్చి గెలిపించారు. మొట్ట మొదటిసారి కాంగ్రెసు సంస్థ తన తరపున అభ్యర్థుల్ని నిలిపింది. 73 గ్గురు అభ్యర్థులలో 54 గురు గెలిచారు. మొత్తం సీట్లు 106. వీరు గాక, నలుగురు కమ్యూనిస్టులు కూడా ఎన్నికలలో గెలుపొందారు. సుమారు 20 సంవత్సరాలనుంచి పాతుకుపోయిన జమీందార్ల ప్రతినిధులు అనేకమంది ఓడిపోయారు. కాని, వెంటనే బొంబాయి పౌరులకు ఆశాభంగము కలిగింది. మ్యునిసిపల్ ఆక్టు ప్రకారం వోటర్ల లిస్టు తయారు చేయబడలేదు కాబట్టి, ఎన్నికలను నిలుపుచేయవలసినదిగా ఒకరు హైకోర్టులో పిటీషన్ పెట్టగా హైకోర్టు ఇంటరిమ్ ఆర్డర్లు ప్యాసు చేసింది. ఎన్నికలకు పూర్వం జరుగవలసిన స్క్రూటినీ, ఇన్స్పెక్షన్ వగయిరా తంతులన్నీ ఇక ఇప్పుడు జరుగుతా యన్నమాట! బ్రిటిషు ప్రభుత్వ హయాములో ఇట్టి అవకతవకలు జరుగుతూన్నవంటే, ఆశ్చర్యము లేదు.

కాన్పూరులో పోలీసు కుట్ర.

ఈనెల రెండవ వారంలో కాన్పూరు నగరం హిందూ-ముస్లిం కొట్లాటలకు కేంద్రస్థాన మయింది. 14 వ తేదీ నాటికి 31 మంది చనిపోయారు. 224 గురు గాయపడ్డారు. రెండురోజులక్రితమే పోలీసులు 7 సార్లు తుపాకులు కాల్చారు. 700 మందిని ఎరస్టు చేశారు. మిలిటరీ దళము కూడా పోలీసులకు సహాయం చేసింది.

ఫిబ్రవరి 7 వ తేదీని ఒక హిందూ వివాహపు ఊరేగింపు బయల్దేరింది. మసీదు యెదుట ఆఊరేగింపు మేళతాళాలతో వెళ్ళుతోంటే, మహమ్మదీయులు సహించలేక అడ్డగించారు, ప్రజలమీదపడి దౌర్జన్యంగా ప్రవర్తించారు. కాని, పోలీసులు 9 వ తేదీ వరకు తుంటరుల్ని ఎరస్టుచేయలేదు. ఎరస్టు చేయబడిన కొద్దిమందిని వెంటనే విడిచిపెట్టారు. నగర కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడు 8 వ తేదీని జిల్లా కలెక్టరువద్దకు వెళ్లి, పోలీసుల ముఖావాన్ని ఖండించాడు. ప్రతాప్అనే హిందీ దైనిక పత్రిక పోలీసుల ఆలస్యాన్ని విమర్శించింది. ఊరేగింపు మసీదు యెదుటనుంచి వెళ్లవచ్చునో, వెళ్లకూడదో, జల్లాకలెక్టరు ఎట్టి ఉత్తరువు ఈయలేదు. ఈలోగా ముస్లిం నాయకులకూ — ఉద్యోగులకూ మధ్య కుట్రలు ఆరంభమై కొట్లాటలలోకి దిగారు. ఆరోజుననే సమావేశమైన కాన్పూరు వర్తకమండలివారు నగరమందలి హిందూ కార్మికులు-ముస్లిం కార్మికులు చూపిన సహనాన్ని అభినందిస్తూ తీర్మానించారు.

యు. పి. రాష్ట్రంలో కాంగ్రెసు మంత్రులు అధికారానికి వచ్చాక, పోలీసుదళం మంత్రులమీద "సత్యాగ్రహం" చేయడానికి రెండుసార్లు తలపెట్టింది. సెప్టెంబరు 8 వ తేదీని, 16 వ తేదీని నగరంలో అనేకచోట్ల పోలీసులయెడ జరిగే "అక్రమాల"ను గురించి నోటీసులు అంటించబడ్డాయి. అనేకమంది పోలీసుజవాన్లు ఉపవాసాలు కూడా చేశారు. పోలీసు సూపరింటెండెంటు కొద్దిమందిమీద మాత్రం చర్య తీసుకున్నాడు. ఈ ఆందోళనను కఠినపద్ధతులతో అణచవలసినదని కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడు ఆనాడే హెచ్చరించాడు. కాని, ఆ హెచ్చరికను ప్రభుత్వం "సీరియస్"గా తీసుకొన నందున పోలీసుల కుట్ర యిప్పుడు ఫలప్రదమయింది. ప్రజాప్రతినిధులు ప్రభుత్వాధికారంలో ఉన్నప్పటికీ, పోలీసులు—మిలిటరీ—జైళ్లు వీటిమీద కూడా సంపూర్ణాధికారం లేకపోతే, ఆ ప్రభుత్వము ఏవిధంగా చేతగాని ప్రభుత్వంఅవుతుందో కాన్పూరు నిదర్శనం.


వేర్వేరు కాంగ్రెసు మంత్రుల వైఖరి

సోషలిస్టులు కాంగ్రెసులో ఉండి, కాంగ్రెసు సంస్థ యొక్క పునాదుల్ని నాశనం చేయడంకంటే కాంగ్రెసు బయటికి పోకూడదా? అంటూ బీహార్ పైనాన్సు మంత్రి (కాంగ్రెసు) షాహాబాద్ రాజకీయమహాసలో ఉపన్యసించాడు. కుర్రకారంతా సుభాస్‌బోస్‌ను కాంగ్రెస్ అధ్యనిగా ఎన్నుకోవడంవల్ల నేడు దేశంలో ప్రమాదకరమైన పరిస్థితి ఏర్పడినదని డాక్టర్ రాజన్ (మదరాసు ఆరోగ్య శాఖామంత్రి) దక్షిణాదిని వెల్లాకోయిల్‌ఫిర్కా రాజకీయ మహాసభలోచెప్పారు. ఇండియాలో స్వరాజ్యం అవరమో కాదో, నిర్ణయించేది ఉపాధ్యాయులుకాదు; మన విద్యాశాఖకు మంత్రి అయిన వార్కీగారి ఉద్దేశంలో కార్మికులమాదిరిగా విద్యార్థులు సమ్మెలు చేయడం కూడని పని అంటూ యస్. రామనాథన్‌గారు (ఇనర్మేషన్ మంత్రి) మైసూరు విద్యార్థులకు సలహాయిచ్చారు. మదరాసులో, బకింగ్‌హామ్, కర్నాటిక్ మిల్లు కార్మికులయెదుట మన ప్రధాని రాజాజీ ఉపన్యసిస్తూ, లాభాలు, వేతనాలు ఒకటేనని, ఒకే వస్తువుయొక్క రెండుపేర్లు అనీ ఉపదేశించాడు. యువకుడు, కవి, వక్త అయిన గోపాలరెడ్డిగారు విజయనగరంలో, యూనివర్సిటీ విద్యార్థులయెదుట ఆవేశంతో యీ విధంగా పలికారు; "ఇండియాలో మనం ప్రజాతంత్ర సూత్రాలు, సంస్థలు మనదేశంలో నెలకొల్పబడ్డానికి పూర్వం ప్రజలలో అందుకువలయు రాజకీయ విద్య అవసరం.

మహాత్ముడు మొదలు సామాన్య ప్రజల వరకూ నేడు బ్రిటిష్ ప్రభుత్వంతో బ్రహ్మాండమైన పోరాటానికి సిద్ధపడుతోంటే, యీ పోరాటానికి నాయకత్వం వహించవలసిన కాంగ్రెసు మంత్రులు యీవిధంగా నోటికి వచ్చినరీతిని మాట్లాడ్డం గర్హ్యనీయం. ఇప్పటికైనా వీరు తమ ప్రతికూలవైఖరిని అతివాదుల నుంచి ప్రభుత్వంవైపుకు మరలించుకోరా?

మరణ శయ్యపైనున్న కామ్రేడ్ యూసఫ్

కామ్రేడ్ కమల్ సర్కార్
(బెంగాల్ లేబరు పార్టీ కార్యదర్శి.)



ఉదయాన్నే పత్రిక తెచ్చిన కామ్రేడ్ ఒక మూలగా ప్రకటించబడిన వార్తను బిగ్గరగా చదివాడు. "యూసఫ్ అనే ఖైదీ, జైలులో బరువులు మోయలేక నెత్తురు గ్రక్కుకుని కూలబడి పోయాడు." వార్తవిని నేనూ కూలబడ్డాను.

యూసఫ్, ఎముకలు తప్ప మరేమీ లేని బక్క శరీరంతో హాస్పిటల్‌లో పడివున్నాడు కళ్ళుమాత్రం, అతనిలోని తెలివితేటల్ని ప్రతిబింబిస్తూ, కార్మిక లోకంకోసం యూసఫ్ ఇంకా బ్రతికే వున్నాడన్నట్లుగా ప్రకాశిస్తూ వున్నాయి. యూసఫ్‌కు క్షయ. ఒకఊపిరితిత్తి పూర్తిగా చెడిపోయింది. రెండోది "ఎఫెక్టు" అయింది "నీవింక అయిదు నెలలకంటె ఎక్కువకాలం బ్రతకవు" అని డాక్టరు చెప్పాడు. "నేనుతప్పక బ్రతుకుతాను" అని యూసఫ్ చెప్పాడు. డాక్టర్ ఆమాటలని కొన్ని నెలలు గడిచింది....

కామ్రేడ్ యూసఫ్ ఒక రైతుకుటుంబంలో జన్మించాడు. వాళ్ళది గయజిల్లాలో ఇహాయపూర్ అనే ఒక గ్రామం. తండ్రి, తనకున్న భూమితోపాటు మరికొంత కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తుండేవాడు. యూసఫ్‌ను పదవ యేట స్కూలుకు పంపారు. కాని రెండు సంవత్సరాలు గడిచే సరికి తండ్రి మరణించడంచేత చదువు మానివేయవలసి వచ్చింది. తండ్రి పోయిన తరువాత, కొద్దోగొప్పో వున్న భూమి కూడాపోయింది. పదిహేనవ ఏటనే యూసఫ్ కుటుంబభారం నెత్తిపైన పెట్టుకోవలసివచ్చింది. ఉద్యోగం కోసం కలకత్తాకు ప్రయాణంకట్టాడు కొన్ని సంవత్సరాలపాటు నిలకడలేని వుద్యోగాలెన్నో చేసి చేసి చివరకి డాక్‌వర్కర్ (ఓడకూలీ) గా స్థిరపడ్డాడు.!

ఓడకూలీలకు నెలకు రు. 25 లు జీతం ఇస్తారు. కాని కూలీ కంట్రాక్టరు ముందుతన జేబునింపుకొని తరువాత కూలీలసంగతి చూస్తాడు. ఎవడైనా కూలీ అదేమని అంటే అసలు జీతమేరాదు. పైగా అంతమంది కూలీలముందు కంట్రాక్టరు చేత దెబ్బలు కూడా తినవలసి వస్తుంది. కూలీలకు కోపంవస్తుంది. లోలోపల మండిపడతారు. కేసుపెట్టమని ఎవరో చెబుతారు. అంతా చందాలు వేసుకొని కేసు పెడతారు. ఇదీ, వారి నిత్యజీవనం

ఒకనాడు ఈ ఓడకూలీలంతా నిహారేందు దత్తు మజుందారు వద్దకు వెళ్ళారు. "మాకు యూనియన్ కావాలి. దానికి మీరు సహాయం చేయాలి" అని అడిగారు.

1934 ఫిబ్రవరిలో పోర్టు అండ్ డాక్‌వర్కర్ల యూనియన్ ఏర్పరుపబడింది. వేలకొలది ఓడకూలీలంతా యూనియన్‌లో చేరారు. యూనియన్ కూలీలకుండే కష్టాలను పోగొట్టడానికి పోరాడేవారిలో యూసఫ్ మొట్టమొదట నిలబడేవాడు. యూనియన్‌లో కొంచెం చురుకైన వారిని రోజూ ఒకచోట చేరదీసేవాడు. ప్యారిస్ కమ్యూన్, రష్యా విప్లవం మొదలైన కథలన్నీ చెబుతూండేవాడు. అక్కడ సమావేశమైన వారందరిలోకి కొంచెం అక్షరజ్ఞానం వున్నవాడు మన యూసఫ్ ఒక్కడే. ఉరుదులో సోషలిజంమీద, కమ్యూనిజంమీద పుస్తకాలు చాల తక్కువ. అందుచేత వచ్చీరాని భాషతో తనకుతప్ప ఇతరులకు తెలియని వ్రాతతో యూసఫ్ వ్రాసిన 'నోట్సే' వారికి ఆధారం. అదే పదిసార్లు చదివించుకుని వింటూండేవారు కార్మికులు. ఈనోట్సే డాక్‌వర్కర్లలో మార్క్సిస్టు విజ్ఞానాన్ని వెదజల్లింది.

డాక్ వర్కర్ల కష్టాలు రోజురోజుకు ఎక్కువౌతూ వచ్చాయి. రోజుకు 11 గంటలు విశ్రాంతి లేకుండా పని చేయవలసి వచ్చేది. ఇది కాకుండా, కరువుగొట్టు కంపెనీ, వీరిచేత రోజూ ఒక అరగంటసేపు వూరికే పని చేయించుకునేది. ఉదయం 7 గంటలకు బదులు $6\frac{1}{2}$ కే హాజరుకావాలని చెప్పి రాగానే పనిలో ప్రవేశపెట్టేది. యూసఫ్ ఈ దోపిడిని సహించలేకపోయాడు. $6\frac{1}{2}$ కు వచ్చిన కార్మికులంతా, మామూలు టైము 7 గంటలయ్యేవరకు ఏ పనీ చెయ్యకుండకూడదని సలహా యిచ్చాడు. కార్మికులంతా అట్లేచేశారు. మన యూసఫ్‌కు ఎక్కడలేని ఆనందం వచ్చింది. కాని కంపెనీ యజమాను లిది చూచిఓర్వలేక పోయారు. "యూసఫ్ అపాయకరమైన మనిషి, అతనిమాటలు వినకండి" అని కంట్రాక్టర్ల చేత ప్రచారం సాగించారు. కార్మికులు వినలేదు. అరెస్టులు ప్రాసిక్యూషన్‌లుసాగాయి. యూసఫ్‌ను అరెస్టు చేశారు. క్రిమినల్ కేసు పెట్టారు. ఇది కార్మికులహృదయాల్లో చిచ్చునాపెట్టినట్లయింది. తమ యూసఫ్‌ను ఎట్లాగైనా విడిపించుకోవాలనుకున్నారు. తినడానికి తిండైనాలేని ఆ బీదకూలీలంతా చందాలు వేసుకుని కేసులో డిఫెన్సు పెట్టారు. వారి యూసఫ్‌ను బెయిలు మీద విడుదల చేయించుకున్నారు.

ఇప్పుడు యూసఫ్‌కు ఉద్యోగం పోయింది. అందుచేత 24 గంటలూ యూనియన్ పనే చూసేవాడు. యూసఫ్ ఉద్యోగం పోవడంతో పాటు, ఓడలమీది సరకులు దింపేవారు కూడా లేకుండాపోయారు. కార్మికులు సమ్మెచేశారు. బీహారు మద్రాసుల నుండి కొందరు కూలీలను తెచ్చింది కంపెనీ. కాని కలకత్తా కార్మికుల కష్టాలను, సమ్మెకు కారణాలను తెలుసుకొని వారుకూడా పని చెయ్యడానికి నిరాకరించారు. ఓడకూలీలు రోజుకు 8 గంటలే పని వుండాలని కోరుతున్నారు. సమ్మె తీవ్రంగా సాగుతోంది. యూసఫ్ ప్రతికార్మికుని కలుసుకుని ప్రోత్సాహమిస్తుండేవాడు. సన్నని స్వరంతో అతడుచెప్పే ఉపన్యాసాలు, దగ్గుతో ఆగిఆగి చెప్పేమాటలు కార్మికుల హృదయాల్లో చక్కగా నాటుకుపోయేవి ఇంతలో యూసఫ్‌పైన కేసు వచ్చి పడింది. ఇతడు విడుదల అయే లోగా కంపెనీ ఏజెంట్లు సమ్మెను భగ్నంచేశారు అప్పుడుకూడా కార్మికుల జీతాలు హెచ్చించక తప్పలేదు.

సమ్మె అయిపోయిన వెంటనే డాక్‌వర్కర్ల యూనియన్ అక్రమ సంఘముగా ప్రకటింపబడింది. ఇవన్నీ జైలునుండి వచ్చిన యూసఫ్‌కు పట్టుదలను మరింత ఎక్కువజేశాయి. యూనియన్‌ను తిరిగి నిర్మించడానికి పూనుకున్నాడు. కులతత్వవాదుల, కంపెనీ కుతంత్రాలు, సామ్రాజ్యవాదుల బెదరింపులు ఇతనిని జయించలేకపోయాయి. కార్మికులలో యూసఫ్ యెడల గల గాఢాభిమానాన్ని చలింపజేయలేక పోయాయి.

కాని, దారిద్ర్యం, నిరుద్యోగం, ఇవి ఎంతటి వారినైన క్రుంగదీయగలవు. యూసఫ్‌కు క్షయ రోగం అంకురించింది. ఆసుపత్రిలో పడివున్న యూసఫ్‌మీద, ఒక సరంగుపై తిరగబడ్డాడని కేసు తేబడింది. మేజస్ట్రీటు 10 రూపాయలు జరిమానా, చెల్లించకపోతే 10 రోజులు ఖైదు విధించాడు. చెల్లించడానికి పదిరూపాయలు లేవు. "పదిరోజులేగా, జైలుకే పోతాను" అన్నాడు యూసఫ్.

జైలులో యూసఫ్‌చేత నిర్దాక్షిణ్యంగా, బరువులు మోయించేవారు ఒకనాడుబరువు మోయలేక రక్తం క్రక్కుకొని కూలబడిపోయాడు.

ఇప్పుడు యూసఫ్ కలకత్తాలో నేషనల్ ఇన్‌ఫర్మరీలో లేవలేని స్థితిలో వున్నాడు. అయినా తనకామ్రేడ్స్ పనిఎట్లా చేస్తున్నారో ప్రతిరోజూ తెలుసుకోవాలంటాడు. ప్రతిరోజూ సాయంకాలం అవగానే అతని వార్డులోని రోగులందరూ అతని మంచంచుట్టూ చేరుతారు. కమ్యూనిజం, సోషలిజం వీటినిగురించి చెప్పమంటారు.

సన్నని గొంతుకతో ఓపిక పూర్తిగా తగ్గిపోయేటంతవరకూ వారికేవో బోధిస్తూనే వుంటాడు. వారు నిశ్శబ్దంగా కూర్చుని యూసఫ్ చెప్పేదంతా వింటారు. ఆహాస్పిటల్‌లో నలుగురైదుగురు సోషలిస్టులనుకూడా తయారుచేశాడని తెలుస్తుంది! (నేషనల్ ఫ్రంటునుంచి)

పాలస్టైన్

రచయిత:—తుమ్మల వెంకట్రామయ్య

గ్లేజు కాగితం. చక్కని ముద్రణ.

80 పేజీలు—2 అణాలు

వలయువారు 3 అణాల తపాల బిళ్ళలు పంపవలెను.

నవశక్తి కార్యాలయం,
గవర్నర్‌పేట, బెజవాడ,

మరొక దారుణ హత్యాకాండ!

చిట్టివలసలో కార్మికులపై తుపాకి గుండ్లు

కామ్రేడ్ కొత్తమాసు సత్యనారాయణ

నిస్సహాయస్థితిలో, దారిదోవ కనుబడని రోజుల్లోవచ్చినయి ఎసంబ్లీ ఎన్నికలు. కరుణాకరం సుబ్బారావుగారు విశాఖపట్నం, గోదావరి జిల్లాల కార్మిక స్థానమునకు కాంగ్రెసు అభ్యర్థిగా నిలబడ్డారు. కాంగ్రెసుపై గల భక్తితో, తమ కష్టము తీరేనను ధీమాతో నూటికి నూరుమంది కార్మికులు పచ్చపెట్టెలోనే ఓట్లు వేశారు, సుబ్బారావుగారు జయమందారు. ఆ రోజుల్లో జరిగిన ప్రచారంతో, సుబ్బారావు గారి కృషివల్ల 1937 లో యూనియన్ ఏర్పడింది. అప్పటినుండి వారికున్నకష్టములను మిల్లు యజమానులకు, గవర్నమెంటువారికి అర్జీల మూలంగా తెలియజేసుకొన్నారు. కాని ఏమీలాభం లేకపోయింది. విసిగిపోయారు కార్మికులు. 28-4-38 వ తేదీన శాంతంగా సమ్మె మొదలుపెట్టారు. 3 నెలలు చాలా శాంతంగా సమ్మెజరిగింది. ఆగష్టు 8 వ తారీఖున మద్రాసు కాంగ్రెసు మంత్రివర్గమువారు ఒక ప్రకటన చేశారు. "చిట్టివలస కార్మికులు సమ్మె మాని పనిలో చేరినట్లయితే విచారణ కమిటీని నియమించుతా" మన్నారు. అందుచే కార్మిక సంఘం అక్టోబరు '38 న సమ్మెను విరమించింది. తర్వాత విచారణాధికారి వచ్చారు. విచారించాడు. ఏవో చిన్ని చిన్ని రికమెండేషనులు చేశాడు. కార్మిక సంఘం తృప్తిపడకపోయినను అంగీకరించింది. కాని యజమానులు ఇంతవరకు కోర్టు ఆఫ్ ఎంక్వయిరీవారి రికమెండేషనులను ఆచరణలో పెట్టలేదు. ఆఅసంతృప్తి కార్మికులలో ఇంకనూ వుంది.

తగప్పుకు కారణం

ఫిబ్రవరి నెల 14 వ తేదీ మధ్యాహ్నం $12\frac{1}{2}$ గంటలకు నేత డిపార్టుమెంటులో మామిడి అప్పన్న అను పనివాడు తక్కువ నేయుచున్నాడను నెపముతో నేత డిపార్టుమెంటునుండి "నేర్చుకొనువాడు"గా మార్చబడ్డాడు. అసలు 5-2-39 వ తేదీనే దాదాపు నూరు మందికి యజమానులు "వార్నింగ్" యిచ్చారు. ఆ నూరుమందిలో ఈ మామిడి అప్పన్న అనువాడు మాత్రం "పనివాడు" నుండి "నేర్చుకొనువాడు"గా మార్చబడ్డాడు. కోర్టు ఆఫ్ ఎంక్వయిరీ వారి రికమెండేషను ప్రకారం పనివాడు ఏమన్నా తప్పుచేసినయెడల "యజమానులు పనివానినుండి వ్రాతమూలకమైన సమాధానం పొందాలి." తన వృత్తి తగ్గుటకు కారణము అప్పన్న చక్కగా తెలియజేశాడు.

1 కారణం మెషిన్ స్పీడునుబట్టి వుంటుంది.

2. ,, నారను బట్టి వుంటుంది.

3. ,, నారకు వేసిన గంజినిబట్టి వుంటుంది.

ఇవ్వింటిని లెక్కచేయకుండా, కోర్టు ఆఫ్ ఎంక్వయిరీ వారి సూచనలను త్రోసిపుచ్చి, అప్పన్నను శిక్షించారు.

అంటే నెలకు 27-0-0 ల నుండి రు. 7-8-0 కు జీతము తగ్గించారు. యజమానులు చేసిన ఈ అక్రమమునకు తన నిరసన తెల్పినందులకు వెంటనే పని నుండి తొలగింపబడ్డాడు. కాని రు. 7-8-0 జీతము పైనే మళ్ళా వేసుకొన్నామన్నారు. అప్పన్న పనిచేయ నిరాకరించాడు. ఆ డిపార్టుమెంటులోని ఇతర కార్మికులు గూడా అప్పన్నకు సానుభూతిగా పని మానారు. కార్మికు లందరు ఐకమత్యంగా చేసిన ఈ పనికి యజమానులు లొంగకపోవుటచే, తప్పనిసరిగా ఆనేత డిపార్టుమెంటు కార్మికులు సత్యాగ్రహం చేశారు. పని మానారు 14 వ తేదీ 1 గంటకు. అందుపై యజమానులు సాయంత్రం 4-30 గంటలకు అన్ని సెక్షనులలోను పని ఆపివేయించారు. అప్పుడు ఈ విషయము అన్ని సెక్షనులలోని కార్మికులకు తెలిసింది. భోజనము చేయకుండా మిల్లులోనే వుండటానికి నిశ్చయించారు.

కాల్పుల కాండ

సరిగ్గా సాయంత్రం $6\frac{1}{2}$ గంటలకే ఆయుధ సహితముగా రిజర్వు పోలీసువారు సిద్ధమైనారు. 7 గంటలకు తహశీల్దారుగారు వచ్చి, "ఇండ్లకు పోయి భోజనము చేసి. సమ్మెను సాగించవలెనంటే తిరిగి రండి." అని కార్మికులను వెంటాడినాడుట, దాదాపు 50 మంది కార్మికులు వస్తుకొని ఇండ్లకు వెళ్ళి, భోజనముజేసి, తిరిగి రాత్రి 10 గంటలకు మిల్లువద్దకు వచ్చారు. లోపలికి పో ప్రయత్నించారు. అప్పుడు గేటుకోనున్న రిజర్వు పోలీసులు వారిని లోనికి పోనీయకుండుటేగాక 13 మంది గాయపడునట్లు లాఠీ చార్జీ చేసిరి రాత్రి $10\frac{1}{2}$ గంటలకు ఆర్. డి వో. గారు వచ్చారు, సంగతులన్నీ తెల్సుకొనిగూడా ఏమీ చర్య తీసుకోలేదు. తహసీల్దారు గారు 11 గంటలకు యూనియన్ ప్రెసిడెంటుగారి కోసం విజయనగరం వెళ్లారుట. జిల్లా కలెక్టరుగారు, రాత్రి $12\frac{1}{2}$ గంటలకు వచ్చారు మిల్లు వద్దకు. మిల్లులో కార్మికులంతా శాంతంగా పండుకొన్నవాళ్ళు కొందరు. ఎక్కువ మంది నిద్రపోతూనా వున్నారుట. సరిగా 12-45 గంటలకు మిల్లులోని దీపాలన్నీ ఆర్పారు. తప్పత్రాగిన రిజర్వు పోలీసులు బ్యాటరీ లైటులను చేతులోనుంచుకొని, జిల్లా కలెక్టరు, ఏజంటుల సమక్షాన తమ నైపుణ్యాన్ని జూపారుట. మొట్టమొదట తుపాకులను పైకి కాల్చారుట ఢాం, ఢాం మన్న ఆ శబ్దము చాలామంది కార్మికుల్ని మేలు కొల్పింది. వెంటనే లాఠీ దెబ్బలు. అకస్మాత్తుగా జరిగిన ఈ ఘోరములకు ఆగలేక బయటికి పారిపోవటం మొదలు పెట్టారు. మిల్లుకున్న 3 గేటులలో 1 గేటు మాత్రము తెరిచారు ప్రాణ భయంతో పారిపోతోన్న కూలీలపై తుపాకులు పదిసార్లు (రౌండ్లు) కాల్చి, గుండ్ల వర్షం కురిపించారు. రాత్రి 1 గంటకు తహసీల్దారుగారు యూనియన్ ప్రెసిడెంటును వెంటబెట్టుకొని విజయనగరంనుంచి వచ్చారు. మిల్లులోనికి వెడుతూన్నారు. ఆ సమయంలో జిల్లా కలెక్టరుగారు, మిల్లు ఏజంటుగారు, పోలీసువారు మిల్లు అంతా గాలిస్తున్నారుట. ఇంకా కూలీలేమైనా మిల్లు ఆవరణలోనున్నారేమోనని. నెమ్మదిగా పారిపోతూన్న కూలీలని గేటులోనున్న పోలీసులు లాఠీలతో కొట్టటం ప్రెసిడెంటు సుబ్బారావు కళ్లార జూచారు.

కాల్పుల ఫలితం

మొత్తంమీద 10 రౌండ్లు కాల్చారు. కాలికి తుపాకి గుండువల్ల కాలు నరుకబడిన ఇ. సత్తెయ్య అను కార్మికుడు హాస్పిటలులో చనిపోయాడు. పెద్ద పెద్ద గాయములు తగిలినవారు 20 మందికి పైగా ఉన్నారు. మరి నూరు మందికిపైగా గాయాలు తగిలినై. ఇప్పటికి 76 మంది యూనియనుకు రిపోర్టు జేశారు. ఎవరెవరికి ఏ గాయములు తగిలినవో ఆ వివరములన్నీ యూనియను ఆఫీసులో నున్నై.

దెబ్బలు తగిలిన వెంటనే ప్రాథమిక చికిత్స ఈయబడలేదట. యూనియన్ ప్రెసిడెంటుగారు చనిపోయినాడని తలంచబడిన ఒక కూలీ విశాఖపట్టణ హాస్పిటలులో కొంచం కోలుకున్నాడట. ఒకడు ప్రమాదవస్థలో నున్నాడు. భీమునిపట్నం హాస్పిటలులో దాదాపు 20 మంది పేషెంట్లుగా చేర్చుకొనబడ్డారు.

కూలీల పరిస్థితి

కాని కూలీలు మాత్రం "రెండవ జలియన్‌వాలా బాగ్" అనదగిన ఈ దారుణ కృత్యాలు జరిగినప్పటికి అధైర్యపడ లేదు. సాయంత్రం జరిగిన మీటింగుకు 2000 మంది పైగా హాజరయ్యారు. ఎంత కాలమైనా సరే తమ కోర్కె తీరేదువరకు సమ్మె చేయాలని నిశ్చయించుకున్నారు.

ప్రభుత్వ ప్రకటన

"చిట్టివలస జ్యూట్ మిల్లులో ఒక పర్మనెంటు నేత కార్మికుని తొలగింపుటలో మంగళవారం 2 వేల మంది కార్మికులు మిల్లునుండి బయటికి పోవ నిరాకరించారు. రిజర్వు పోలీసుదళం రప్పించబడింది. జిల్లామేజస్ట్రీటు కూడ వచ్చాడు. కార్మికులను బయటికి పంపుటకు ప్రయత్నించారు. నూలుకండెలు, రాళ్లు విసరబడ్డాయి. అందుపై పోలీసులు 4 సార్లు కాల్చారు; లాఠీచార్జీ చేసి మిల్లు ఖాళీ చేసారు. ఒకడు సీలమండలో గాయపడి విశాఖపట్నం హాస్పటలుకు పంపబడ్డాడు.

ఇంకా విచారణ చేయుటవల్ల ఏమి తెలిసినా ప్రభుత్వం జరిగిన విషాదాలకు విచారం తెల్పుతూంది. తగాదాల పరిష్కారం కొరకు చేసిన స్టే యిన్ స్ట్రయికు (మిల్లునుండి బయటికి పో నిరాకరించు సమ్మెను)ప్రభుత్వము తీవ్రముగా నిరశించుతున్నది. ఈరకపువి అసలు సమ్మెలే కావాలవు; అపాయకరమైన క్రిమినల్ నేరములు. ప్రాణానికి తీవ్రమైన నష్టము కల్గించి శాంతి భద్రతలు పోగొట్టుతాయి, గాన ఏ ప్రభుత్వం సహించజాలదు. అందుచే ఇట్టివి తీవ్రపద్ధతులచే అణచివేయబడతాయి: అనేక దారుణ ఫలితాలు కారణ మవుతాయి.

సంయుక్త రాష్ట్రాలలో జైళ్ల సంస్కరణ.

గతమాసం, ఆఖరివారంలో, యు. పి రాష్ట్ర జైళ్ళ సంస్కరణ విషయంలో కాంగ్రెసు ప్రభుత్వం అవలంబించవలసిన పద్ధతుల్ని గురించి విపులమైన రిపోర్టు ఒకటి ప్రకటించారు. గోపీనాథ శ్రీవాస్తవ (పార్లమెంటరీ కార్యదర్శి), లెఫ్టినెంట్ కలనల్ సలామతుల్లా (రాష్ట్రమందలి జైళ్ళ ఇన్‌స్పెక్టర్ జనరల్), లెఫ్టినెంట్ కలనల్ ఎ. హెచ్. షే (బారియల్లీ సెంట్రల్ జైలు సూపరింటెండెంటు), గారలతో కూడిన యీ కమిటీ యీక్రింది సిఫార్సులను ఏకగ్రీవముగా అంగీకరించింది. రాష్ట్ర ప్రభుత్వం వాటిని పూర్తిగా అంగీకరించింది.

వార్డర్లు

సెలవు సదుపాయాలకొరకు, జైలు వార్డర్లంతా "ఉన్నత తరగతి"కి చెందిన గవర్నమెంటు నౌకర్లలో ఒక భాగమై యుండాలి. పింఛన్ల విషయంలో వీరు "ఉన్నత తరగతి"కి చెందినవారే అయినప్పటికీ, సెలవు నిబంధనల విషయంలో "క్రింది తరగతి"కి చెందినవారుగా పరిగణించ బడుతున్నారు. సంవత్సరంలో 11 నెలలు ఎడతెగకుండా పనిచేసిన వార్డర్లకు నేడు 15 రోజుల కంటె ఎక్కువ సెలవు ఈయబడటంలేదు. స్త్రీ వార్డర్లకు జీతాలు కాలపరిమితిని బట్టి ఈయాలి. 15 రూపాయలకు తక్కువ జీతం ఏస్త్రీ వార్డరుకూ ఉండకూడదు. 3 సంవత్సరాల కొకసారి రూపాయచొప్పున "ఇంక్రిమెంటు" ఈయాలి.

వార్డర్లయొక్క, అసిస్టెంటు జైలర్లయొక్క తరిఫీదుకై లక్నోలో ఒక కేంద్రం స్థాపించాలి. ఇప్పుడున్న వార్డర్లు, ఇతర ఉద్యోగస్థులు, ఎంతసేపూ ఖైదీలను శిక్షించడం, పారిపోకుండా చూడ్డం—వీటికి మాత్రమే ప్రాధాన్యత యిస్తున్నారు. అట్టి తత్వంలో వారు పెరిగారు. ఇతర విషయాలేవీ వారి కక్కర్లేదు. ఖైదీని బాగు చేద్దాం—అనే ఆలోచన వారిలో పూజ్యం. కాబట్టి ఖైదీలను సంస్కరించే ఆధునిక పద్ధతులు జయప్రదం కావాలంటే, నేటి వార్డర్లు, జైలు ఉద్యోగస్థులు, ఉన్నతవిద్య నభ్యసించినవారై యుండాలి. మంచిస్వభావం కలిగినవారై యుండాలి. ఇతర వృత్తుల మాదిరిగానే వీరు కూడా తమతమ విధులను గురించి చక్కని తరిఫీదు పొందినవారై యుండాలి. అనేక వేల మంది వ్యక్తుల నైతిక, మానసిక, శ్రేయస్సు ఎట్టి తరిఫీదును పొందని వార్డర్ల చేతులలో పెట్టడం ఊహించ నలవిగాని విషయం.

రాజకీయ ఖైదీలు

ఖైదీలందరినీ రాజకీయ ఖైదీలు అనీ, ఇతర ఖైదీలనీ రెండుతరగతులుగా విభజించాలి. రాజకీయఖైదీ అంటే అర్థం "స్వార్థంకొరకుగాక, రాజకీయ ఉద్దేశంతో, చేసిననేరానికి శిక్షవిధించబడిన వ్యక్తి" మత, కుల, సంబంధమైన నేరాలు యీ తరగతికి చెందకూడదు. అట్టి నేరాలు రాజకీయ ఉద్దేశంతో చేసినప్పటికీ, దేశాభివృద్ధికి మిక్కిలి హానికరం కాబట్టి అట్టిఖైదీలు ప్రత్యేకతరగతిలో చేర్చబడటానికి అర్హత లేదు.

ఇట్టి రాజకీయ ఖైదీ లందరినీ ఒకే జైలులో ఉంచాలని మేము సిఫార్సు చేస్తున్నాం. స్వేచ్ఛగా వారు సమావేశం కావడానికి హక్కు యివ్వాబడాలి. వారికి కావలసిన ఒక పత్రిక ప్రభుత్వపు ఖర్చు మీద సప్లయి చేయాలి. ఇతర పత్రికలను ఖయిదీల సొంతఖర్చుమీద తెప్పించుకోనివ్వాలి. వ్రాత పరికరాలన్నీ వారికి సప్లయిచేయాలి. ప్రతివానికి దీపపు వెలుతురు అందేలాగు ఏర్పాట్లు చేయాలి. భోజనం, పరుపు, దుస్తులు వగైరాలు నేటి "బి"క్లాసు ఖైదీలకు ఈయబడేవిగానే ఉండాలి. ఇవి గాక, తమ సొంతఖర్చుమీద, వారికి కావలసిన యితరసామాను తెప్పించుకోవడానికి అనుమతిఇవ్వాలి. వారానికొకటు ఉత్తరం చొప్పున జైలునుంచి ఉత్తరాలువ్రాసుకొనవచ్చును. బయటనుంచి వచ్చే ఎన్ని ఉత్తరాలయినా వారికి ఇచ్చివేయాలి. అర్జంటు ఉత్తరాలు ఆలస్యము చేయకుండా అంద జేయాలి. వారానికొక పర్యాయం "ఇంటర్‌వ్యూ" చేసేహక్కు వారికుండాలి. నేడు"ఏ","బి" తరగతుల ఖయిదీలకు అనుమతించబడుతూన్న ఆటలన్నీ రాజకీయ ఖయిదీలను ఆడుకొన నివ్వాలి. తమ సొంతఖర్చుమీద సంగీత సాధనాలు కూడా దగ్గర ఉంచుకోనివ్వాలి. రాత్రులందు బయట నిద్రపోనివ్వాలి. బుద్ధిపూర్వకముగా, తమంతట తాము, తీసుకొంటే తప్ప రాజకీయ ఖయిదీలచేత పని చేయించకూడదు. ఆ పని సహితము, వారు కోరుకొన్న పనినే యివ్వాలి. జబ్బు చేసినప్పుడుగాని,కుటుంబములో ఏదైనా ఉపద్రవం వచ్చినప్పుడుగాని, రాజకీయ ఖయిదీ యింటికి వెళ్ళి, తిరిగి వచ్చే ఏర్పాటు చేయబడాలి. జబ్బు పడినప్పుడు, తాము కోరిన ప్రైవేటుడాక్టరు చేత, సొంత ఖర్చుపై, చికిత్స పొందవచ్చును. స్త్రీలకు నూనె,దువ్వెన,కుంకుమ, గాజులు సప్లయి చేయాలి. ఇప్పుడు "బి" క్లాసు ఖయిదీలకు ఇవ్వబడే ఇతర సౌకర్యాలన్నీ స్త్రీలకుకూడా యివ్వాలి.

జైలులో రాజకీయ ఖయిదీలు చేయు నేరాలకు ఈక్రింది శిక్షలు మాత్రమే విధించాలి: హింసాయుత పద్ధతులు అవలంబిస్తే, వరుసగా 15 రోజుల వరకు ప్రత్యేకించి ఉంచడం. నెలరోజుల వరకు తన తరగతికి లభించే సౌకర్యాలు యివ్వకపోవడం. కాని, భోజనం, పరుపు, దుస్తులు—యివి మాత్రము యివ్వాలి.

ఇతర ఖైదీలు.

రాజకీయ నేరాలకై శిక్షింపబడని యితర ఖయిదీలందరినీ మామూలు ఖయిదీలనీ-అలవాటుగా నేరాలుచేయు ఖయిదీలనీ, రెండుతరగతులుగా విభజించాలి. మామూలు ఖయిదీలను "స్టార్" మార్కు ఖయిదీలనీ, యితరఖయిదీలని-తిరిగి రెండురకాలుగాను; అలవాటు ఖయిదీలను "సాధారణ" ఖయిదీలనీ, "మొండి" రకపు ఖయిదీలని విభగించాలి. దీనికికారణం ఏమంటే, నిరంతరం నేరాలుచేసే స్వభావంగల ఖయిదీలతో పొరపాటున నేరంచేసినఖయిదీలను కలిపియుంచుతే వచ్చేఅనర్థాలను అరికట్టడానికి.

ఖయిదీలందరినీ ఏయే తరగతిలో ఉంచాలో నిర్ణయించేది కోర్టులే అయి ఉండాలి. జాతులను బట్టి తరగతుల విభజన చేయకూడదు. తరగతి విభజన ఫారం పూర్తిచేసేటప్పుడు మేజస్ట్రేట్లు ఫలానిఖయిదీ "రాజకీయ" ఖైదీయో, సాధారణ ఖయిదీయో, స్పష్టంగా వ్రాయాలి. ఈ విషయంలో జోక్యం కలుగజేసుకొనడానికి రాష్ట్ర ప్రభుత్వం అధికారాన్ని కలిగియుండాలి.

జైళ్ళ విభజన.

నేటి విధానంలో అన్నితరగతుల ఖయిదీలు ఒకే జైలులో ఉంచబడుతున్నారు. గోడలు, ప్రత్యేకించబడిన స్థలాలు, ఎన్ని ఉన్నప్పటికీ అన్నిరకాల ఖయిదీలు ఒకే జైలులో ఉంటే, ఒకరితో ఒకరు కలవకుండా చేయటం సాధ్యమైన పనికాదు. ఒక్కొక్క జైలులో నివశించే ఖయిదీలందరూ ఒకే రకమైనవారైతేగాని తరగతి విభజనవల్ల మంచి ఫలితాలు పూర్తిగా లభించవు. జైళ్ళ సంస్కరణలో ఖయిదీలను తరగతివారీగా విభజించడం ఎంత అవసరమో, జైళ్ళనుకూడా వేర్వేరు తరగతులుగా విభజించడం అంతే అవసరం. అంతకంటే ఎక్కువ అవసరం అనికూడా చెప్పవచ్చు.

నేరస్థుడు బయట ఉన్నతజీవితానికై అలవాటుపడినవాడై యుంటే, అతడుఅర్జీ పెట్టుకున్నమీదట నేటి "బి" క్లాసు ఖయిదీలకు ఈయబడుతున్న భోజనం యిచ్చేలాగు అనుమతించవచ్చును. అయితే "సి" క్లాసు భోజనంకంటె "బి" క్లాసు భోజనానికి ఎంత అదనంగా ఖర్చు అవుతుందో, ఆ ఖర్చును అతడు భరించాలి. దుస్తులవిషయంలోగాని, పక్కవిషయంలోగాని ఎట్టి ప్రత్యేకత ఉండకూడదు. పనివిషయంలో కూడా ఇంతే.

చిన్న పిల్లలకూ, అంతకంటె కొంచెం పెద్దవాళ్ళకూ, ప్రత్యేకమైన "బోర్‌స్టల్" జైళ్ళు ఉండాలి. అట్టిజైళ్ళు విద్యకు, విజ్ఞానానికీ, కేంద్రమైన ఒక స్థలంలో ఉండాలి. ఎందువల్లనంటే, ప్రసిద్ధిగాంచిన విద్యాధికులు యీ పిల్లల వద్దకు తరచువచ్చి, నైతికవిషయాలను గురించి, ఇతర విషయాలను గురించి, బోధించడానికి అవకాశం ఉంటుంది. లక్నో, అలహాబాదు, కాశీ-యిట్టి కేంద్రాలని కమిటీవారి అభిప్రాయం ఇందుకై 3 లక్షల రూపాయలు వచ్చే ఆదాయవ్యయపట్టికలో ప్రత్యేకించ బడుతోంది.

ఖైదీల పనికి కూలి.

జైలు కర్మాగారాలలో ఖైదీలు యిప్పటికంటె ఎక్కువ శ్రద్ధతో పనిచేయడానికై వారు చేసే పనికి కూలియిచ్చు పద్ధతిని ప్రవేశపెట్టాలని మా అభిప్రాయం. ఒక్కొక్క తరగతి పనికి ఎంతెంత యివ్వాలో నిర్ణయించి, అదనంగా చేసిన పనికి అదనమైన కూలి యివ్వాలి. అమ్మకానికి పనికివచ్చే సరకును తయారుచేస్తేనే కూలి యివ్వాలి. అదనంగాచేసిన పనికి రెట్టింపుకు రెండణాల వంతున యివ్వాలి.

ఈ మొత్తం కూలిలో నూటికి 5 వంతుల చొప్పున ప్రత్యేకించి, దానితో సమానమైన సొమ్ము ప్రభుత్వం యిచ్చి, దాన్ని ఖైదీలందరి యొక్క "కులాసా" కొరకు ఖర్చుపెట్టాలి. ఖైదీలు తమకువచ్చే కూలిలో ఎంత భాగమైనా తమ కుటుంబాలకు పంపవచ్చును. మొదట యీ పద్ధతిని రెండు జైళ్ళలో మాత్రం అవలంబించి, జయప్రదమయితే మిగిలిన జైళ్లలో కూడా ప్రవేశపెట్టాలి.

జైలు శిక్షలు.

నేరస్థులకు "ఒంటికొట్టు" శిక్ష విధించే అధికారం కోర్టులకు ఉండకూడదు. తిరుగుబాటు చేయడం గాని, తిరుగుబాటుకు ప్రోత్సహించడం గాని, చేస్తేతప్ప యితర సందర్భాలలో కొరడా దెబ్బలు ఉండకూడదు. ఈశిక్ష అయినా జైళ్ళ ఇన్‌స్పెక్టర్ జనరల్‌యొక్క అనుమతి పొందిన తరువాతనే విధించాలి. "అడ్డ బేడీలు" వారం రోజులకంటె ఏఖైదీకి ఎక్కువ తగిలించ కూడదు. 5 సంవత్సరాలలో యీశిక్షను క్రమంగా రద్దు చేయాలి.

భోజనం.

ఖైదీలకు మధ్యాహ్నం యిచ్చే భోజనంలో మార్పులు చేస్తూ ఉండాలి. అప్పుడప్పుడు, నియమంగా, ఉపవాసాలు చేసేవారికి ప్రత్యేక భోజన సదుపాయాలు చేయాలి. చలికాలంలో యిప్పటివలె రెండేసి కంబళ్ళు కాకుండా, మూడేసి యివ్వాలి. సంవత్సరాని కొకసారి కాకుండా, 9 నెలల కొకసారి దుస్తులు సప్లయి చేయాలి.

నిర్బంధ విద్య

ఖైదీల మానసిక ప్రవృత్తిలో మార్పులు తేవాలంటే, వారికి విద్యాసౌకర్యాన్ని కల్పించాలి. 50 సంవత్సరాలకు క్రింది వయస్సుగల ఖైదీలందరికీ నిర్బంధంగా చదువుచెప్పాలి. శారీరకంగా గాని, మానసికంగా గాని, జబ్బుఉన్న వాళ్ళను మాత్రం విడిచిపెట్ట వచ్చును. బాగా చదివి. పరీక్షలలో ప్యాసైన ఖయిదీలకు "రెమిషన్లు" యివ్వాలి. $1\frac{1}{2}$ అడుగుల పొడవు, $1\frac{1}{2}$ అడుగుల వెడల్పుగల పలకలు ప్రతిఖయిదీయొక్క కొట్టులో ఒక్కొక్కటి చొప్పున ఉంచి, ఆవిధంగా ఖయిదీల విశ్రాంతి సమయంలో వ్రాసుకొనే అవకాశం కల్పించాలి. చదువుకొన్న ఖయిదీలనే ఉపాధ్యాయులుగా నియమించాలి. కాబట్టి 3 మొ॥ 5 సంవత్సరాలవరకు శిక్షవిధించబడినట్టియు, అలవాటుగా నేరాలుచేయనట్టియు, చదువుకొన్నట్టియు, ఖయిదీలను ఒక జైలులో కేంద్రీకరించి, ఒక్కొక్కనికి మూడేసి నెలలచొప్పున తరిఫీదుయిచ్చి, అది అయినతరువాత అన్ని జైళ్ళకుఉపాధ్యాయులుగా పంపాలనిమాసలహా. ప్రతి జైలులోను ఒక్కొక్క "బ్యారక్"ను ఒక్కొక్క చిన్న గ్రంథాలయం నిర్మించి, ప్రతిఖయిదీయు తన పుస్తకాలు జాగ్రత్తచేను కొనేటందుకొక అలమార వంటిది ఏర్పాటు చేయాలి.

పంచాయతులు.

జైళ్ళలో పంచాయతీపద్ధతి ప్రవేశపెట్టితే, ఖయిదీలయందు చక్కని డిసిప్లిన్ అలవడుతుందని మాదృఢవిశ్వాసం. బారియల్లీ జూవెనైల్ జైలులో యీపద్ధతి ఆచరణలో ఉంది. జయప్రదమైన ఫలితాలు అక్కడ కనబడుతున్నాయి.

(మిగతా 18 వ పేజీలో)



కమ్యూనిస్టులు కోరేదేమిటి?

కామ్రేడ్ మారిస్ థోరే

(గత సంచిక తరువాయి)

ఫ్రెంచి ప్రజలు దరిద్రాన్ని, లేమిని అనుభవించుతున్నారు. అలాంటి పరిస్థితులలో జీవించడము ఫ్రాంసు దేశానికి తలవంపు. అలాంటి నికృష్ట పరిస్థితులను తెచ్చింది పెట్టుబడి ప్రభావమే (Power of Capital).

ఫ్రెంచి ప్రజలలో అధిక సంఖ్యాకులు అనారోగ్యకరమైన ఇండ్లలో—మురికి కూపాలలో నివసించుతున్నారు. ఒక్క పారిస్‌లో నే 186,000 మంది, ఆరోగ్యాధికారులు "మరణ భీతి" కలదని నోటీసులంటించిన ప్రదేశాలలోనే నివసించుతున్నారు. 60,000 మంది పారిస్ నివాసులు క్షయ వ్యాధి వల్ల బాధ పడుతున్నారు. పనికిరాదన్న ప్రదేశములో 93 ఇండ్లలో 3148 మంది నివసించుతున్నారు. క్షయవల్ల నూటికి 25 మంది మరణించుతున్నా రక్కడ. మాకు పరిశుభ్రమైన, నవీనమైన వసతి గల గృహాలుకావాలి: పారిస్ రాష్ట్రములోని జిల్లాలు, పెద్ద పట్టణాలు చాలా తిరిగి పూర్తిగా నిర్మింపబడాలి. కాని ఏమీ జరగలేదనే చెప్పాలి. గృహ నిర్మాణము సరిగా లేదంటే శిశు మరణాలు హెచ్చడం అన్నమాట, అందువల్లనే జనన సంఖ్య కూడ తగ్గిపోతున్నది. ఆరోగ్య శాస్త్రములో మొదటి రకపు స్పెషలిస్టులు మనకున్నారు. పట్టణ ప్లానింగ్‌లో మొనగాళ్లున్నారు. ఇంతేగాదు ప్రపంచములోకల్ల ప్రాముఖ్యత జెందిన కొందరు ఇంజనీర్లున్నారు. కాని వాళ్ళ ప్లానులన్నీ వాళ్ళ జేబుల్లో ముడుచుకపోయి ఉన్నాయి. కాని మన మింకా అనారోగ్యపు ఇండ్లలోనే ఉంటున్నాము. మన పిల్లలు, గాలి, వెల్తురూ లేక చస్తున్నారు! ఇప్పుడూ, ఇక ముందూ కూడ మన ప్రజల ఆరోగ్యాన్ని గ్యారంటీ చేసే ఇండ్లను నిర్మించడములేదు. ఎందువలన? ఆస్తి ప్రైవేట్ యాజమాన్యము క్రింద ఉండే ఈ పరిస్థితులలో, మన సంఘాల్ని ఏలుతున్న కేపిటలిస్టులకు సంతృప్తి పరచేటంత అద్దెలు, లాభాలు రావు గనుక.

క్రిందటి ఆర్థిక క్షోభలో, నిరుద్యోగమూ, వస్తువుల నాశనం గావించడమూ, కేపిటలిస్టు ఆర్థిక విధాన సూత్రముల వల్ల జరిగిందని ప్రతివాడూ గుర్తించాడు. వస్తువులను ఉపయోగించేందుకు గాక లాభాలకోసం ఉత్పత్తి జేశారనికూడా గుర్తించారు. మానవుల అవసరాలతో కాపిటలిస్టులకు పని లేదు. అలాంటి అవసరాలను తిన్నగా తీర్చివేస్తే వారికి లాభాలు రావు. లక్షలకొలది ప్రజలకు ఈ విషయం తెలుసు.

ఎంత వాదించినా, ఆర్థిక క్షోభలు, లాభాలమీద ఆధారపడ్డ కాపిటలిస్టు ఆర్థిక విధానం, మానవుల అత్యవసరమగు కోర్కెలను తీర్చలేదని, తెల్పినాయి. ఉత్పత్తి ఇప్పుడున్న పద్ధతులపైననే కొనసాగినన్నాళ్లు, ఆర్థిక క్షోభలు, మధ్య మధ్య తప్పకుండా తలలెత్తుతాయి. పైగా అవి హెచ్చుతాయి; ఎక్కువ క్లిష్టంగా కూడ ఉంటాయి. పైగా నేడు ఆర్థిక క్షోభలు ఒక దానిపై నొకటి ఎక్కికూర్చునేటట్లు కన్పడుతోంది.

కాపిటలిస్టులకు "ఈ విధంగా ఇక పోలేం" అని తెలుసు. వాళ్లు కూడా ఏదో పరిష్కారానికి—త్రోవకోసం—వెదుకుతున్నారు. ఫేసిస్టు దేశాలలో ఆ పరిష్కారాన్ని ఆచరించి చూస్తున్నారు. జర్మనీలో "లేబర్ క్యాంప్స్" ఉన్నాయి. అక్కడ కూలీలను బలవంతపెట్టి, జీతం కొద్దిగా ఇచ్చో—అసలు ఇవ్వకుండగనో, కాపిటలిస్టులు దోచుకుంటున్నారు— ఫైనాన్షియల్ కాపిటలిజం మనలను ఎక్కడ కీడ్చుతుందో తెల్పడానికి చక్కని ఉదాహరణ ఇది. అభివృద్ధి నిరోధకులైన (రియాక్షనరీ) బూర్జువా యొక్క ఉద్దేశ్యాలివి: ప్రజా సామాన్యానికి, నీచాతి నీచమైన జీవిత పరిమాణం, రోజు రోజూ పెరిగిపోయే అడుక్కుతినడం, నిస్పృహ, ఉదాసీనత, నిరాశ; ఇక పైన తైతక్కలాడేది కొద్దిమంది పెట్టుబడిదారులు.

ఫ్రెంచిదేశపు అభివృద్ధినీ, ఫ్రెంచి జనుల అభివృద్ధినీ, కేపిటలిస్టుల లాభాలనే అడ్డుగోడలవలన అరికట్టుతున్నారు. ఫ్రాంసుదేశము ధనవంతమైనదే. కాని ఫ్రెంచి ప్రజలు బీదవారు. జాతీయ ధనమంతా—మన ప్రజల శ్రమ ఫలితమంతా—వారికి చెందడము లేదు, పరాన్నభుక్కులైన కొద్దిమందికి చెందుతోంది.

ఫ్రెంచి ప్రజ లందరికీ మంచి దుస్తులు కావాలి. కాని ఉత్తరాది ఫ్యాక్టరీలలోని బట్టల మిల్లులు సగం కాలమే పని చేస్తున్నాయి. ఫ్రెంచి ప్రజ లందరికీ మంచి దుస్తులుండి, ఇక బట్ట అవసరము లేకనా ఇలా పని చేస్తున్నది? కాదు. మిల్లు యజమానులు కోరిన ధరలు—మిల్లు యజమానులకు పెద్ద లాభాలిచ్చే ధరలు—ఫ్రెంచి ప్రజలు చెల్లించలేరు గనుక మెషిన్లు ఆగిపోయినయి. వాళ్ళకు లాభాలు రావనుకొనేసరికి, ప్రజల అవసరాలను గుర్తించకుండా, కార్మికులూ, కొనుక్కొనే ప్రజలూ ఎలా చచ్చినాసరేనని, యజమానులు మెషీన్లను కట్టిపారేస్తారు.

ప్రతివాని అవసరాలను తీర్చే జాతీయ ఆర్థికవిధానం ఒకటి యావత్ జాతికీ ఏర్పరచాలి. కేపిటలిజానికి, నాగరికతను ఉన్నతస్థాయికి తీసుకొనిపోవడము చేతగాకపోగా, ప్రస్తుతమున్న స్థాయినికూడా తగ్గించుతున్నది. టెక్నికల్ అభివృద్ధికి అది ఒక 'బ్రేక్' లాగా పనిచేస్తున్నది. గుత్తగొను లాభాలన్నీ పోతాయని, నూతన విజ్ఞాన పరిశోధనలకు భయపడుతున్నాయి 'ట్రస్టులు'లు.

దీనికి ఒక ప్రసిద్ధ ఉదాహరణ ఇస్తాను. పెట్రోల్ ట్రస్టులు, మొదటి సింథటిక్ పెట్రోల్‌ను కనిపెట్టడాన్ని, ఆతర్వాత దాని ఆర్థిక దోపిడినీ, అపదలచినాయి. ఉత్పత్తి, యంత్రాల ద్వారా ఎంత వృద్ధిచెందాలో అంత అభివృద్ధి చెందలేదు. యంత్రాలలో ఉత్పత్తి శక్తి ఎక్కువ ఉన్నా, యంత్ర శ్రమకంటె, మానవుని శ్రమ చౌకచేయడములో కేపిటలిస్టులు అపుడపుడు జయము పొందారు. మన టెక్నికల్, సైంటిఫిక్ విజ్ఞానాన్ని పూర్తిగా ఉపయోగించినట్లయితే, ఎంత ఆధునికంగా ఉండాలో, అంత ఆధునికంగా మన యంత్రాలు లేవు. ఇపుడు ప్రపంచములో సైన్సు (విజ్ఞానం)నూ, టెక్నిక్‌నూ పరిశ్రమలలో పూర్తిగా ఉపయోగించే దేశం ఒకటే ఉన్నది— అది సోవియట్ యూనియన్.

మన మృత్యు వ్యాపారానికి—మన యుద్ధ ఫ్యాక్టరీలకు—మాత్రము, కావలసినంత ధనం హెచ్చింపబడుతోంది. వాటి కోసం మాత్రం కొత్త పద్ధతులు అమలు పరచుతారు. డబ్బును నీళ్ల లాగా ఖర్చు పెడతారు. కాపిటలిజంయొక్క సృష్టింపదగిన శక్తులన్నీ, వినాశనానికై ఆయుధాలను తయారు చేయుటలో వినియోగింపబడుచున్నవి.

ఈ ఆయుధ నిర్మాణపు పోటీ పరుగులాటల్ని అలా ఉంచుదాం. మెకానైజేషన్ అంటే ఎంత అపనమ్మకం! కాపిటలిజంను సమర్థించే వారిలో ఒకడైన యం. కైల్లో (M. Caillawx) అరచిన భయంకరాక్రందనంలో కాపిటలిజంయొక్క క్షీణ దశ కన్పించుతుంది. "టెక్నికల్ అభివృద్ధిని కట్టిపెట్టండి," అని అన్నాడతడు.

కాపిటలిజం ఎన్ని కలలు గనినా, కాలచక్రాన్ని వెనక్కి తిప్పడము; పితృస్వామిక మధ్య యుగాలు నాటి సమాజానికి పోవడం; అసాధ్యం;

పెద్ద పెద్ద ట్రస్టులూ—ప్రైవేట్ యాజమాన్యం క్రింద నున్న 'మొనాపలీ' లతో— నున్న కాపిటలిజాన్ని తుడిచిపెట్టి, 19 వ శతాబ్దంలోని, స్వేచ్ఛా వాణిజ్యానికి పోవడంకూడా అసాధ్యం.

కాపిటలిజం, విజ్ఞానాన్ని ఉపయోగించుకొన్నదల్లా పరిశ్రమలలో లాభాలు దీయడానికే. కాపిటలిజం, కార్మికుల శారీరక, నైతిక, ఆరోగ్యములను నాశనం గావించి ఉత్పత్తిని వృద్ధి చేసింది. రేషనలైజేషన్ వల్ల ప్రమాదాలు హెచ్చడమే గాక మానసిక, శారీరిక శక్తి (ఎనర్జీ) అంతా ఎండి పోవడము చూస్తున్నాం. కాని కాపిటలిస్టు రేషనలైజేషన్ తర్వాత, ఇంకో రేషనలైజేషన్ వస్తుంది. దానివల్ల ఉత్పత్తి హెచ్చడంతో పాటు, కార్మికులకు క్షేమానికి అవసరమైన ప్రతి కర్తవ్యమూ పూర్తిచేయ బడుతుంది.

ఏవస్తువులను ఉత్పత్తి చెయ్యాలో, ఏ ఉత్పత్తి సాధనాలను ఉపయోగించాలో, కొత్త సాధనాలను ఎలాంటివి సృష్టించాలో, పరిశ్రమాభివృద్ధికి ఎట్టి పరిశోధన లవసరమో, ప్రణాళికలను ఆచరణలో పెట్టడానికి ఎంతకాలం అవసరమో, ముందుగా నిర్ణయించుట: ఈ ముఖ్య విషయాలన్నీ, ప్రస్తుత భవిష్యత్ ఆశయాలను బాగా ఎరిగిన "ప్లాన్‌డ్ ఎకానమీ" లోని ఆర్థిక ప్రణాళిక యొక్క సామాన్య సూత్రాలు. ఈవిధంగా ఆర్థికశక్తుల మీద మానవుని అధికారాన్ని మేము గ్యారంటీ చేయగలం.

మేము ఉత్పత్తిలో త్వరిత గతిని వృద్ధికావడం చూస్తాం. దానితో పాటు పనిచేయు గంటలు తగ్గేటట్లు కూడ చూస్తాం. ప్రస్తుత సమయంలో (1937) ఉత్పత్తి 1913 స్థాయికి కొద్దిగా తక్కువగా ఉంది. ఉత్పత్తి బాగా ఉన్నత స్థాయికి పోయిన 1930 లో, ప్రపంచ యుద్ధానికి పూర్వము కంటె, 100 కి 40 పాళ్ళు మాత్రమే హెచ్చింది. ఫ్రాంసుదేశపు ఉత్పత్తి శక్తినంతా ఉపయోగించితే, ప్రజ లందరిచేత పని చేయించితే, టెక్నికల్ పరిశోధనలకు ప్రోత్సాహమిచ్చి వృద్ధిచేస్తే, మన దేశములో ఒక నూతన సౌఖ్య యుగాన్ని ఆరంభింపవచ్చు.

1933 నుండి, ప్రపంచములో నిరుద్యోగులయిన 300 లక్షల(ప్రభుత్వపు లెక్కల ప్రకారం) మందికి సరిపోవు తిండీ, గుడ్డలూ, నాశనము గావించబడ్డాయి. నాగరీకత మానవత్వం నాశనము చేయబడినవి.

అమెరికా లెక్కల ప్రకారం 1830 లో ఒక బుషెల్ (ఒకకొలత) గోధుమను తయా రుచేయ డానికి 57-న్నరపైగాగంటలు పట్టింది. కాని 1930 లో మూడుంబాతిక గంటలుపైగా మాత్రమే పట్టింది. దీనికి కారణము, కొత్త మెషిన్లు, ట్రాక్టర్లు మొదలయిన నవీన యంత్ర సహాయము. తొందరగా పని చేయగల కార్మికుడు చేతితో కుట్టితే నిమిషానికి 150—200 కుట్లు వేయగలడు; కాని అదే రెక్టయలైనర్ మిషన్ అయితే ఒక నిమిషములో 360,000 కుట్లు వేయగలదు; సర్క్యులర్ మిషన్ (డబల్‌కోర్సు ఉన్నది) అయితే 480,000 కుట్లు వేయగలదు.

1830 లో ఒక చెప్పులజోడు కుట్టడానికి రెండు రోజులు పట్టింది; కాని 1934 లో ఒక్క గంటలో చేయగలిగారు. 'జ్లిన్'లో 1933 నుండి ఒక మెషిన్ పడివుంది. దాన్ని ఎవ్వరూ ముట్టుకొనడంలేదు. ఎందుకంటే, అది మానవులు ఏమీ తాకకుండానే చెప్పులు తయారు చేస్తుంది. (తయారయిన చెప్పులమీద 'లేసు'లు వేయడము తప్ప) దానితో పని చేస్తే, తక్కిన పరిశ్రమ పడిపోతుందని దాన్ని కదిలించడం లేదు.

1914 లో, ఒక మోటార్ కారును తయారు చేయాలంటే, 1500 గంటలు పట్టేది. కాని 1934 లో 230 గంటలు సరిపోయింది. కాబట్టి, యంత్రానికి మానవుడు యజమానియైతే, మానవుని శ్రమ తగ్గించవచ్చుననుట నిశ్చయమైనది.

ఇదంతా, టెక్నిక్, సైన్సూ, అభివృద్ధి చెందడమువల్ల సాధ్యమవుతుంది. అంతర్జాతీయ స్నేహమూ, సంపూర్ణ సంపత్తుగల యుగాన్నీ కోరేదీ, తెలిసికొనేదీ కమ్యూనిస్టు లొక్కరే. సైన్సు న్యాయానికి ముందు ఉంది. కాపిటలిజం సైన్సు అభివృద్ధిని ఆపి, న్యాయాన్ని ప్రతిరోధించ దలచుతుంది. కావి, మేమో, సైన్సునూ, న్యాయాన్నీ పొందికలోకి తీసుకవస్తాం. అట్టిది సాధ్యమని మాకు తెలుసు.

ప్రొఫెసర్ లాంగెవిన్ ఇలా వ్రాశాడు.

"ఫ్రాంసులో మనకు ఎలక్ట్రిక్ సప్లయి విధానం వుంది. అది ప్రతి మనిషికీ, ఒక బానిస (మెషిన్)ను ఇవ్వగలదు. ఆ బానిస పని చేయడానికిష్టపడతుంది. జ్ఞానం కలది, తర్ఫీదు పొందినది, ఏరోగాలూలేవు. విచిత్ర అంగ నిర్మాణం, ఇదివరకెరుగని శక్తి (ఎనర్జీ). అపారమైన పొందికా (ఎడాప్టబిలిటీ) గల 400 లక్షల బానిసలున్నాయి ఫ్రెంచి ప్రజలకు. అవి మనల్ని వేడి చేయగలవు, చల్లబఱచగలవు, వెల్తురు నీయగలవు, సంతోష పెట్టగలవు, సంరక్షించగలవు, వంటచేసి పెట్టగలవు, ఇండ్లు గట్టిపెట్టగలవు, చూడగలవు, స్పర్శ జ్ఞానం (Feel) కల్గియుండగలవు.... వాటి సహాయంతో ప్రాచీన చరిత్రలో చెప్పబడిన, నీచ బానిస మానవులు లేని మానవాతీతుని (సూపర్ మేన్) కథలాగా, మనం ఆనందింపవచ్చు."

కేపిటలిస్టు దోపిడీ లేని ఆర్థిక విధానములో, జాతిశ్రమతో ఉత్పత్తి చేయబడిన దంతా, జాతి కంతకూ తిరిగి ఈయబడుతుంది. సోషలిస్టు ఫ్యాక్టరీలోని కార్మికులు మొదటిది వ్యక్తిగతంగానూ, రెండవది సాముదాయక ప్రభుత్వపు మెంబరుగాను, వారి ఫ్యాక్టరీ ఉత్పత్తినుండి లాభం పొందుతారు. ఉత్పత్తియొక్క విలువ, జీతాల రూపకంగానేగాక, ఆర్థిక, సాంఘిక, వైజ్ఞానిక ఖర్చుల రూపకముగా వారి కీయబడుతుంది. దోపిడీ, సర్ప్లస్ విలువా, అదృశ్య మవడం వలన, పరాన్నభుక్కులు నశించిపోతారు. పని చేయు గంటలు తగ్గిపోతాయి. దుఃఖమూ—బాధలతో గూడిన పూర్వపు అధికోత్పత్తి అసంభవమైపోతుంది. మానవులు తమ విశ్రాంతి కాలాన్ని, తమ వికాసానికి, అభివృద్ధికీ ఉపయోగించుకొంటారు.

* * *

1936 ఎన్నికలలో మా పార్టీ ఎందుకు అభివృద్ధి చెందిందో, ఆ నాటినుండి త్వరితగతిని అభివృద్ధి పొందినదో పాఠకులు గ్రహించి ఉంటారు. ఒక్క సంవత్సరములో కమ్యూనిస్టు పార్టీ సంఖ్య, మూడు రెట్లయింది. ఇపుడు (1937) 350,000 మంది. కార్మిక వర్గముయొక్క ప్రధాన అవసరాలను మఱచిపోకుండా, ఫ్రెంచి దేశానికి సరిపోవు పరిస్థితులకు తగిన వాస్తవ విధానాన్ని (రియలిస్టిక్ పాలసీ) అవలంబించుటచేతనే మా పార్టీ కింత అభివృద్ధి కల్గింది. ఫ్రెంచి కమ్యూనిస్టు పార్టీయే 'పాప్యులర్ ఫ్రంటు'ను కనిపెట్టింది. అది ఫ్రాంసులో, చిరకాలం నిలిచేటటువంటి రాజకీయ వాతావరణాన్ని ఒకటి సృష్టించింది.

దాని అంతిమ ఆశయం మనుష్యులందరూ సమానముగా ఉండే సంఘాన్ని నెలకొల్పడం. కాని కమ్యూనిస్టు పార్టీ యెపుడూ దైనందిన కార్యక్రమాన్ని వదలిపెట్టలేదు. ఎందుకంటే, ప్రస్తుతమున్న విధానంలో కూడ, దారిద్ర్యాన్ని ఎదిరించి పోరాడటము, ఆర్థిక చలనాన్ని (యాక్టివిటీ) ముందుకు త్రోయడం సంభవమని నమ్మింది కాబట్టి.

"ప్రాక్టికల్‌గా చూస్తే, ప్రతి దేశంలోని కార్మిక వర్గ పక్షాలయొక్క వృద్ధి చెందిన, దృఢమైన భాగమే కమ్యూనిస్టు పక్షం. ఆ పక్షం అందరినీ ముందుకు నెట్టుతుంది. ఇక సిద్ధాంత రీత్యా చూద్దాం. సరిగా నడకను అర్థముచేసికోవడము, పరిస్థితులను అవగాహనం చేసుకోడం, శ్రామిక ఉద్యమంయొక్క ప్రధాన ఫలితాలను గ్రహించడం—ఇవన్నీ గాక వీరికిపెద్ద శ్రామిక ప్రజా సామాన్యం ఉన్నది."

అని కమ్యూనిస్టు మానిఫెస్టోలో మార్క్సు, ఎంగిల్సులు వ్రాశారు.

మా కమ్యూనిస్టు పార్టీ విజయానికి మూడు కారణాలు చెప్పవచ్చు.

(1) సమయానికి అవసరమైనట్టియూ, ఫ్రెంచి ప్రజల ప్రజాస్వామిక సాంప్రదాయాల ననుసరించియు, ఇచ్చిన, సుబోధకమైన, నిశ్చితమైన కార్యక్రమం.

(2) పార్టీయొక్క సంఘటన (ఆర్గనైజేషన్) పార్టీ పనిచేసేపద్ధతి, పార్టీ ఆత్మ విశ్వాసము, పార్టీ మెంబర్లందరినీ కలిపే కామ్రేడ్‌షిప్ భావమూ, పార్టీ సభ్యులు తమ ఆశయానికై అర్పించే త్యాగమూ, వారి ప్రాణాలు ఎందుకొరకు అర్పించబడుతున్నాయో, ఆకారణమూ; మార్సెలె కాచిన్, జాక్వెస్ డక్లస్, మార్సెల్ గిట్టన్‌వంటి కమ్యూనిస్టు నాయకుల (పెద్దలూ—పిన్నలూ) గుణాలూ.

(3) కమ్యూనిస్టు మునిసిపాలిటీలలో వారి పరిపాలన, కమ్యూనిస్టులు అధికారం గలచోట వారి నూతన సృష్టి, మొదలుగాగల కమ్యూనిస్టు పార్టీ గావించిన కార్యాలు.

ప్రజాసామాన్యం, వారి కార్యక్రమం యొక్క నిపుణత, తెలివితేటలను అర్థం చేసికొన్నారు

రక్షణ ఆర్థిక సంస్కరణలకోసం, ప్రజాస్వామ్య హక్కుల రక్షణ కోసం, జరిగే పోరాటంలో కార్మికులను మధ్యతరగతి ప్రజలను ఎలా కలపాలో, కమ్యూనిస్టులకు తెలుసు. శాంతిని రక్షించుటయందు, ఫేసిజాన్ని ఎదుర్కొనుటయందు పార్టీ చేసిన పనిద్వారా ఇదివరకు వ్యతిరేకంగాను, ఎడబాటుగానూ ఉన్న ప్రజలలో సైతం, కమ్యూనిస్టు పార్టీ పలుకుబడీ, బలం సంపాదించిందంటే ఆ అభివృద్ధి ఎంతో మనం అర్థం చేసికోవచ్చు.

పార్టీ సంఘటన, దాని అంతర్జీవితం, కామ్రేడ్‌షిప్ భావం, ఉత్సాహం, ఆత్మ త్యాగం, ఫేసిజానికి వ్యతిరేకముగా ప్రజాస్వామ్య శక్తులు ఎక్కడెకడ అడ్డుగోడను కడుతున్నాయో, అక్కడక్కడ కమ్యూనిస్టులు ప...దు తయారు గావడం—ఈ సుగుణాలే ఫ్రెంచి కార్మికుల వృద్ధి పొందుతూన్న సానుభూతిని మా పార్టీ పొందగల్గేటట్లు చేసినయి.

మా విరోధులు మమ్మల్ని మాస్కో ఏజంట్లని, మాస్కో డబ్బు తింటామని, మాకు బుర్ర లేదని, మాలో చొచ్చుకుపోయే శక్తి (ఇనీషియేటివ్) లేదనీ, మాస్కో ఆర్డర్లకై ఎదురు చూస్తామని ప్రచారము చేస్తారు. ఎంత పిచ్చి! మేం రోజూ చేసే పనులే, మా ప్రాణాలే మాకు సాక్ష్యము. మా సెల్స్‌లోను, శాఖలలోను, జిల్లా కమిటీలలోను, జరిగే వాద వివాదాలే, మేము పెద్ద సంఘటిత ప్రజాస్వామ్య పక్షాన్ని నిర్మించామని తెలియజెప్పుతాయి. సోవియట్ యూనియన్ యొక్క ఛాంపియన్లని మమ్మల్ని అధిక్షేపిస్తే, దానికి మేం గర్వపడతాం. ఎందుకంటే, సోవియట్ కామ్రేడ్‌లూ తామూ ఒకటేనని పూర్తిగా భావించే ఫ్రెంచి కార్మికుల గట్టి నమ్మకాన్నే మేము వెల్లడించుతున్నాము. కమ్యూనిస్టు పార్టీ తదితర పక్షాలవంటిది కాదు. అది ఒక పెద్ద కుటుంబం. అది ప్రతి సభ్యునీ వ్యక్తిగతంగా కనిపెట్టి, క్షేమ సమాచారాల్ని చూస్తూ ఉంటుంది. అపాయ సమయాలలో కమ్యూనిస్టుపార్టీ తన సభ్యులను, సంపూర్ణ వీరయుతమైన బలి గావించమని అడుగుతుంది, కాని "మానవత్వమే మన పవిత్రమైన పెట్టుబడి"అనే మాటను మరచిపోదు.

ప్రజా శత్రువులు చిత్రించినట్లు కమ్యూనిస్టు. సంకుచితుడూ—సెక్టేరియనూ—మూర్ఖ భల్లూకమూ (ఫెనటిక్) కాదు అతడు మానవులలోకెల్ల దయార్ద్ర హృదయుడు. కేపిటలిస్టు సంఘంలో పుట్టడం వలన, బానిసత్వములో పెరగడం వలన, మానవజాతిపై కేపిటలిజం వెదజల్లిన విష వాసనల వలన, అతనికి కూడా కొన్ని లోపా లుండవచ్చు: కొన్ని తప్పులు చేయవచ్చు. కాని కమ్యూనిస్టు ఎప్పుడూ ఈదోషాలనుండి విముక్తినొంద ప్రయత్నించుతాడు. భవిష్యత్ నౌకకు చుక్కానిలాగా, పురోభాగానికి నాయకునిలాగా నడుచుకోటానికి ప్రయత్నించుతాడు.

ఏదైన ఒక ప్రత్యేక పరిస్థితికి పార్టీ దృక్పథమును తెలియజేసే ముందు, ఆ విషయాన్ని, ప్రతి పార్టీ సభ్యుడు—నాయకుని మొదలుకొని అనుచరుని వరకూ—తన గ్రూపులో చర్చించుతాడు. సైంటిఫిక్ సోషలిజం (శాస్త్రీయ విజ్ఞానం) ప్రధాన సూత్రాలకు బద్ధుడవుతూ ప్రతి సభ్యుడూ తన అభిప్రాయాలను ముందు పెట్టి తదితర కామ్రేడ్‌లను ఒప్పించడానికి ప్రయత్నించుతాడు, ప్రయత్నించి తీరాలి. ఒక పార్టీ సభ్యుడు సరియైన త్రోవలో ఉన్నాడని అందరూ అంగీకరించితే, అతని భావాలు గెలుస్తాయి. తదితర మెంబర్లు అతని వ్యక్తిగత ధైర్యాన్నిబట్టి, గుణాల్నిబట్టి, అవసరమైన స్థానంలో ఉంచుతారు. ఒకసారి వాద వివాదం జరిగి పోయాక ఇక మిగిలింది కార్యాచరణ. ప్రతివాడూ అధిక సంఖ్యాకుల నిర్ణయానికి బద్ధుడైయుండాలి. ఈ విధముగా కమ్యూనిస్టు పార్టీ, సుశిక్షితమైన పంధాను ఒక్క మనిషిలాగా నడిచిపోతుంది. ఎన్నుకోబడిన నాయకత్వం, పార్టీ నిర్ణయాలన్నీ కొనసాగేటట్లు, ఎవరూ తమ కర్తవ్యాన్ని తప్పించుకొని తిరగకుండేటట్లు చూస్తుంది. ఛాంబర్సు మెంబరు కానీ, సెనెట్ మెంబరు కానీ, గ్రామ కౌన్సిలు మెంబరు కానీ, పట్టణ కౌన్సిలు మెంబరుగానీ, ఎవరయినా సరే, కేంద్ర పార్టీ యొక్క డైరక్టు కంట్రోల్ క్రింద ఉండి. నిర్ణయాలను కొనసాగించుతారు.

రాజకీయపు మోసాలు ఎక్కడ ఒకదాని వెనుక ఒకటి జయించుతాయో, ఎక్కడ ధనాశవలన ప్రజా ప్రతినిధులు లంచాలకు లోబడతారో, ఎక్కడ కార్మికుల విశ్వాసాన్ని చూరగొనడాన్ని ఎరిగిన మనుజులే అపర్ఛానిస్టులై విద్రోహాల కొడంబడుట బయటపడుతున్నదో, ఎక్కడ పెద్ద వ్యాపారం అమ్మకానికున్న ప్రతి వస్తువునీ—మనుష్యుల్నీ-వస్తువుల్నీ సమానంగానే—కొని బానిసత్వ మిస్తుందో, అట్టి పెట్టుబడిదారులచే ఏలబడే దేశములో, కార్మికులచే ఎన్నుకోబడుటకు అభ్యర్థిగా మాపార్టీ వారిని నియమించునపుడు మేం తగిన హామీలను కోరవలసి వచ్చింది.

ఆర్థిక సంబంధమైనట్టిగాని, రాజకీయసంబంధమైనట్టి గాని అపనిందలతో అపవిత్రుడైన కమ్యూనిస్టు సభ్యుడొక్కడూ లేడు. పార్టీలోకి దరిద్రుడుగా వచ్చిన సభ్యుడు దరిద్రుడుగానే ఉన్నాడు. ఒక్కసారి ఎన్నుకొన్నపిదప, వారు మా నియమాలకు కట్టుబడి ఉన్నారు. మార్క్సు క్రింద చెప్పినట్లు 1871 పారిస్ కమ్యూన్ నాయకుల వలెనే వీరు కూడ పార్టీకి బద్ధులైనారు.

"వారు తమ పనిని, విధేయతతోను, ఆత్మవిశ్వాసంతోనూ, నైపుణ్యముతోనూ—పూర్తి చేశారు. వారు తీసుకొన్న జీతాలా—(లండన్) మెట్రోపోలిటన్ స్కూల్ బోర్డు సెక్రటరీకి అవసరమయిన దానిలో 5 వ వంతు మాత్రమే."

(కారల్ మార్క్సు; సివిల్ వార్ ఇన్ ఫ్రాన్సు)

ఈ ఒక్క విషయమే ఓటర్లు ముందు స్వార్థానికై ప్రయాసపడిన వారిని తరుమగొట్టగల్గింది. మమ్మల్ని ఆకర్షించదలిచే డ్రాయింగ్ రూముల లోని ధనవంతులగు ఉద్యోగస్తులతో, మాకు మాట్లాడడం చేతగాకపోవచ్చు. కాని మాకు ప్రజాసామాన్యంతో ఎలామాట్లాడాలో తెలుసు. కార్మిక వర్గంతో మే మెపుడూ అబద్ధ మాడం. మేము వాళ్ళని కోతలుకోసి బుఖాయించం. మేము చేయగల్గిన దేదో, దానినే వాగ్దానం చేస్తాము.

కమ్యూనిస్టు పార్టీ తన సైనికుల (మిలిటెంట్) క్షేమాన్ని మాత్రమే కోరదు. అది పార్టీ సభ్యుల కుటుంబాల, భార్యల, బిడ్డల క్షేమ మందు కూడా అసక్తి చూపుతుంది. తన సైనికుడు ప్రతివాడూ తన పార్టీ మెంబరుగా ఉండటమేగాదు—అతడు ఒక కుటుంబం గల మానవుడు కావాలనే అది కోరుతుంది. ప్రజల సైనికుని, అతని కుటుంబాన్నుండి చీల్చి వేయదు—అది మహా ప్రజా సైనిక సైన్యంలో ఆ కుటుంబం కూడా కలిసేటట్లు చూస్తుంది సైనికుని కుటుంబము పార్టీకి బయట ఉన్నప్పటికీ, దాని యెడల అదే విధమైన ఆదరణ చూపి, పార్టీ ఒడిలోకి లాగి ఆదరించుతుంది. తనకు ప్రియమైన వారి యెడల పార్టీ అలక్ష్యము చూపదని తెలిసినపుడు కమ్యూనిస్టుయొక్క పని ఎంత సులభము—ఎంత ఆహ్లాదకరము!

ఆమె భర్త కమ్యూనిస్టు పార్టీలో చేరాడు కాబట్టి, భార్య ఒంటరిగా ఉండవలసిన అవసరములేదు. సైనికుడు, తన భార్యతో కాలక్షేపము చేయడానికి, తన పిల్లల చదువు సంధ్యలు చూచుకోడానికీ అతనికి విశ్రాంతి ఉండాలి. తన కుటుంబములో వెనుకబడినవారిని, మన పెద్ద మీటింగుల లోకి, మన సాంఘిక స్థితికి తీసుకురాగల్గి ఉండాలి,

కమ్యూనిస్టు పార్టీ, కలలుగనే వారి పార్టీ గాదు, గొంతెమ్మ కోర్కెల కోరే వారి పార్టీ గాదు, చాటర్‌బాక్సు (అతిగా వాగేవాళ్లు)ల పార్టీ కాదు, గర్వపోతుల పార్టీ కాదు. పని చేసే పార్టీ ఇది, ఇదే మ్యునిసిపల్ ప్రభుత్వంలో చూపెట్టింది. పార్టీ చేసిన పనియే ప్రజా సామాన్యపు ప్రోద్బలాన్ని సంపాదించ గల్గినది. ఎంత ద్వేషము చూపినా ఎన్ని నిందలు మోపినా—కమ్యూనిస్టు పార్టీ శత్రువులు గౌరవాన్ని చూపడము కూడా కారణం కమ్యూనిస్టు పార్టీ చేసిన పనియే. కమ్యూనిస్టుల చేతిలో ఉన్న పట్టణాలలో అద్భుతమైన అభివృద్ధి జరిగింది. మన శత్రువులు ఈ ప్రదేశాన్ని, కమ్యూనిస్టులు ధ్వంసం చేస్తున్న ప్రదేశమనీ, 'రెడ్‌బెల్టు' అనీ పేరుబెట్టి ప్రచారము చేశారు. కమ్యూనిస్టులు చేయు ప్రయత్నాలన్నిటికీ, బూర్జువా 'లా' అడ్డం వచ్చింది. రియాక్షనరీలు మన ప్లానులను వ్యతిరేకించడానికి, నాశనము చేయడానికి, మంట గల్పి ద్రోహము చేయడానికి శక్తికొలదీ ప్రయత్నించారు, అయినా ఈ విజయాలను కమ్యూనిస్టులు సాధించారంటే అది గొప్ప విషయం.

మన పోరాటం వృధా కాలేదు. ఫ్రెంచి ప్రజలు మనమంటే చూపే ప్రేమయే మనకు బహుమానం. హృదయానుభూతి, దయ చూపే కార్మిక వర్గ ప్రజాసామాన్య మొక్కటే గాదు దీనిని అర్థం చేసుకొన్నది. అనేక మంది మేధావులు మన పార్టీలో చేరారు. మార్క్సిజం—లెనినిజం—యూనివర్సిటీలలోకి ప్రాకింది. విద్వత్సంబంధమైన కన్సర్వేటిజం ఉన్నా, చాలా మంది ప్రొఫెసర్లు మనలో చేరారు. ప్రసిద్ధ చిత్రకారులు, రచయితలూ, కమ్యూనిజాన్ని సమర్థించుతున్నారు. మేధావులలోని గొప్ప గొప్పవారి ఈ

(మిగతా 11 వ పేజీలో)

కాకినాడ డాక్ కార్మికుల విజయం

కామ్రేడ్ యం. వి. వీరయ్య

స్టీవ్‌డోర్ కూలీల సమ్మె పరిష్కారము

"సమ్మె" 21 రోజులు సాగింది. ఒకరోజు కంటె ఒకరోజు తీవ్రరూపం దాల్చింది. యజమానుల ఎత్తుగడలు, పెంకి సమాధానములు, అడ్డునడవట్లు, కూలీలలో పట్టుదల ఎక్కువగుటకు, కార్మికోద్యమం బలపడుటకు కారణములైనవి.

సమ్మె ముగియనిదే కంపెనీఏజెంట్లు ప్రక్క గ్రామాలకువెళ్లి "సమ్మె ముగిసెను, రేవులో ఓడలు ఎక్కువగాయున్నవి. అక్కడ కూలీలు చాలుటలేదు. పని చేయుటకు రండి"అని అచ్చటి కూలీలతో చెప్పుచుంటే కార్మిక రక్షకభటులు కాలినడకను ఊరూరవెళ్ళి నిజపరిస్థితులను వెల్లడించి కూలీలను రాకుండ ఆపుచేసిరి.

కూలీలలో కులకక్షలు, పేటలకు పేటలకు పార్టీలు లేవదీసి కూలీలను తీసుకువెళ్ళ ప్రయత్నిస్తే, సోషలిస్టులు కూలీలకు, కూలీలకుగల పరస్పర సంబంధమును తెలియజేసి వారిలో ఐకమత్యమును పెంపొందజేసిరి.

కంపెనీలకు సంబంధించిన యితర పనులు చేయు కూలీలను యీ పనికూడ చెయ్యమని బలాత్కారముచేసి, వప్పుకోనంటే పని తీసివేస్తానని బెదరిస్తే సోషలిస్టులు వారినికూడ సంఘటనజేసి వారి హక్కులకొరకు సమ్మె చేయుటకు సిద్ధపరచిరి.

ఓడ వచ్చుటకు రెండు లేక మూడురోజులు ముందే కంపెనీల ఏజెంట్లు వేరు పనులకై కూలీలను పిలచి, ఎక్కువగా త్రాగించి బజానాలుయిచ్చి రహస్యముగా బంధించగా, కూలీ సంఘమువారు. తమ గూఢచారులద్వారా యీ సంగతులు తెలుసుకొని, తక్షణమే ఆ బంధింపబడిన కూలీల యిండ్లకువెళ్లి, వారి బంధుమిత్రులకు పరిస్థితులుచెప్పి, వారి నందరిని ఆకంపెనీ ఏజెంట్ల యిండ్లకు తీసుకువెళ్ళి మొరబెట్టించిరి. ఎంత రహస్యముగా బంధించినను, ఆ రహస్య గృహములలో పనిచేయు పాకీవాండ్రు, దాసీలు, నీళ్లమోయువారు, వంట చేయువారు, చాకలి, మంగలి మొదలగువారు అంతా కూలీలేగావున వారిద్వారా ఆ బంధించబడిన కూలీలు బయట జరుగుచున్న విషయములు తెలుసుకొని వీలుచిక్కినవారు పారిపోవుట, లేనివారు గోలపెట్టుట జరిగెను.

కొద్ది మందిని ఏదోవిధముగ మాయజేసి పడవ ఎక్కించబోవగా కార్మిక రక్షక భటులు త్రోవకు అడ్డముగా పడుకొనిరి. అంతవారిని పోలీసులు కాళ్లు, చేతులు పట్టుకొని ప్రక్కకు యీడ్చివేసిరి. అందువలన 4 గురికి గాయములు తగిలెను. దీనివలన కూలీలలో పట్టుదల మరింత ఎక్కువయ్యెను. కూలీ స్త్రీలే వెయ్యి మంది తమ పిల్లలతో రోడ్లపై పడుకొనెదమని నిర్ణయించుకొనిరి.

యజమానుల సదోపదేశాలు వినకున్న కూలీలు నష్టపడుదురని యూనియన్ మాటలు వినవద్దని బెదరిస్తూ కంపెనీవారొక కరపత్రము ప్రకటించిరి. దానివలన ప్రయోజనము లేకపోయెను సరిగదా మరింత యుద్రేకము బయలుదేరెను.

రంగూన్ పేసింజర్ ఓడలో ఒక సోషలిస్టు కూలీల కరపత్రములు పంచిపెట్టగా మెరీన్ పోలీసులు అతనికి సంకెళ్ళువేసిరి. దానిపై ప్యాసింజర్లు షుమారు 400 మంది దిగిపోయెదమని చెప్పిరి. అంత అతని యిష్టమువచ్చినటుల కాగితములు పంచిపెట్టుకోనిచ్చిరి.

ఎన్నో రాజీసమావేశములు జరిగెను. విఫలములయ్యెను. తుదకు 18-2-'39 తేదీ సాయంకాలము జిల్లాబోర్డు ఆఫీసులో జిల్లా కాంగ్రెసు కమిటీ అధ్యక్షులు శ్రీ మల్లిపూడి పల్లంరాజుగారి అధ్యక్షతను సమావేశము జరిగెను. స్టీవిడోర్ యజమానుల ఎసోసియేషన్ ప్రతినిధులు 3 గురు కూలీల సంఘ ప్రతినిధులు యిద్దరు, గవర్నమెంటు ఉద్యోగులు కొందరు మధ్యవర్తులు హాజరై విషయములను చర్చించి ఈ దిగువ షరతులప్రకారము సమ్మె పరిష్కారముచేయబడెను.

1.	పగలు 1కి		రాత్రి 1కి	
	ఇదివర్లో	ఇపుడు	ఇదివర్లో	ఇపుడు
కూలీ 1కి	-9-0	-11-0	-12-0	1-0-0
తండేలు 1కి	-11-0	-13-6	-15-0	1-3-0
లెన్‌జ్‌మెన్	-11-0	-13-0	-15-0	1-3-0

2. ఇదివరలో భోజనమునకై రోజుకు మనిషికి 0-2-0 విలువగల సామగ్రి యిచ్చేవారు, ఇప్పుడు 0-4-0 విలువగల సామగ్రి యిచ్చుటకై అంగీకరించబడెను.

3. ఇదివరలో పనిచేసిన గంటలకుమాత్రమే యిచ్చేవారు, యిప్పుడు ప్రయాణము గంటలకు కూడా యివ్వవలెను.

4. ఇదివరలో గ్యాంగ్ 1కి 16, 18 వుండేవారు ఇప్పుడు గ్యాంగ్ 1కి 20 మందిని తీసుకోవాలి.

5. భోజనముకై ఒకగంట సెలవు ఇచ్చుట.

6. కూలీ సంఘమును యజమానులు గుర్తించుట.

7. ఎవరియుద్యోగములు వారికి యిచ్చుట.

8. సమ్మెచేసిరనే కారణముచే కూలీలకు ఎట్టి నష్టము కలిగించకుండుట.

9 సమ్మె ముగించుట.

సమ్మె యెక్కువ కట్టుబాటులతోను, శాంతియుతముగను జరిగెనని ప్రజా సంఘముల వారే గాకుండ, కంపెనీ యజమానులు, గవర్నమెంటు యుద్యోగులుకూడ సమ్మెనాయకులను శ్లాఘించిరి. సమ్మె మొదటినుండి తుదివరకు కాంగ్రెసు సోషలిస్టుపార్టీ నాయకత్వముననే జరిగెను.

కార్మికసమస్యలు

చిట్టివలస

ఆంధ్రరాష్ట్రి కాంగ్రెసు సంఘ ప్రతినిధి అవమానింప బడుట.

చిట్టివలస జూట్ మిల్లులో మంగళవారము రాత్రి జరిగిన కాల్పులను గూర్చి సమగ్రముగా విచారణ జరిపి నివేదికను ఇవ్వవలసినదని ఆంధ్ర రాష్ట్రి కాంగ్రెసు సంఘమువారు శ్రీ బసవరాజు శ్రీ రంగశాయిగారిని నియోగించారు.

రంగశాయిగారు చిట్టివలసకు వెళ్ళి విచారణ ప్రారంభించి మిల్లు ఏజంటును కలుసుకొనగోరెను కాని ఆయన తనకు గాయములు తగులుటచే జ్వరము వచ్చినందున తనతో మాట్లాడుటకు బదులు జిల్లా మేజిస్ట్రేటుగారితో మాట్లాడవలసినదని తెలిపిరి. అందుపై శ్రీరంగశాయిగారు మిల్లు మేనేజరును కలుసుకొని మాట్లాడ గోరిరి. కాని మిల్లు మేనేజరు తనతో మాట్లాడిన ఏమీ ప్రయోజనములేదని, తొందరలోనే ప్రభుత్వం పూర్తిగా విచారణ జరుపునని, అంతలోగా శ్రీ రంగశాయిగారు జిల్లా కలెక్టరుగారితో మాటాడవలసినదని సమాధాన మిచ్చారు.

మద్రాసు రెవెన్యూ బోర్డు మెంబరు స్టీవార్టుగారును, లేబరు కమీషనరు యస్. వి. రామమూర్తి ఐ. సి. యస్. గారును యీ కాల్పులను గూర్చి విచారించుటకై 18 వ తేదీ రాత్రి మదరాసునుండి బయలుదేరిరి.

బెజవాడ.

గవర్నరుపేట కార్మిక సంఘం.

ది 17-2-39 తేదీన గవర్నరుపేట కార్మిక సంఘ కార్యాలయమున గోపు అప్పలస్వామిగారి అధిపత్యముక్రింద సాధారణ సభ్యులు సమావేశమై యీ క్రింది తీర్మానములు యేకగ్రీవముగా ఆమోదించిరి.

1. 23 వ వార్డులో క్రొత్తగా వేయవలసిన రోడ్లు రైతులు మునిసిపాలిటీకి రిజిష్టరు పూర్వకముగా హేండోవరు చేసిన స్థలములో వేయుటకు, నిలచిన 4 రోడ్లును మునిసిపాలిటీవారు వేయించుటకున్నూ, మునిసిపల్ కమీషనరు, చైరుమన్‌గార్లకు మహజర్లు పంపుటకు తీర్మానించడమైనది.

2. 23 వ వార్డులో ఎలిమెంటరీ స్కూలు లేనందున చాలామంది కార్మిక పిల్లలు చదువుకొనుటకు చాలా కష్టముగానున్నది. కనుక మునిసిపాలిటీవారు వెంటనే యీ పేటలో స్కూలు ఏర్పాటుచేయుటకు పూనుకొనవలెనని కోరుచున్నాము.

3 23 వ వార్డులో లైట్లు, నీళ్ళకుళాయిలు, ధర్మ హాస్పిటలు లేనందున కార్మికులు చాలా యిబ్బంది పడుచున్నారు గనుక మునిసిపాల్టీవారు వీటిని వెంటనే యేర్పాటుచేయుటకు తగు శ్రద్ధతీసుకొనవలెనని కోరుచున్నారు.

4. 21 వ వార్డులో వున్న పాయఖానాదొడ్లు యిటీవల మ్యునిసిపాలిటీవారు తీసివేసిరి. ఇందుకు వారి చర్యయందు అసంతృప్తి వెల్లడిచేయుచు వెంటనే పాయఖానాదొడ్లు కట్టించగలందులకు ప్రార్థించుచున్నాము.

ప్రోద్బలం మన కాలంలో గమనింపదగిన విషయం. శ్రామికులు సంతోషపూర్వకముగా స్వాగత మిచ్చే తాత్వికులు, పండితులు, వేదాంతులు, పరిశోధనల సల్పేవారు—వేలకొలది జనులున్నారు. ఫ్రెంచి ప్రజాసామాన్యము యొక్క ప్రత్యక్ష సంబంధము వలన వారికి నైతిక, మానసిక పునర్జన్మ కల్గింది.

ప్రజాసామాన్యంతోటి—ప్రపంచ సంపదను సృష్టించే ఆ ప్రజలతోటి—సంబంధము వలన మేధావులు, సాహిత్యము యొక్క, కళ యొక్క—గొప్ప గొప్ప భావనల నన్నిటినీ తిరిగి కనిపెట్టారు. కమ్యూనిస్టు పార్టీ ఫ్రాంసు నిరంతరాభివృద్ధిని కోరుతుందనీ, ఫ్రెంచిదేశ సత్ సాంప్రదాయాలకు తగిన వారసులనీ: ఫ్రెంచిదేశ విజ్ఞానానికి నిజమైన ప్రతిబింబమనీ; ప్రతిరోధానికి వ్యతిరేకముగా మానవత్వం కోసము పోరాడిన 'రాబెలైసు మొదలుకొని డిడెరాట్' వరకు గల గొప్ప వైజ్ఞానికు లందరియొక్క వారసురాలనీ; మేధావులు గుర్తించారు. ప్రాచీన విజ్ఞానాన్ని భద్రపరచడము, మన సాంఘిక రాజకీయ వికాసం తెలియ జేయడానికి చాలదా? బూర్జువా చిత్రకళ నశించిపోయి, సర్వసాధారణమైన బూతు బొమ్మల క్రింద తయారవుతుంటే, కమ్యూనిస్టులు ప్రాచీన రోమన్, గాలిక్ శిధిలతలకై వెదుకుతున్నారు. మానవ చరిత్రను గురుతింపజేసే ప్రాచీన నాగరీకతా చిహ్నాలకై శోధించుతున్నారు. 1936 లో 'కొర్రెజీ' ప్రతినిధిగా ఎన్నుకోబడిన మారియస్ వెజీల్లెస్ అనేఆయన లిమోజెస్ పర్వతాల మధ్య దొరికిన శిధిలాలతో, నియోజకవర్గంలోని రైతులకు ఒక చిత్రశాల నిర్మించుతున్నాడు. దానిలో, ప్రాచీన సంఘం నుండి భూస్వామ్య సంఘం వరకు—భూస్వామ్య సంఘం నుండి, కేపిటలిస్టు సంఘం వరకు—మానవుడు మానవునిచే దోపిడీ చేయబడి ఆహుతియైన మృతజీవులు కమ్యూనిస్టు సంఘానికి, భవిష్యత్ వర్గ రహిత సంఘానికి ఎలా దారితీస్తాదో; ఆ పరిణామాన్ని అంతా చూపించే చిత్రశాలను నిర్మించుతున్నాడు.

ఆ విధముగా కమ్యూనిస్టు పార్టీ ప్రాచీన ప్రఖ్యాతికి సరియైన వారసురాలు. దాని విజయాలను అది అర్థము చేసుకొన్నది. తన దేశాన్ని మహోన్నత స్థానానికి నడుపుతూ, పోరాటములోని అగ్ర భాగాన్ని అది కోరుతుంది.

తన సోదర కార్మికులకు - భుజము భుజమూ కలిపే తన కామ్రేడ్‌లకు- బాధపడే శ్రమపడే వారందరికీ - వినయముగా ఈ గ్రంథాన్ని సమర్పించుకొంటున్నాడు ఈ కమ్యూనిస్టు యోధుడు. ప్రపంచాన్ని ప్రచండ ఝంఝూమారుతం ఊగిసలాడించినపుడు, మానవత్వమనే నౌక, అనాగరికత యనే పర్వతాలకు తగిలి బ్రద్దలయి మునిగిపోదనీ, ఫ్రెంచి ప్రజా దీక్షం చేత నడుపబడి-ఒక కవి చెప్పినటుల- 'స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం అనే భవిష్యత్కాంతి'లోకి ప్రయాణంచేస్తుందనీ ఇతడు గాఢంగా విశ్వసించుతాడు.

అఖిలభారత సంస్థాన ప్రజా మహాసభ

జవహరిలాల్ నెహ్రూగారి అధ్యక్షోపన్యాసము


అఖిలభారత సంస్థానప్రజల మహాసభ జవహరిలాల్ నెహ్రూగారి అధ్యక్షతను ఫిబ్రవరి 15, 16, 17 వ తేదీలలో లూధియానాలో జరిగింది. సభలో నెహ్రూగారిలా ఉపన్యశించారు.

"వివిధ సంస్థానాలలో ప్రభువుల నిరంకుశత్వం దుష్పరిపాలన, అవినీతి వర్తనముల క్రింద కృంగి కృశిస్తూన్న సంస్థాన ప్రజలలో నేడు కలిగిన స్వాతంత్ర్యపిపాస, చైతన్యము అద్భుతమైనవి. వీరి పోరాటాల వలన 1938 వ సంవత్సరం భావిభారత దేశీయ చరిత్రలో అత్యుత్తమస్థానాన్ని అక్రమిస్తుంది నేనీ మహాసభకు మీ ఆజ్ఞానుసారము అధ్యక్షత వహించాను. సంస్థాన ప్రజల స్వాతంత్ర్యము పట్ల నాకున్న అభిమానమే గాకుండా, దానిపట్ల ఇతర భారతీయుల సానుభూతి వారి ఐక్యత కూడా నన్ను మీకడకు ప్రతినిధిగా పంపాయి.

సంస్థానాల విషయమై కాంగ్రెసు వాదులలో వాద వివాదాలనేకం జరిగాయి. దీని విషయమై పరిస్థితులు మారినకొద్దీ, సంస్థానాలపట్ల కాంగ్రెసు వైఖరి మారుతూవచ్చింది. భారతదేశంలోని స్వాతంత్ర్య పోరాటం సంస్థానాల ప్రజలలో మార్పును తీసుకువచ్చి వారిని పోరాటానికి సిద్ధంచేసింది. యీ విషయాన్ని కాంగ్రెసు గ్రహించి, భారతదేశీయ ఐక్యతను స్థాపించడానికై సంస్థానాలలో ఆర్థిక, రాజకీయ, స్వాతంత్ర్యం స్థాపన అయితీరాలని దానికై పోరాడడం, తన హక్కు, బాధ్యత అని హరిపురా కాంగ్రెసులో తీర్మానించింది. ఈ విషయములో తటస్థవిధానం అన్న ప్రశంస లేనేలేదు. భారత దేశానికి, భారతీయులకు సంబంధించిన విషయాలలో కలుగజేసుకోడానికి కాంగ్రెసును ఎవరూ అభ్యంతర పెట్టలేదు. దేశంమేలుకోసం ఇట్టి విషయాలలో కాంగ్రెసు కలుగజేసుకు తీరాలి. లేకుంటే కాంగ్రెసు తన ఆశయానికి ద్రోహంచేసేందవుతుంది. కాని యీపనికి పరిస్థితులను కాలాన్ని కాంగ్రెసు నిర్ణయించుకోవాలి. హరిపురా కాంగ్రెసు నిర్ణయించుకోవాలి. హరిపురా కాంగ్రెసు తీర్మానించిన తాటస్థ్యం, పరిస్థితులనుబట్టి కాంగ్రెసు స్వయంగా విధించుకున్నదే గాని పరుల నిర్బంధించినదిగాదు. సంస్థానాలు మారితేనేగాని భారత స్వాతంత్ర్యం మిధ్యఅని కాంగ్రెసు గ్రహించి అందుకై త్వరపడుతోంది. కాని, అందుకై సంస్థానప్రజల స్వయం కృషి అవసరమని కాంగ్రెసు తాత్కాలికంగా తాటస్థ్యాన్ని వహించింది.

అన్ని సంస్థానాలలోనూ సంచలనం కలిగింది. కొన్నిటిలో మహత్తరమైన ప్రజాఉద్యమాలు విజృంభించాయి. భారతజాతీయ సమరంలో సంస్థాన ప్రజా ఉద్యమం ముందంజ వేస్తోంది. యీ పోరాటాలన్నీ జోరించి బ్రిటిషు ప్రభుత్వాన్ని ప్రతిఘటించవలసిన కాల మాసన్నమైంది. పోరాట విధానాలు మారినా, రంగాలుమారినా, పోరాటం మాత్రం ఒక్కటే.

భారతదేశంలో మొత్తంమీద పెద్దా, చిన్నా కలసి సుమారు 600 సంస్థానాలున్నాయి. ఇందు కొన్ని చాలాచిన్నవి. వీటిలో ఒక్కొక్క సంస్థానికి అన్ని విషయాలలోనుకూడా ఎంతో తారతమ్యం ఉంది. పరిశ్రమలలోను, విద్యలోను కొన్ని చాలా అభివృద్ధిపొందినా పరిపాలకులు అక్కడక్కడ మంచివారైనా మొత్తంమీద సంస్థానాలన్నీ చాలావరకు నీచాతి నీచ పాలనక్రింద ఉన్నాయి. పరిపాలకుల మంచిచెడ్డలెలాగున్నా అసలుపద్ధతిలోనే దోషంవుంది. మిగతా ప్రపంచంలో యీ పద్ధతి అంతమయింది. విదేశీయుల జోక్యమే లేకపోతే యీపాటికి మనదేశంలో కూడా నిర్మూలమయి ఉండేదే. బ్రిటిషు సామ్రాజ్యవాదం తన స్వప్రయోజనాలకై యీ సంస్థానాల విధానాన్ని పోషించి, కృత్రిమంగా నిలబెట్టడంవల్లనే నేటి వరకూ ఇది జీవించి ఉండ



గలిగింది. యీలోగా ప్రపంచంలో అనేక విప్లవాలు వచ్చాయి. సామ్రాజ్యాలుకూలిపోయాయి. స్వతసిద్ధంగా యీ విధానంలో ప్రయోజనం, బలం, ఏమీలేదు. మనదేశంలో ఇది బ్రిటిషు సామ్రాజ్యవాదం యొక్క వివిధముఖాలలో ఇది ఒకటి. అందుచే పోరాటంసంభవించినపుడు మన అసలు విరోధి బ్రిటిషుసామ్రాజ్యవాదమని మనం గుర్తించాలి.

సంస్థానాలు స్వతంత్రములయినవని, వాటికి బ్రిటిషుప్రభుత్వంతో పవిత్రమైన శాశ్వత ఒడంబడికలు ఉన్నాయని ఏవేవో చెపుతున్నారు. అవన్నీ నిమిత్తమాత్రమైనవే.

అంతర్జాతీయ వ్యవహారాలలో సామ్రాజ్యవాదులకు సరిపడక పోయినపుడల్లా యింతకన్న పవిత్రంగా ప్రదర్శింపబడే రాజీ ఒడంబడికలన్నీ చిత్తు కాగితాలవలె తోసివేస్తారు. కాని సామ్రాజ్యవాదులకు వీసమంతైనా నష్టం కలుగుతోన్నప్పుడు ప్రజా సామాన్యానికి ఎంత చేటుకలిగినా యీ ఒడంబడికలన్నీ ఉండవలసిందే నంటారు. ఎప్పుడో 125 ఏళ్ళ క్రింద ప్రజాసామాన్యం యొక్క అనుమతి యైనా లేకుండా, ఎవరెవరో చేసుకున్న ఒడంబడికలకి ప్రజలను బాధ్యులను చేయడం రాక్షసత్వం. కుట్రలు పన్ని ప్రజలపై దౌర్జన్యంచేసి రాసుకున్న ఒడంబడికలకు లొంగి తమరక్తాన్ని ప్రజలు పరులకు ధారపోయజాలరు. యీఒడంబడికలను మన మేమాత్రమూ సరకుగొనము. మనపై పెత్తనం చేయగలిగినది ప్రజల సంకల్పము. మనం లెక్కచేసేది ప్రజల మేలు. ఇంక దేనికీ తలయొగ్గము. భారతదేశ పరిపాలన మనే తెరమీద సంస్థానాలు బొమ్మలు. వీటి నాడించేది బ్రిటిషు ప్రభుత్వం. స్థానిక రెసిడెంటుదే సర్వాధికారం. యిటీవల మంత్రులను కూడ వారే నియోగించారు. సంస్థానాలు, బ్రిటీషు యిండియా వేరువేరు ఖండాలుకాదు, అంతా ఒక్కటే.

యీసంస్థాన ప్రజల పోరాటాన్ని ప్రభువులకు మాత్రమే వదలివేస్తే యిదివరకే ప్రభువులులొంగి ఉండేవారు. కొంచం బెట్టుసరి చేసినా ప్రజలు లొంగదీసేవారు. అంతకీ లొంగకపోతే ప్రజా బలం వారిని, ఊడ్చివేసి యుండేది ఈనాడు కూడా ప్రపంచం రోజు రోజూ మారిపోతోంది. ఇంక యీసంస్థానాలుకూడా వాటిని బలపరుస్తూన్న బ్రిటిషు సామ్రాజ్యం వలెనే నశించి తీరతాయి-కనుక సంస్థాన ప్రభువులంతా ఔంధురాజావలెనే మారి ప్రజలకు సంస్కరణలివ్వడం ఉచితం. కాని చాలామంది ప్రభువులు ఆచిహ్నాలేమీ ప్రదర్శించడంలేదు. తన పాత్రను నిర్వహించిన తరువాత ఏవర్గమూ కొత్త పరిస్థితులకు అనుకూలంగా మారదు. ప్రపంచం దానిని విసర్జిస్తుంది. కాని అవర్గం, మాసిపోయే తన అధికారాలను నిలబెట్టుకోవాలని వృధాగా ప్రయత్నించి ఉన్నది కాస్తా పోగొట్టుకొంటుంది. 19 వ శతాబ్దంలో పేరుగడించిన బ్రిటిషు సామ్రాజ్య వాదానికే నేడేగతి పట్టిందో చూడండి. ధైర్యం సన్నగిల్లింది. బుద్ధి మందగించింది. వివేచన వీగిపోయింది. కొద్ది లాభాలను కాపాడుకోవాలని పాకులాడుతూ పేరు ప్రతిష్ఠలను తుదకు సామ్రాజ్యాన్ని పోగొట్టుకొంటోంది. సంస్థానాధిపతు లొక లెక్కయా? తమ పని అయిపోయిన తరువాత నిలబడాలనుకునే పై వర్గాల కన్నిటికీ ఇదేగతి తప్పదు. చరిత్రనేర్పిన యీ పాఠాన్ని సంస్థానాధిపతులు మనకు తిరిగి జ్ఞాపకం చేస్తున్నారు.

ఒకవేళ ఏ సంస్థానాధిపతియైనా ప్రజాభిప్రాయానికి లొంగి సంస్కరణలిచ్చినా వారి అధిపతియైన బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధి ఆటంకపెట్టుతున్నాడు రాజకోట ఠాకూరును పదభ్రష్టుని చేస్తామని బెదిరించి వల్లభాయికి ఠాకూరుకు మధ్య జరిగిన రాజీని భగ్నం చేయించాడు. అందుచే, సంస్థాన ప్రజలు తమ ప్రభువులతో సాగించే పోరాటం నిమిత్తమాత్రమే. అసలు పోరాటం నిజంగా బ్రిటిషు సామ్రాజ్యవాదంతోనే జరుగుతోంది. అందుచేతనే సంస్థాన ప్రజలను అణచడానికి బ్రిటిష్ ప్రభుత్వం కలుగజేసుకొంటోంది. యిది నానాటికి హెచ్చిపోవడం, ఒరిస్సాలోవలె సేనలనుకూడ పంపి అణచడానికి ప్రయత్నం చేయడం స్పష్టంగా కనుపడుతోంది. ప్రజాభిప్రాయాన్ని అణచడానికి బ్రిటిషు ప్రభుత్వం కలుగజేసుకోడం కాంగ్రెసు ఇక నెంతమాత్రమూ సహించలేదు. శక్తినంతా ధారబోసి ప్రజల తరపున పాల్గొంటుంది. మహాత్ముడనేక పర్యాయములు యీ పోరాటాన్ని గురించి బ్రిటిషు ప్రభుత్వానికి వార్నింగు ఇచ్చాడు. ఇట్లే నిర్బంధ విధానంతో బ్రిటిషు ప్రభుత్వం సంస్థానాలలో కలుగజేసుకొంటే ఒక సంస్థానాలేకాదు బ్రిటిషు ప్రభుత్వాన్ని కూడా మట్టం చేసేందుకు ఉద్యమం వస్తుంది.

ప్రస్తుతం జరుగుతూన్న పోరాటం స్వభావాన్ని అందరూ గుర్తించాలి. ఈ పోరాటం వివిధ సంస్థానాలలో వివిధ రూపాలలో జరుగుతూన్నా, మొత్తంమీద అందరూ బాధ్యతాయుత ప్రభుత్వ స్థాపనకై పోరాడుతున్నారు. కాని ప్రజలను ఆ ఆశయంకోసం ఆయత్తం చేయడానికి వలసిన పౌరసత్వపు హక్కులను స్థాపించుకోవాలి. యీహక్కులే ప్రజలకు లేనంతకాలమూ, బాధ్యతాయుత ప్రభుత్వము

కోసం సత్రమాందోళన చేయడానికే ప్రజలకు అవకాశం లేదు. మన ప్రధాన ఆశయం బాధ్యతాయుత ప్రభుత్వం అయినా ఈనాడు మనలను ఎదుర్కొంటూన్న సమస్య చాలా సంస్థానాలలో యీ పౌరసత్వపుహక్కులు. జయపూర్ సంస్థానంలోది మరీ చిన్నసమస్య. సంస్థానంలో క్షామ నివారణ సదుపాయాలు చేయడానికే ప్రజామండలికి అధికారంలేదుట. తామేదో శాంతి స్థాపకులమని బ్రిటిషు ప్రభుత్వం ప్రగల్భాలుకొట్టుతూ, సంతృప్తి పరచడం అనేపేరుతో తుచ్ఛపు దోపిడి గాండ్రకు ఊతమిచ్చి, యూరపులో ప్రజాతంత్రాన్ని నక్కలపాలుచేసి మితిలేని హింసకు పట్టంగట్టారు, మనం కళ్లారచూస్తూన్న స్పెయిన్ విషాదగాధ-స్పెయిన్ ప్రజాతంత్ర పతనానికి యీ దుండగీండ్ర విదేశాంగ నీతియేకారణం. వీళ్లు శాంతిని గూర్చి ధర్మపన్నాలు చదువుతారు. కాని వీళ్లే స్వాతంత్ర్యాన్ని నాశనం చేయడానికి దుండగీడుతనాన్ని పెంపొందింప చేయడానికి ప్రోత్సాహం ఇస్తున్నారు.

మన స్వదేశ సంస్థాలలో శాంతియుతంగా తమ వ్యవహారం పరిష్కారం చేసుకోవాలని ప్రజలు ప్రయత్నిస్తూంటే బ్రిటిషుప్రభుత్వపు రాజకీయ సైనికబలం ఆసరాతో సంస్థానాధికారులు ప్రజలను అణచివేస్తున్నారు. ప్రజాతంత్రం, స్వాతంత్ర్యాలకు దారితీసే ప్రతి ఆందోళనను నిరంకుశంగా అణచివేస్తున్నారు. సంస్థానాలలో బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పాడితీరాలి. బ్రిటిషు ప్రభుత్వంయొక్క సహాయంతోయీరాక్షసత్వం భారతదేశంలో సాగనీయరాదు. ఒకరాజపుత్ర సంస్థానంలో టైపుమిషను ఉపయోగించకూడదట. దానికి లైసెన్సుకావాలట. బర్మా తిరుగుబాటును అణచివేయడానికి ఏర్పాటుచేయబడ్డ శాసనాలను పోలిన ఆర్డినెన్సులు కాశ్మీర సంస్థానంలో అమలుజరిపారు. హైదరాబాదులో పౌరస్వేచ్ఛ ఎప్పుడో నశించింది. ప్రైవేటుగా వందేమాతరం పాడడం నేరమయింది. మత ధర్మావలంబన మహానేరమయి పోయింది. ఇలాంటి వింకా అనేకచోట్ల అనేకం ఉన్నాయి.

రాజకోటలో ప్రజలు పోరాడారు. నెగ్గారు. మనమందరం సంతోషించాం. మనం మురిసినంత సేపైనా ఒడంబడిక నిలబడలేదు. మళ్ళీ మనవాళ్ళెందరో కదనరంగంలోదూకారు. బాధలెన్నో పడుతున్నారు. తాత్కాలిక ఒడంబడికలవల్ల మనకేమీరాదు. బ్రిటిషు ప్రభుత్వానికి నిజాయితీలేదు. క్షణంలో ఒడంబడికను భగ్నం చేస్తుంది. జయపూర్‌లో బ్రిటిషు ప్రతినిధి సలహాలేకుండా దివాన్, ప్రభువు, తమ ప్రస్తుత విధానాన్ని ఒక్క క్షణమైనా నడపలేరు.

ఒరిస్సా సంస్థానాలలో బజెల్‌గెట్టి హత్యను పురస్కరించుకొని సంస్థాన ప్రజలను బెదిరించి ప్రభులకు మద్దతుచేసేటందుకు మిలిటరీని తెచ్చి ప్రదర్శనాలు చేశారు. 30 వేలమంది ప్రజలు ఇతరప్రాంతాలకు పారిపోయారు. వీరినాయకులను తమకు అప్పగించవలసినదని ప్రభువులు ఒరిస్సా ప్రభుత్వాన్ని కోరారు. బ్రిటిషుప్రభుత్వం కూడా ఇందుకై ఒత్తిడి తెచ్చింది. కాని కాంగ్రెసు మంత్రులు నిరాకరించారు. ఇట్టి ఘోరాలకు సాయం నిరాకరించకపోతే ఆ కాంగ్రెసు మంత్రివర్గం ఇక యెందుకు?

ఇక పెద్దసంస్థానాలలో ప్రభుత్వ అధికారులు బ్రిటిషు ప్రభుత్వానికి తగ్గ శిష్యులే. బ్రిటిషు ప్రభుత్వం ప్రయోగించే తుచ్ఛపు నిర్బంధ విధానాన్ని ప్రయోగించడమే కాకుండా మత కలహాలుకూడా ప్రేరేపించి ప్రజలను చీల గొడుతున్నారు. తిరువాన్కూరు, హైదరాబాదు, కాశ్మీరం, ఇందుకు పేరుపొందాయి. తిరువాన్కూరులో ఎక్కువమంది క్రైస్తవులు. హైదరాబాదులో ఎక్కువమంది హిందువులు, కాశ్మీరంలో ఎక్కువమంది మహమ్మదీయులు. బాధ్యతాయుత ప్రభుత్వంకోసం పోరాడుతోంటే ప్రభువులు ఇవన్నీ మతకలహాలేనని పేరుపెట్టారు. ఈ సంస్థానాలన్నిటిలోనూ ప్రజల పేదరికం మాత్రం దుర్భరస్థితిలోనే ఉంది. కాశ్మీరంలోహిందువులుకూడా బాధ్యతాయుత పరిపాలనకై పోరాటంలో మహమ్మదీయులతో కలిశారు. హైదరాబాదులో మహమ్మదీయులుకూడా యీపద్ధతి అవలంబిస్తే ఉత్తమం.

హైదరాబాదులో ఇంకొక అసందర్భ పరిస్థితి వచ్చింది. స్టేట్ కాంగ్రెసును ప్రభుత్వం నిషేధించింది. కాంగ్రెసు సత్యాగ్రహం సాగించింది. దీనితోటిపాటే రెండు మతసంస్థలు కూడా తమ సర్వసామాన్య హక్కులకై సత్యాగ్రహం సాగించాయి. దీనివల్ల అసలు సమస్యలు మరుగుపరచి, ప్రభుత్వం రాజకీయ సమస్యను



పూర్వపు అధ్యక్షులు
డా॥ పట్టాభి

వెనుకకు నెట్టివేసి దానిని మత సమస్యలతో కలిపివేసింది. అందుచే స్టేట్ కాంగ్రెసు సత్యాగ్రహాన్ని తాత్కాలికముగా విరమించుకుంది. ఆరాజకీయ ఖైదీలను వదలివేయాలనే జ్ఞానమైనా హైదరాబాదు ప్రభుత్వానికి లేకపోయింది. మిగిలిన మత సంస్థలు సత్యాగ్రహాన్నింకా సాగించాయి. దీనివల్ల భారతదేశంలోని ఇతర ప్రాంతాలలో మత వైషమ్యాలు చెలరేగి కొన్నిచోట్ల కొట్లాటలుకూడా జరిగాయి.

కాశ్మీరంలో సత్యాగ్రహాన్ని గత సంవత్సరం విరమించినా నిర్బంధశాసనాలు అన్నీ అలాగే ఉన్నాయి. వందలాది జైళ్ళల్లో మ్రగ్గుతున్నారు. హైదరాబాదు, కాశ్మీరం సంస్థానాలలో ఒకే రకమైన పరిపాలన సాగుతోంది. సంస్థానాలు ఇట్లే సాగించినచో తిరిగి సత్యాగ్రహం ప్రారంభిస్తాం.

మనమెవరం కయ్యానికి కాలుదువ్వి అరాజకం తెచ్చుకోవాలని కోరడంలేదు. కాని విరోధి ఎత్తులవల్ల మనకది తప్పటం లేదు. ఎంతక్లిష్ట దశలోవున్నా మన విరోధి బ్రిటిషు సామ్రాజ్యమింకా బలంగానే ఉంది. దాని నెదిరించడానికి మనమెంతో సహసించవలసి ఉంది. మనకి కబుర్లుకాదు ప్రధానం, కార్యసాధన.

మన విరోధి మనలను అల్ప లాభాలతో ఆశపెట్టవచ్చు. మన ప్రధానాశయానికై మనం వాటిని కాలదన్నాలి. అల్పత్వానికి తావీయరాదు.

సంస్థాన ప్రజాసమస్య గొప్పదే. అంతకన్న భారతదేశ సమస్య మరీగొప్పది. ఫెడరేషనును మనపై రుద్దాలనిచూస్తే తుడిచివేస్తాం స్వతంత్రభారతీయుల కాన్‌స్టిట్యుయెంటు ఎసంబ్లీ ఏర్పాటు అయేవరకు మనం పోరాటం సాగించాలి.

ఎక్కడెక్కడ ప్రభుత్వం మనకి అడ్డు తగులుతుందో అక్కడల్లా దాన్ని ఎదుర్కొనిదంచాలి.

సంస్థాన ప్రజాసమావేశం ఇదివరలో చాలా పనులు చేసింది. ఇంకను చేయవలసిన గొప్ప పెన్నో పనులున్నాయి. సంస్థాన ప్రజల సమస్యకు కాంగ్రెసు, కాంగ్రెసు నాయకులూ సానుభూతి చూపడం మన అదృష్టం. మహాత్ముడు మనని నడపడానికి సిద్ధకావడం మనకందరికి పరమానందకరమైన విషయం.

భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో సంస్థానాల పోరాటం ఒకభాగం. ఈ పోరాటం అభివృద్ధి పొందింది. దీనిపట్ల కాంగ్రెసు వైఖరి మారింది. దీనిని భారత స్వాతంత్ర్య పోరాటముతో జతపర్చవలసిన కాలమాసన్నమైంది. అందుచే సంస్థానాల పోరాటము కాంగ్రెసు యొక్క అధ్వర్యకిందనే సాగాలి. గనుక, ప్రస్తుతం భారత సంస్థాన ప్రజల కార్యనిర్వాహక వర్గమువలెనున్న సంస్థ, సంస్థానాల పోరాటాన్ని నడిపించే కాంగ్రెసు ఆజ్ఞానుసారం నడిచే స్థాయిసంఘంగా మార్చి, అందును మరి 6 గురిని కోఆప్టుచేసుకొనే అధికారంతో 15 గురు సభ్యులు కలిగి, సంస్థానప్రజల కార్య నిర్వాహక వర్గమువలె పనిచేయునట్లు మహాసభ తీర్మానించ బడింది.

ప్రస్తుతం సంస్థానాల పరిపాలనా విధానం, నేటికి అనువయినదిగాక మధ్యయుగపు జమీందారీ స్వభావం గలదిగానున్నది. గాన సంపూర్ణ బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పాటుకావాలి అని రెండవ తీర్మానం

20 లక్షలుపైగా జనాభాగాని, 50 లక్షలు పైగా ఆదాయముగాని గల సంస్థానాలకు తప్ప స్వతంత్ర భారత ఫెడరేషనులో నుండుటకు మిగతావాటికి తాహతుచాలదు. అందుచే పరిపాలనా సౌకర్యాలకై అట్టి సంస్థానాల నన్నిటిని ప్రక్కనున్న రాష్ట్రాలలో కలిపివేయాలి. యిందుకైవలయు కార్యక్రమాన్ని గురించి విచారించడానికి ఒక కమిటీని నియమించుటకు కాంగ్రెసును కోరుతూ తీర్మానించారు.

బాధ్యతాయుత ప్రభుత్వస్థాపనకై రాజకోట ప్రజలు సాగిస్తూన్న పోరాటాన్ని ప్రశంసిస్తూ, పటేలుతో తాను గావించుకొనిన రాజీషరతులను భగ్నంచేసినందుకు ఠాకూర్‌సాహెబ్ చర్య ఖండిస్తూ, సంస్థాన వ్యవహారాలలో పూనుకొని వచ్చి బ్రిటిషుప్రభుత్వము కలుగజేసుకొంటే చేటువాటిల్లితీరుతుందని హెచ్చరించారు.

మేర్వార్‌లో ప్రజామండలి నాయకునిఅరెస్టు జయపూర్ పరిపాలనలోని అక్రమాలను ఖండిస్తూ జమ్నాలాల్‌జీ పైన నిషేధంపట్ల అసమ్మతిని ప్రకటిస్తూ బజాజ్‌గారి త్యాగాన్ని పౌరసత్వపు హక్కులు స్థాపన అయేవరకూ పోరాడదలచు కొన్న జయపూర్ ప్రజామండలి పట్టుదలను కొనియాడుతూ తీర్మానించారు.

"తిరువాన్కూరు స్టేట్‌కాంగ్రెస్ వారు దివానుపై గావించిన ఆరోపణలను ఉపసంహరించుకొనినా, ప్రభుత్వం రాజకీయ ఖైదీలను విడుదల చేయలేదు. కాల్పులనుగూర్చి విచారణ జరుపలేదు. బాధ్యతాయుత ప్రభుత్వస్థాపనకై కమిటీని నియమించలేదు. యిదేవిధంగా ప్రభుత్వము ప్రవర్తించినచో స్టేట్‌కాంగ్రెస్ తిరిగి సత్యాగ్రహంసాగిస్తుంది." అని తీర్మానించారు.

తిరువాన్కూరు, కాశ్మీరు ప్రజాసంస్థలుకూడ హైదరాబాదు స్టేట్‌కాంగ్రెసువలెనే "మతసంస్థలలో సభ్యులుగానున్నవారు స్టేట్ ప్రజాసంస్థల కార్యనిర్వాహక వర్గములో సభ్యులుగా నుండరా"దని తీర్మానించి తమజాతీయ స్వభావాన్ని వెల్లడిచేయవలసినదని కోరుతూ తీర్మానించారు.

వివిధ సంస్థానాలలో కలిగిన చైతన్యాన్ని ఆర్థిక,రాజకీయహక్కుల నెరిగించిన, దానికి కారకులయిన ప్రజాసేవకుల కృషిని ప్రసంసిస్తూ ఖద్దరు, మద్య నిషేధం, మత సఖ్యత, ప్రజాసంబంధం మొదలగు నిర్మాణ కార్యక్రమాన్ని సాగించవలసినదని కోరుతూ తీర్మానించారు.

ఇటీవల సంస్కరణల నిచ్చిన ఔంధుసంస్థానాధీసులను ప్రశంశించి, వారి ననుసరించవలసినదని సంస్థానాధీశు లందరిని హెచ్చరించారు.

సంస్థాన ప్రజల ఆశయాలను అణచడానికి సంస్థానాధీశులకు సాయంచేయాలని బ్రిటిషు ప్రభుత్వం తన మిలిటరీని, ఏజన్సీ సిబ్బందీని సప్లయిచేసి, దౌర్జన్యం సాగించుటను ఖండిస్తూ బజల్‌గెట్టీ హత్యకు విచారాన్ని తెలుపుతూ, బ్రిటిష్ ఇండియాలోను, రైల్వే అవరణలలోనూ అరెస్టులుచేసి ప్రజలను హింసించే అధికారాన్ని సంస్థానాధీశుల కివ్వడాన్ని పురస్కరించుకొని గావించిన యిట్టి ప్రకటనను ఖండిస్తూ తీర్మానించారు.

హైదరాబాదు నైజాంకు వార్నింగు.

ప్రజల పౌరసత్వ హక్కుల విషయమై హైదరాబాదు పాలనలోనున్న సంకుచితత్వమును, స్టేట్ కాంగ్రెస్‌పైన 400 సత్యాగ్రహ బందీలపైగల నిషేధాన్నిఖండిస్తున్నారు. సత్యాగ్రహం సాగించడంలో స్టేట్‌కాంగ్రెస్ చూపిన శిక్షణను కొనియాడుతున్నారు. భగవతారాధన మత వ్యవహారాలలో ప్రభుత్వం అవలంభిస్తూన్న విధానం సరియైనదికాదనితలుస్తూవీటిపై గల ఆటంకాలన్ని వెంటనే తొలగించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు. ప్రస్తుతం అవలంభిస్తూన్నవైఖరినే ప్రభుత్వమింకా సాగించినచో ప్రాథమిక హక్కులు, రాజకీయ స్వాతంత్ర్యంకోసం స్టేట్‌కాంగ్రెస్ సత్యాగ్రహాన్ని సాగించవలసి వస్తుందని హెచ్చరిస్తూ తీర్మానించారు.

అనేక పెద్ద సంస్థానాలలో పౌరసత్వపు హక్కులపై ప్రయోగించబడుతూన్న సంకుచిత నిర్బంధవిధానాన్ని ఖండిస్తూ తీర్మానించి ఇట్టి వివరాల పట్టీ నొకదానిని దానికి జతపర్చారు.

యువజన సంఘాలు ఎలా పని చెయ్యాలి?

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య

కామ్రేడ్ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు తన వ్యాసంలో పై ప్రశ్నకు జవాబుగా అతివాదుల నాయకత్వాన కాంగ్రెసు కార్యక్రమాన్ని ఆచరణలో పెట్టాలి, అతివాదులు కాంగ్రెసువారిని కోరినట్లే, యువకులచేతకూడ కూలీ రైతు సంఘాలలో పని చేయించాలన్నాడు. ప్రస్తుతము పార్టీథీసిస్ ననుసరించి, స్పోర్ట్సు, ఒలెంపిక్సు, ట్రెయినింగు క్యాంపులు నడుపాలనే భావముగల వారిని విమర్శించారు. "వీనివల్లనే గతఒక సంవత్సరముగాయువజన సంఘాలు స్థంభించి పోయాయి. కృష్ణాలోతప్ప మిగిలిన చోట్ల సభ్యత్వములేదు. కడకు పేరుకుకూడ, జిల్లా కమిటీలుకూడ లేకుండ పోయాయి. పార్టీ థీసిస్ రాక పూర్వము, గాలి గోపురముగాక గ్రామాన్నుండి రాష్ట్రము వరకు యువజన సంఘ నిర్మాణము ఉండినది. సెక్టేరియను దృక్పధములో పని చేస్తూ ఉండినా పని ఇప్పటికన్న బాగా జరుగుతూ ఉండేది. పార్టీ థీసిస్, ఈ కాన్స్టనూ, చక్కని సంఘ నిర్మాణాన్ని భగ్నము కావించింది. అందుచే తిరిగి మునుపటిలాగనే పని చేయడానికి పోవుట మంచిదని" కామ్రేడ్ పిల్లలమర్రి వాదన.

మునుపటి లాగనే అంటే అర్ధము కాంగ్రెసు ఇచ్చిన కార్యక్రమానికి ప్రతిగా కార్యక్రమము పెట్టడం. కాంగ్రెసు స్థానాన దానికి ప్రతి ద్వంద్విగా వేరొక సామ్రాజ్య వ్యతిరేక సంస్థను నిర్మించాలన్నట్లు పని చేయడము అని నా భావము కాదు. మునుపు సోషలిస్టులకు అలాంటి కార్యక్రమముండేది. ఆ కార్యక్రమాన్నే యువజన సంఘమనే పేరుతో ఆచరణలో పెట్టేవాళ్ళము. ఇప్పుడు సోషలిస్టులకు క్రొత్త కార్యక్రమము, క్రొత్త పంధా ఉంది. ఈ క్రొత్త కార్యక్రమాన్ని, ఈ క్రొత్త పంధాను యువజన సంఘము తరపున ఆచరణలో పెట్టమని కామ్రేడ్ పిల్లలమర్రి వాదనకు అర్ధము. అంటే మునుపు పేరుకు యువజన సంఘము అయినా, నిజంగా అది సోషలిస్టు పార్టీయే. కామ్రేడ్ పిల్లలమర్రి వాదనను అంగీకరిస్తే, ఇప్పుడు కూడ యువజన సంఘమును సోషలిస్టు పార్టీగా మార్చివేయడమే అవుతుంది.

యువజన సంఘాల పనితో పార్టీ తృప్తి చెందక, అవి స్థంభించినవి అని కూడ తలచి ఈక్రొత్తపంథాను త్రొక్కడానికి కారణము సోషలిస్టులకు అవి రాజకీయ వేదికగా ఉపయోగపడుటమే అని పార్టీ నిర్ణయించిందన్నాడు. కేవలము వేదికగా మాత్రమే గాక, పార్టీ సభ్యులందరూ యువజన సంఘాలలోనే ఉండి యువజన సంఘాన్ని పార్టీగానే చేసివేయుటచే, సోషలిస్టు భావాలు లేని యువకులు, అంటే ఇంకా సోషలిస్టు కాని యువకులు, కొద్దిగా కూడ రాజకీయ చైతన్యము లేని యువకులు, యువజన సంఘానికి దూరంగా ఉంటున్నారు. అందుచే యువజన సంఘం పని వేరు; పార్టీ పని వేరు అని యువజనసంఘపు పని చేయడానికి ఏ కొలదిమందినో యువజన సంఘములలో ఉండనిచ్చి, మిగిలినవారి నందరినీ మిగిలిన సంఘాలలో పనిచేయడానికి వినియోగించాలని పార్టీ నిర్ణయించింది. అంతేకాక యువజన సంఘ వయసు పరిమాణము 35 నుండి 25 వరకు తగ్గించడానికి ఒక కారణము పార్టీస్వభావం వీనికి లేకుండా చేయాలనుకోవడమే.

పార్టీ తీర్మానం ప్రకారం జిల్లా కొకరు ఇరువురు, లేక తాలూకాకు ఒక రిరువురు యువజన సంఘాలలో ఉండి మిగిలినవారు పోగానే పనిచేస్తూ ఉన్న 40 ప్రాథమిక సంఘాలు పనిచేయడము మానేశాయి. అంటే మునుపటివలె ఖండన, అభివందన, సానుభూతి తీర్మానాలు చేయడము, దినోత్సవాలు జరపడము మానివేశాయి. ఆపనిని ఇప్పుడు సోషలిస్టుపార్టీలే చేస్తున్నాయి. అంటే ప్రాథమిక సంఘాలన్నీ కృష్ణాలోతప్ప మిగిలిన స్థలాలలో నూతన విధానాన్ననుసరించి సరియైన యువజనసంఘాలుగా పనిచేయలేక పేపరు సంఘాలుగ తయారయ్యాయి. పేపరు సంఘాలుండడముకన్న లేకుండ ఉండడమే మంచిదనే భావముతో కొన్ని జిల్లాలలో సభ్యత్వముకూడ చేర్పించలేదు. అందుచే ఆజిల్లాలలో నామకఃకూడ యువజన సంఘాలు లేకుండపోయాయి.

నిజ పరిస్థితు లీ విధముగా ఉంటే థీసిస్‌కు ముందు యువజనసంఘాలు స్థంభించుటకు అప్పటి మన పార్టీ విధానము కాదు చురుకుగా పని చేసే పార్టీ సభ్యులు హెచ్చకపోవడము. పార్టీ కార్యకలాపము విస్తరించడము అని చెప్పుట సరికాదు. ప్రస్తుతము నామకః కూడ చాల జిల్లాలతో యువజనసంఘాలు లేకపోవడానికి కారణము పార్టీ థీసిస్ అనడము అంతకన్న సరికాదు.

యువజన సంఘాల కార్యక్రమములో మునుపుకూడ శారీరక యభివృద్ధికి పాటుపడాలి అని ఉండినది. దీనిని మొదటి రెండు సంవత్సరాలలోనే అమలు జరుపలేదని ఆక్షేపించలేదు. లేక రాజకీయాలలో యువజన సంఘాలు పాల్గొనుటకూడ ఆక్షేపించలేము. యువజనులను జాతీయ పోరాటానికి తరిఫీదు చేయకపోవడానికి కేవలం, సభలు, ఊరేగింపులు, అధ్యయన తరగతులు చాలవు. వారి వయస్సు ననుసరించి, వయస్సుకు తగిన మనోభావాలను, ఆకర్షణలను అనుసరించి, కలసికట్టుగా పని చేయడము (టీము స్పిరిట్), సహచరత్వము (కామ్రేడ్‌షిప్పు) కలిగించడానికి, ఒలింపెక్సు, స్పోర్ట్సు ఉపయోగిస్తాయి. అందుచే వాని ద్వారా గ్రామ, తాలూకా, జిల్లా సంఘాలను పునర్జీవము గావించడమే గాక యువజనోద్యమమును జీవము కలదిగాకూడ చేయడం ఏ విధంగా తప్పో తెలియుటలేదు. పరిచయములేనిదే, యువజనులు రానిదే అధ్యయన తరగతులు దినోత్సవాలు జరుపలేము. అందుకు మొదటి మెట్టుగా వీనిని ఉపయోగించడము సరియైన పద్ధతియే. యువజన సంఘాలు అధ్యయన తరగతులూ జరపాలి, దినోత్సవాలు జరపాలి. తన సభ్యులను కార్మిక కర్షక పోరాటాలలో పాల్గొనమని ప్రోత్సహించాలి. కాని వీనినన్నింటిని నిర్బంధంముగా తీర్మాన రూపేణ సభ్యులపై విధించరాదు. అభిప్రాయాన్ని వెల్లడించాలి. ఎక్కువ మంది అభిప్రాయమును కనుగొని, కామ్రేడ్ షిప్పు, టీము స్పిరిట్‌లో మిగిలిన వారు కూడ ఆచరించెదరని ఆశించవలయునే కాని పార్టీ తీర్మానమువలె విధిగా ఆచరించాలనడము, యువజన సంఘాభి వృద్ధికి వినాశకరము. అందుచే, ఇట్టి కామ్రేడ్‌షిప్పును యువజనులలో కల్గించడానికి పనికివచ్చే స్పోర్ట్సు, ఎక్స్కర్షన్సు పనికి రావనడము తప్పు. కాని యువజన సంఘాలు తమ కాలాన్నంతా స్పోర్ట్సులో నడిపితే ఖండించాలని ఉంటుంది. కాని అలా మన రాష్ట్రములోని యువజన సంఘాలేవీ కాలేదు.

యువజన సంఘాలు ఒలింపిక్సు జరుపడము. పరిచయముకోసమే అయితే అది పార్టీ తీర్మానానికి విరుద్ధమని కామ్రేడ్ పిల్లలమర్రి ఒక వింతవాదన తెచ్చారు. మిగిలిన సంఘాలు పరిచయముకోసము కాన్ఫరెన్సులు జరుపకూడదని పార్టీ నిర్ణయించిందట! పరిచయముకోసం, సభలు, ఊరేగింపులు, ఆందోళన వీనిని కాన్ఫరెన్సులని పేరు పెట్టుకొన్నా, మానివేయమని చెప్పలేదు. రైతు కాన్ఫరెన్సులు, కూలీ కాన్ఫరెన్సులు పెట్టకూడదనలేదు. రైతుసంఘ కాన్ఫరెన్సులు, కూలీసంఘ కాన్ఫరెన్సులు, ఇదివరకు జరిపేటట్లు పబ్లిక్ మీటింగులుగా చేయవద్దన్నది. సంఘ కాన్ఫరెన్సులు, ప్రతినిధి సభలుగా ఉంచమని కోరింది. ప్రతినిధుల అనుభవాలను తెలసికొని, వారిసమస్యలను పరిష్కరించే సభగా ఉంచమని కోరింది. ప్రజలకు ఉపన్యాసాలిచ్చే సభలుగాగాక, ప్రజలమధ్య ఏవిధంగా పనిచేయాలో నిర్ణయించే సభలుగా ఉంచమని కోరింది. ఒలింపిక్సును నడపడమెలా అని నిర్ణయించడానికి సమావేశమయిన యువజన సంఘము, తానే స్పోర్ట్సు మొదలు పెట్టడము పనికిరాదనే పార్టి కాన్ఫరెన్సులనుగురించి చేసిన తీర్మానానికి అర్ధము. యువజనసంఘాలు ఏవిధముగా ఒలింపెక్సును నడుపాలని పార్టీ కోరిందో, అదే రకముగా మిగిలిన వివిధసంఘాలు బ్రహ్మాండమైన ప్రజా సభలు జరుపమని జరుపవలయునని పార్టి కోరింది. ఆ ప్రజా సభలకు కాన్ఫరెన్సులని పేరు పెట్టదలచుకుంటే పార్టీకి ఎట్టి అభ్యంతరము లేదు. కాని ఆ కాన్ఫరెన్సులూ, సంఘ కాన్ఫరెన్సులూ (ప్రతినిధుల సభలూ) ఒకటే అని మాత్రము భ్రమపడ వద్దన్నది.

యువజన సంఘాలు పార్టీ తీర్మానము ప్రకారము ఏర్పరచడానికి, కామ్రేడ్ పిల్లలమర్రి వలె పొరపాటు పడకుండా చేయడానికి కావలసిన వర్కర్లను తయారు చేయుటకే రాష్ట్ర యువజన సంఘము తరపున శిక్షణ శిబిరము నడుప పార్టీ నిశ్చయించింది. ఆర్గనైజరుయొక్క అనారోగ్యము, తదుపరి వరికోతలు, తుపాను, వలన వెంటనే ఈ తీర్మానాన్ని అమలులో పెట్టలేకపోయింది. అంతేగాని దీని అవశ్యకతను గుర్తించక పోవడము కాదు. ప్రస్తుతము స్వాతంత్ర్య పోరాటము అసన్నమగుటచే, కావలసిన సన్నాహాలు చేసుకోవలసియుంటుంది. దానికని సాధ్యమయితే ప్రతి తాలూకాలోను, కాకపోతే ప్రతి జిల్లాలోను, కేవలము యువజనులకే కాక, కేవలము కార్మికులకే గాక, కేవలము రైతులకే గాక, అందరికీ యువకులకు, పెద్దలకు కూడ స్వచ్ఛంద సైనిక శిబిరాలను అన్ని సంఘాలు కలసి ఏర్పరచి, తగిన తరిఫీదు ఇమ్మని పార్టీ కోరింది. ఈ స్వాతంత్ర్య పోరాటములో లీనమయి పోతున్నప్పుడు, వివిధ సంఘాలయొక్క ప్రత్యేక అవసరాలను వెనక్కి పెట్టక తప్పదు. అందుకనే ముందు సంవత్సరాలలో వలె ఈ సంవత్సరము సిద్ధాంతాలను అధ్యయ

(మిగతా 18 వ పేజీలో)

విద్యార్థుల రక్తాన్ని పీల్చే డిటెన్షన్ విధానం

కామ్రేడ్ కాట్రగడ్డ రాజగోపాలరావు

4-2-39 తారీఖున శనివారం నాటి ఆంధ్ర దినపత్రికలో కోటీశ్వరరావు, బి. ఏ., గారు విద్యార్థులు-సమ్మెలు అను విషయంపై వ్రాసిన లేఖను చూచాను. వీరివలెనే ఇంకనూ చాల మంది విద్యార్థుల సమ్మెలమీద ముఖ్యంగా "డిటెన్షనుపద్ధతి పోవాలి" అనే నినాదంమీద అపోహలు, అనుమానాలు కల్గియున్నారు.

డిటెన్షను పద్ధతి పోవాలనటంలో ప్రధానోద్దేశము, అసలు పరీక్షలు ఎలాగా ఉండనేఉండగా 5-వ ఫారంలో ఉత్తీర్ణుడైనప్పుడే 6-వ ఫారం పరీక్షకు అర్హత కలదని నిర్ధారణ అయిఉండనే ఉండగా, మధ్యను సెలెక్షను పరీక్షలనిపెట్టి, యీడిటెన్షనును అమలులోపెట్టడం అనవసరం కాన ఇది అంతరించాలి అని.

అయితే బాగా చదవనివాళ్ళను పరీక్షలకు పంపిస్తే లాభమేమిటి? పంపమంటానికి హక్కు ఎక్కడిది? బాగా చదివినవెనుక పరీక్షల్లో మార్కులు సంపాదించుకొంటే సెలెక్షన్సులో అవి రాకపోయినా డిటైనుచేయరుగదా" అని లేఖకులంటున్నారు. దసరా, సంక్రాంతి పరీక్షల్లో బాగా మార్కులు సంపాదించుకున్నా, సెలెక్షను పరీక్షల్లో ఏ కారణంచేతనన్నా మార్కులు రాకపోతేచాలు, డిటైనుచేయటం అనేకచోట్ల సాధారణంగాజరుగుతోంది. ఈసంవత్సరం కృష్ణాజిల్లాలో జరిగిన డిటెన్షన్సులో ఇలాంటి కేసులు ఉదాహరణకు చాల ఉన్నాయి.

నేటి పరీక్షావిధానమే ఒక గారడీలాంటిది. బాగా చదివినవాళ్ళే ఉత్తీర్ణులవుతారనీ, చదవనివాళ్లుకారనీ, గట్టిగాచెప్పలేము. నేను నా మిత్రులను అనేకమందిని ఎరుగుదును. సంవత్సరం పొడుగునా సరిగాచదవక పరీక్షలు ఏ ఇరవై రోజులో, నెల రోజులో ఉన్నాయనగా ఏదో విధంగా చదివి ప్యాసయినవాళ్ళు అనేకమంది ఉన్నారు. చదవకుండా కూడా నేటి పరీక్షల్లో ప్యాసవటానికి అనేకమార్గాలున్నాయి. ఎప్పుడూ చదవక ఆమార్గాల నవలంబించికూడా పరీక్షల్లో ఉత్తీర్ణులై నేడు ఉపాధ్యాయ వృత్తిలో నున్న వాళ్ళను చాలామందిని నేనెరుగుదును. అందాక ఎందుకు? గత సంవత్సరం కృష్ణాజిల్లాలోని చాల హైస్కూళ్ళలో డిటెన్షన్సు లేకుండా పోయినాయి. హెడ్మాస్టర్లు డిటైనుచేస్తానన్న విద్యార్థుల్లో పబ్లిక్ పరీక్షకు కూర్చొని ప్యాసయినవాళ్ళు నూటికి 20 మంది ఉన్నారు. (అంకెలుకూడా ఉన్నాయి.) ఇంకా ఇలాంటి ఉదాహరణలు కావలసినన్ని ఉన్నాయి. గతసంవత్సరం సమ్మెలు, మొదలైనవాటిలో పనిచేసి సరిగా చదువలేదని మా కాలేజీ ప్రిన్సిపాలుగారు ఇద్దరిని పరీక్షకు కూర్చోటానికి అభ్యంతరం పెట్టారు. కాని వారు బ్రతిమాలుకోగా తిరిగి పంపించారు. వాళ్ళిద్దరూ సెకండుక్లాసులో ప్యాసయ్యారు. ఇంతకూ చెప్పేదేమంటే పరీక్షల్లో ఎవరు ప్యాసవుతారు, ఎవరు కారు అనేది నిర్ధారణ చేయలేము. అందువల్ల పబ్లిక్ పరీక్షకు పంపించండి; ఏదో ఒకటి అక్కడే తేలుతుంది; మధ్యను సెలెక్షను, డిటెన్షన్సు అనవసరం అంటున్నాము.

ఇతర కారణాలు

డిటెన్షను పద్ధతి పోవాలంటానికి ఇవి మాత్రమే కారణాలుకావు. ఇంకనూ ఉన్నాయి. యస్. యస్. యల్. సి. పబ్లిక్ పరీక్షకు కూర్చుంటేచాలు (ప్యాసయినా, కాకపోయినా) కొన్ని లాభాలున్నాయి.

1. ఎక్కౌంటింగు, రేడియో, మెకానికల్ మొ॥ కోర్సులు చదువుకోవచ్చు.
2. హైయరుగ్రేడు ట్రెయినింగు ఒక్క సంవత్సరంలోనే చదువవచ్చు.
3. కంప్లీట్‌చేస్తే ఆర్ట్సు కాలేజీల్లో చదవటానికి వీలులేకపోయినా ఇంకా కొన్నికోర్సులు చదువుకోవచ్చు.
4. మరుసంవత్సరం మళ్లీ స్కూలులో చదవక్కరలా. ప్రైవేటుగా పరీక్షకు హాజరవవచ్చు. దీనిమూలాన ఆర్థికంగా లాభముంటుంది.

వీటన్నిటికంటే ముఖ్యమయింది ఇంకోటి ఉంది. మన విశ్వవిద్యాలయంలో నూటికి ఇంతమంది కంటె ఎక్కువమందిని ప్యాసు చేయకూడదనే ఆచారమొకటి ఉంది. ఇందుకనే చూడండి! ఎప్పుడన్నా 40% కంటే ఎక్కువమంది ప్యాసయ్యారేమో S. S. L. C. పరీక్షలో. 1933 లో 30%, 1934 లో 31% 1935 లో 40%, 1936 లో 36%, 1937 లో 40%, 1938 లో 39%, ఎప్పుడూ 40% కి మించలా మన ఆంధ్రా యూనివర్సిటీలో. దీనిమూలాన నూరుమంది పరీక్షకు కూర్చుంటే 40 మంది ప్యాసవుతారన్నమాట. రెండు వందల మంది కూర్చుంటే 80 మంది ప్యాసవుతారన్నమాట. అంటే ఎక్కువమంది పరీక్షకు హాజరగుతుంటే ఎక్కువ మంది ప్యాసవుతుంటారు. కాబట్టి పబ్లిక్ పరీక్షకు ఎక్కువమంది హాజరవటం విద్యార్థులకు లాభదాయకము. డిటెన్షను పద్ధతి ఉంటంవల్ల ఆంధ్రా యూనివర్సిటీ మొత్తంమీద సుమారు 1200 మంది ప్రతి సంవత్సరమూ డిటైను చేయబడుతున్నారు. యీ పండ్రెండు వందలమంది పబ్లిక్ పరీక్షకు హాజరయితే యూనివర్సిటీ మొత్తముమీద సుమారు 450 మంది ప్యాసవటానికి అవకాశాలున్నాయి.

యీకారణాలవల్ల "డిటెన్షను పద్ధతి పోవాలి" అని ఆంధ్ర విద్యార్థులచే ఐక్యకంఠంతో నినాదమివ్వబడుతోంది.

కాంగ్రెస్ మంత్రుల వైఖరి.

అయితే, యీడిటెన్షను పద్ధతి ఎందుకు ఏర్పరుప బడింది అనే సందేహం కల్గవచ్చు. పబ్లిక్ పరీక్షకు ఎక్కువమంది కూర్చొని మరి తక్కువమంది ప్యాసవుతున్నా, ఎక్కువమంది ప్యాసయి నిరుద్యోగ సమస్య ఎక్కువయినా, ప్రభుత్వంపైన వత్తిడి చేస్తారనే ఉద్దేశంతో, యీలోపుగానే వడపోత పోయటానికిగాను మొదట్లో మెకాలే మహానుభావుని విద్యావిధానంలో యీపద్ధతి ఏర్పరచబడింది. బానిసత్వంలోనే పుట్టి, పెరిగి, బానిసత్వానికే జోహారులు కొడుతున్న మనకు బానిస విద్యావిధానంలోని ఇలాంటి అసమంజసమూ, అసంబద్ధమూ అయిన పద్ధతులు కాంగ్రెసు ప్రభుత్వ హయాములో పోగొట్టేటందుకు స్వాతంత్ర్య భావాలు మొలకలెత్తుతున్న విద్యార్థులు ప్రయత్నిస్తుంటే, హాస్యాస్పదంగానూ, ఆశ్చర్యకరంగానూ కన్పడుతోంది. మన హైస్కూళ్ళ ప్రధానోపాధ్యాయులుకూడా ప్రభుత్వోద్యోగులయి యుండటంవల్లనో, ఎక్కువమంది ప్యాసవుతుంటే తమ తమ స్కూళ్ళకు పరువు ప్రతిష్టలు కల్గుతాయనే భావంవల్లనో, ఏమాత్రం అనుమానమున్నాసరే డిటైను చేయటానికి తయారవుతున్నారు.

కాంగ్రెసువారు ప్రభుత్వం స్వీకరించినాక యీబానిస విద్యావిధానంలో మార్పులు వస్తాయని విద్యార్థులందరు ఎదురు చూస్తున్నారు కాని ఏమాత్రమూ మార్పురాక పోవటం గమనించి, వెంటనే యీడిటెన్షను పద్ధతి తీసివేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. నిరుడు ప్రధాన మంత్రి విద్యాశాఖామంత్రి కార్యదర్శిగార్ల వద్దకు అనేకచోట్ల డెప్యుటేషను వెళ్ళారు. కాని ఫలితం సున్నా. మళ్ళీ యీసంవత్సరం రాష్ట్ర కాంగ్రెసు నాయకులకు డెప్యుటేషనుద్వారా విన్నవించారు. గౌ॥ వార్కీగారు మంత్రిగా వచ్చిన తర్వాతకూడా డెప్యుటేషను వెళ్ళారు. మొదట్లో వారు ప్రత్యేకంగా కృష్ణాజిల్లాలో ఒక క్రొత్తపద్ధతిని అమలులో పెట్టామన్నారు అదీ యిప్పుడు లేకపోయింది. ఇక విద్యార్థులు చేయాల్సిందేమి? తమ తీవ్ర అసమ్మతిని, అసంతృప్తిని తెలియజేయటం కోసం సమ్మెలు చేశారు. అక్కడక్కడ సమ్మెలు చేయటంవల్ల లాభమేమిటి? దేశమంతా ఒకేసారి సమ్మెచేస్తే ఏమన్నా ప్రయోజన ముంటుందేమోనని ఒక సందేహం వచ్చింది. భారతీయులంతా ఒకేసారి స్వాతంత్ర్యం కావాలి అని అడగాలి కాని కొంతమంది మాత్రమే సత్యాగ్రహం మొదలైనవి చేసి జైళ్ళకువెళ్ళటం, దెబ్బలు తినటం అనవసరమనటంలో ఎంత అర్ధముందో ఈవాదనలో కూడా అంతే అర్ధముంది. నిజస్థితిని గ్రహించి చైతన్యమూ ఉత్సాహమూ స్వాతంత్ర్య పిపాస, కల విద్యార్థులు కొన్నిచోట్ల సమ్మెలుచేసి తమ అసమ్మతిని తెలియ చేశారు యీ కొన్నిచోట్ల కల్గిన చైతన్యం ద్వారా రాష్ట్రమంతటకూడా చైతన్యం కల్గించి, ఆందోళన అలజడి జరిపి జనరల్ స్ట్రయికు కానిస్తే ప్రయోజనముంటుంది. అందుకనే ఇప్పుడు మన రాష్ట్ర విద్యార్థి సంఘంవారు వచ్చే సంవత్సరం జనరల్ స్ట్రయికు జరపటానికి ఏర్పాటు కావిస్తున్నారు.

నేటిపరీక్ష విధానం

"అసలు పరీక్షలే ఎత్తివేయవలెనని ఇలాంటి విద్యార్థి రేపడగవచ్చు" అంటూ నేటి పరీక్షా విధానం పోవాలి అనే అతి ప్రాముఖ్యమయిన విషయాన్ని లేఖకులు చులకనగానూ, ఎగతాళిగానూ, పరిహాసాస్పదంగానూ తేల్చేశారు. ఇప్పటి పరీక్షావిధానం పోవాలి అని రేపు ఎప్పుడో అడగబోవటంకాదు, నిన్ననే అడిగారని లేఖకులు తెలిసికోవాల్సి ఉంటుంది! ఈసంవత్సరం జనవరి 7 వ తారీఖున మద్రాసులో జరిగిన రాజధాని విద్యార్థి మహాసభలో పరీక్షలను గూర్చిన తీర్మానముచూస్తే స్పష్టమవుతుంది. నేటి పరీక్షలు విద్యార్థులను అన్నివిధాలా క్రుంగదీస్తున్నాయి, కాబట్టిన్నీ, వీనిమూలంగా విజ్ఞానాభివృద్ధి కల్గటంలేదు కాబట్టిన్నీ, యీ పరీక్షలను రద్దుచేయాలని వారుకోరారు. ఇలా కోరటంలో ఎంత న్యాయముందో భారత విజ్ఞానవేత్తలందరూ యిచ్చిన వివాదమును తెలిసికుంటే, ఇలా వ్రాసేవారు కారనుకుంటాను.

జస్టిస్‌వారి హయాములో మద్రాసు ప్రభుత్వానికి విద్యాశాఖా మంత్రిగాఉన్న దీ. బ. యస్. కుమారస్వామి రెడ్డిగారు 1936 ఆగస్టు 24 తారీకున ఆంధ్రా యూనివర్సిటీలో స్నాతక హితోపన్యాసాలిస్తూ, ఇలా ముచ్చటించారు: "విశ్వవిద్యాలయాలు పరీక్షా ఫలితాలకే సర్వప్రాధాన్యమూ, అగ్రస్థానమూ, ఒసంగటంవల్ల చాల ప్రమాదం వాటిల్లుతోంది. ఈ పరీక్షా ఫలితాలే ముఖ్యమని భావించడంవల్ల ఆ పరీక్షల్లో కడతేరటానికి విద్యార్థి కృత్యాద్యవస్థల పొంది ఉత్తీర్ణుడై, నిర్వీర్యుడై, నిరుద్యోగియై, నిష్ప్రయోజకుడైన మేధానిధి యగుచున్నాడు......... కాబట్టి యీ పరీక్షలు నిరర్ధకములు"

కాంగ్రెసువారి హయాము వచ్చినాక యీ బానిస విద్యావిధానంలో పరిణామము తీసుకొని రావటానికి గాంధిగారిచే జకీరు హుస్సేన్ గారి అధ్యక్షతను నియమించబడ్డ ఉపసంఘంవారు 1937 డిశంబరు 13 వ తారీఖున ప్రకటించిన వార్ధా విద్యావిధానములో నేటి పరీక్షలను గూర్చి ఇలా ఉంది:—

"మన దేశంలో ప్రస్తుతమమలులో ఉన్న పరీక్షా పద్ధతి విద్యకు వేరుపురుగైనది. అసలు నేటి విద్యావిధానమే చాల అధ్వాన్నమయింది. అట్టి సందర్భంలో వాని ఉపయోగానికి మించిన విధానంలోపరీక్షలకు విపరీత ప్రాముఖ్యమీయటం వల్ల విద్యావిధానం మరింత నిరుపయోగమైనది. బాలురయొక్కగాని, పాఠశాల యొక్కగాని, యోగ్యతను నిర్ణయించుటకు పరీక్షలు నిరర్ధకములని ప్రవీణుల అభిప్రాయము. యీ పరీక్షల వల్ల విద్యార్థుల తెలివితేటలుగాని, యోగ్యతలుగాని కనిపెట్ట వీలులేదు."

ఆంధ్రా యూనివర్సిటీ సెనేటు ఎన్నికలకు కాంగ్రెసు తరపున అభ్యర్థులను నియమిస్తూ మన రాష్ట్ర కాంగ్రెసు తరపున డాక్టరు పట్టాభిగారు ప్లెడ్జిలో యీక్రింది విధంగా వ్రాశారు:—

"ఇపుడుండే పరీక్షల పద్ధతిని మాపుచేయాలి. వాటివల్ల పైకిరావల్సిన యువకులకు నష్టమే కాని లాభంలేదు. ఇదివరకు యీ పరీక్షలను చూచి ప్రభుత్వం క్రిందను, ఇతరత్రాయును, ఉద్యోగాలిస్తుండవచ్చు. కాని వాటివిలువకూడాపోయింది. యీ పరీక్షలవల్ల ఫలితాలు గట్టిగా ఉంటాయని లేదు. అవి అతి కఠినంగా ఉంటాయి. వాటికెంతో ఖర్చు. వాటికొక దారీ దొంకా లేదు. ఇంతేకాకుండా మంచి తేటస్సు ఏర్పడేకాలంలో పరీక్షలమూలంగా విద్యార్థులు సర్వవిధాలా కృంగిపోవటం, దుర్బలులు కావటం, నైతికంగానూ, మానసికంగానూ చెడిపోవటంకూడా జరుగుతోంది."

వీటివల్లనే, నేటి పరీక్షలంటే దేశంలో ఎంత ఏవగింపూ, అసహ్యమూ, అలజడీ కల్గిందో స్పష్టమౌతోంది. ఇలాంటప్పుడు విద్యార్థులు రేపు అడుగవచ్చునని వీరు ఎగతాళిగా వ్రాయటంలో ఎంతసత్యమున్నదీ పాఠకులే తెలిసికొనవచ్చును. నేటి పరీక్షలమూలాన ఎంతోమంది విద్యార్థులు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారు. ఈ పరీక్షల్లో ఏమాత్రమూ న్యాయం కల్గటంలేదని సవాల్‌చేసి చెప్పగలను. ఈ పరీ

(మిగతా 18 వ పేజీలో)

కాళీపట్టణంలో 144వ శెక్షన్

ఏజెన్సీలో కాంగ్రెసువాదుల అరెస్టు, కొంపలు తగులబెట్టుట

రైతులోకం

కాళీపట్నం రైతులు తమ జీవనాధారమైన చేపలు పట్టుకొనే హక్కుకొరకు యిప్పటికి సుమారు 6 మాసాలనుంచి శాంతియుతంగా ఆందోళన జరుపుచుండిరి. ఇంతవరకు ఏవిధమైన అల్లరులు, దొమ్మీలుజరుగలేదు. రైతుల మీద కాళీపట్నం జమీందారుగారు సివిల్‌దావా కూడా చేసియున్నారు. అది అటులేఉండగా, గ్రామమందలి వివాదగ్రస్తమై భూములను జమీందారుగారు అమ్ముటకు ప్రయత్నాలు చేయుచున్నారు. ఆ భూములు ఉప్పు నీటిలో మునిగి యుండుటచేత చేపలు ఎక్కువగా ఉత్పత్తిఅగుచుండును. ఆచేపలపైననే సుమారు 700 మంది రైతు కుటుంబాలకు జీవనాధారం. అట్టి రైతులమీద, సుమారు 60 మందిపై, 11-2-39 వ తేదీని నర్సాపురం సెకండ్‌క్లాసు మేజస్ట్రేటుగారు 144 వ సెక్షన్ జారీచేశారు. ఇంతవరకు అక్కడ ఉద్యోగంలోఉన్న నర్సాపురం పోలీస్ సబ్‌ఇన్స్పెక్టరును 24 గంటల వ్యవధిలో ట్రాన్సుఫరుకూడా చేశారు.

ఈ 60 మంది రైతులు, తమకు చెందని భూములను అక్రమంగాను, బలవంతంగాను, స్వాధీనపరచు కొంటున్నారనీ; యితర గ్రామస్థులతో కలసి, జమీందారుగారిచే పట్టాలు యివ్వబడిన భూములకు జిరాయితీ హక్కు గలిగిన రైతుల మీదపడి దొమ్మీ చేశారనీ; ఆజిరాయితీ రైతుల పాలేళ్ళను, జమీందారుగారి నౌకర్లను, ఒక పోలీసు కానిస్టేబిలునూ కొట్టారనీ — కాబట్టి, కాళీపట్నం, పాతపాడు గ్రామస్థులు, ముఖ్యంగా 60 మంది రైతులు కాళీపట్నం భూములషీదికి వెళ్ళకూడదనీ శాంతికి భంగం కలిగే ఎట్టి పనులు చేయరాదనీ— 144 వ సెక్షనులో ఉదహరించబడింది.

* * *

రైతులకే విజయం

నవంబరు నెలలో వచ్చిన తుపానుకు నష్టపడిన నర్సాపురం తాలూకా భూములకు అదనంగా 6000 యకరములకు రెండోపంట ఆర్ధరుసు ఉపసంహరించు కొంటూ ఉత్తరువు చేశారు. రైతుల ఆందోళనకు ఫలితంగాను రైతుల తరఫున శ్రీ గొట్టుముక్కల వెంకన్న ఎం. ఎల్. ఏ. గారు రివెన్యూ మంత్రిగారి వద్దకు రాయబారం వెళ్ళి విన్నవించిన మీదటను శ్రీ ప్రకాశం పంతులుగారు కాకినాడనుంచి వస్తూ సూపరింటెండెంటు ఇంజనీయరు గారిని, ఎగ్జిక్యూటివ్ ఇంజనీయరుగారిని కొవ్వూరులో కలుసుకొని, మొదటి ఆర్డరునే ఖాయం చేయవలసినదిగా ఉత్తరువులు పంపమని చెప్పారు.

* * *

మునగాల రైతుల సమావేశము

మునగాల రైతులకును, జమీందారుగారికిని మధ్యజరిగిన ఒడంబడిక షరతులు అమలు జరిగే విధానమును గురించి విచారించుటకు, మునగాల జమీన్ రైతు సంఘంవారి ఆహ్వానం మీద, 15-2-39 వ తేదీని శాసనసభ్యులగు కాట్రగడ్డ నారాయణరావుగారు నడిగూడెం వచ్చిరి. ఎస్టేటులోని అన్ని గ్రామాలనుంచి సుమారు 2000 మంది రైతులు సమావేశమయారు. శ్రీ నారాయణరావుగారు, జిల్లా రైతు సంఘాధ్యక్షులైన కామినేని వెంకటప్పయ్యగారు, ఎర్నేని సుబ్రహ్మణ్యంగారు సభలో ఉపన్యసించారు. రైతులు తమ సంఘబలాన్ని వృద్ధి చేసుకొనవలెననీ; శాంతియుతంగా తమ హక్కులకై పోరాడవలసినదనీ – హెచ్చరించారు. పిమ్మట, మునగాల జమీన్ రైతు రాజీ ఉపసంఘాధ్యక్షులైన కామ్రేడ్ నండూరి ప్రసాదరావుగారు ఉపన్యసిస్తూ, రైతులు న్యాయంగా చెల్లించవలసిన శిస్తులు చెల్లించ వలసినదనీ; ఎస్టేటువారి దౌర్జన్యాలకు భయపడవద్దనీ చెప్పుచూ, ఏయే శిస్తులు చెల్లింపదగునో, ఏవి చెల్లించకూడదో విశదపరిచారు. ఎస్టేటువారి గత వారపు దౌర్జన్యాలను పేర్కొని, ప్రజలను ఎంత రెచ్చగొట్టినను శాంతియుతంగానే ఉండవలసిందని హెచ్చరించారు.

* * *

రైతువాలంటీర్ల దళం.

ఆం॥రా॥ రైతుసంఘాధ్యక్షులైన కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తిగారు యీ క్రింది ప్రకటన చేయుచున్నారు:-

దేశమంతటా రైతు వాలంటీర్ల సేవాదళములను యేర్పరచవలెనని గతసంవత్సరపు అఖిల భారత రైతు మహాసభయు, యీ సంవత్సరపు ఆంధ్రరాష్ట్ర రైతుమహాసభయు తీర్మానములు గావించియుండెను ఇట్టి సేవాదళముల అవసరం రోజురోజుకుఎక్కువగుచున్నది. రైతు ఉద్యమమును అణచుటకు జమీందార్లు విదేశప్రభుత్వంగావించే ప్రయత్నాలను ఎదుర్కొనుటకు రైతు సేవాదళములు వెంటనే స్థాపించవలసిన అవసరం గలదు.

కాబట్టి, జిల్లా రైతుసంఘముల తరఫున ప్రచారంగావించి, ప్రతిగ్రామమున రైతుసేవాదళమును యేర్పరచవలెను. పిదప, జిల్లాసంఘముల యాజమాన్యమున రైతుసమస్యలపై రైతు ప్రచారకులలో శిక్షణగరపుటకు శిబిరములు స్థాపించవలెను. అన్ని జిల్లాలలో రైతు సేవాదళములు యేర్పడేలోపల, రాష్ట్రంమొత్తంమీద రైతు సేవకులకు శిక్షణ గరపుటకు దాదాపు 15 రోజులకు మించకుండా ఏప్రిల్ నెలలో రాష్ట్రసంఘంతరఫున శిక్షణ శిబిరము నడుపబడును. స్థల,కాల, నిర్ణయములు ముందు ప్రకటన చేయబడును. దానికి రాగోరు రైతుసేవకులు "ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ కార్యాలయం,బెజవాడ" అని దరఖాస్తులు పంపవలెను దరఖాస్తులతోబాటు 5 రూపాయలు విద్యార్థి రుసుముగా పంపవలెను. దరఖాస్తులు మార్చి 20 తారీఖు లోగానే చేరవలెను. అయాస్థానిక రైతుసంఘాధ్యక్షులు లేక కార్యదర్శుల సిఫార్సులతో దరఖాస్తులు పంపవలెను. సిఫార్సులులేని దరఖాస్తులు రాష్ట్ర రైతు సంఘాధ్యక్షుని అమోదముపొందవలెను.

* * *

ఆం. రా. రైతుసంఘ సభ

పైసంఘముయొక్క కార్యనిర్వాహక వర్గం 2-3-39 వ తేదీ ఉదయం 8 గంటలకు బెజవాడలో, సంఘ కార్యాలయమందు జరుగును గాన సభ్యులందరు తప్పక రాగోరు చున్నాను.

ఎజండా:—

1. ఫెడరేషను మన కర్తవ్యం
2. జిల్లా, తాలూకా, రైతుసంఘ ఎన్నికలు
3. రైతు వాలంటీర్ల దళములు
4. రాష్ట్రీ రైతుసంఘ వాలంటీరు శిక్షణ శిబిరం
5. ఈనాం రైతు వ్యవసాయకూలిసమస్యలు
6. జమా ఖర్చులు
7. కార్యదర్శి ప్రవేశపెట్టు యితరవిషయాలు

* * *

కొండపల్లిలో ఫారెస్టు ఉద్యోగుల దౌర్జన్యాలు

కొండపల్లి గ్రామంలో నూటికి 75 మంది అరణ్యమువల్ల జీవించుచున్నారు. వీరు చేసిన పనికి గవర్నమెంటుకూలి యివ్వాలి. కాని, ఫారెస్టు ఉద్యోగులు వీరిచేత దినమంతా పని చేయించుకొని, ఇళ్ళకు వెళ్ళేసమయాన్ని కట్టెలను సహితం కొండక్రిందికి మోయించి గవర్నమెంటువద్ద తాముతీసుకొనేకూలిని కూలీలకు ఇవ్వక, న్యాయవిరుద్ధంగా సంతకములు చేయించు కొంటున్నారు. ఈ విధంగా వీరు ఒకవైపున ప్రభుత్వాన్ని, మరొకవైపున అనేకమంది కూలీలను మోసగిస్తున్నారు. జబ్బులవల్లగాని కూలీలు పనికి వెళ్ళకపోతే, యీఫారెస్టు అధికారులు వారిని అరణ్యంలో కాలుపెట్టనివ్వరు. అట్టి బీదకార్మికులు చీటీ తీసుకొని వెళ్ళినట్లయితే, వానిపైన లేనిపోని నేరాలు కల్పించి, కేసుపెట్టెదమని బెదరించి, లంచములుకూడ పుచ్చుకొనుట మామూలైనది.

ఈ ఇక్కట్లు పడలేక, కార్మికులు తామే కష్టైనా పాటపాడవలెనని తలచి, అక్కడికి పాటకువచ్చిన పెద్దలను ప్రాధేయపడగా, వారు సమ్మతించిరి. కాని, పంచాయతీకోర్టు ప్రెసిడెంటు, రోడ్ల కంట్రాక్టరు, గ్రామమునసబుగారి బావగారు అయిన సింగలూరు రామయ్యగారు అందుకు నిరాకరించారు. మా బావగారైన మునసబుగారు నన్ను పాటకు పంపినారు గాన వారివద్దనుండి ఉత్తరం తెచ్చుకొనమని ఆ బీద వారిని పంపివేసి, తన పాటను కొట్టివేయించుకొన్నారు. వీరు తమ కంట్రాక్టులో పనిచేయు కూలీలను, బండ్లవాళ్ళను జంతువులను వేటాడినట్లు వేటాడుట అలవాటు.

కాబట్టి, ఇట్టివారుచేయు అన్యాయములు, ఉద్యోగస్థుల దౌర్జన్యాలు, ప్రభుత్వం రూపుమాపి, బీదప్రజలను రక్షించవలసినదని కొండపల్లి కూలీల తరపున ఒక విలేఖరి వ్రాయుచున్నాడు.

* * *

చోడవరం ఏజన్సీలో కాంగ్రెస్ నాయకుల ఎరస్టు.

చోడవరం ఏజన్సీలో యీసంవత్సరం 8000 మంది కాంగ్రెసు సభ్యులుగా చేరిరనియు, వీరందరు ముఠాదారులని పిలువబడే జమీందార్ల వెట్టిచాకిరీలు, మామూళ్లు, గొత్తి అనబడు నిర్బంధదాస్యము, వీటినుంచి విముక్తులు కావ దానికి సక్రమాందోళన చేయుచున్నారనీ, జమీందార్లు దీనిని అటంకపరచడానికి ప్రజలమీద అనేక ఆరోపణలుచేసి పోలీసులకు పెట్టిఎస్టేటు నారనీ; దానిపై, యీనెల 8 వ తేదీని 60 మంది రిజర్వు పోలీసుదళంవెళ్ళి, కాంగ్రెసు మీటింగు జరుగునని ప్రకటించి వందలాదిగా వచ్చిన ప్రజలయెదుట "మీ రాజగోపాలాచార్యులుగారే మిమ్ములను ఎరెస్టు చేయమన్నా" రని చెప్పుచు, స్థానిక కాంగ్రెసు నాయకులైన శ్రీ మర్రి కామయ్య, ఒబ్బేటి చిన రంగారావు, గార్లను ఎరస్టు చేసినారనీ; వారి యిండ్లు సోదా చేయగా ఏమీ దొరకలేదనీ; "ఆంధ్ర పత్రిక" విలేఖరి వ్రాయుచున్నాడు. అక్కడి కాంగ్రెసు బావడీ కూడా తగులపెట్టబడినట్లు తెలియుచున్నది.

* * *

మందసా ఎస్టేటులో అత్యాచారాలు.

ఉ. విశాఖపట్నం జిల్లా రైతు సంఘ కార్యదర్శి శ్రీ గౌతు లచ్చన్నగారు యిట్లు వ్రాస్తున్నారు: 11-2-39 వ తేదీని కోర్టు ఆఫ్‌వార్డ్సు పరిపాలనలోఉన్న మందసా ఎస్టేటుకు గొడుకొంకడాపుట్టుగు అనేగ్రామానికి ఎస్టేటు మేనేజరుగారు, శిరస్తాదారుగారు, రివెన్యూ ఇన్స్పెక్టరుగారు, యితర సిబ్బందితోవెళ్ళి చుట్టుపట్ల గ్రామరైతులను పిలిపించి, శిస్తులన్నీ వెంటనే చెల్లించవలసినదని ఉత్తరువుచేశారు. రివెన్యూ ఇన్స్పెక్టరుగారు యిదివరలో వచ్చినప్పుడు వారి ప్రయాణపు ఖర్చులకుగాను యెకరానికి 1 రూపాయ చొప్పున కొంతమందిని నిర్బంధించి వసూలుచేసిరనియు, చెల్లించని రైతులకు అదనంగా అనేక విధముల అంచనాలు విధించిరనియు, క్రిందటి ఫసలీ అంచనాల ప్రకారం మాత్రమే చెల్లించగలుగుదుమనియు, రైతులు మొరపెట్టుకొనిరి. మేనేజరుగారు, మొదట ధాన్యం కొలవండి. అంచనాల విషయం తరువాత ఆలోచిద్దాం అన్నారు. రైతులు మొదటనే యీ విషయము తేల్చమన్నారు. ఈ విధంగా తర్కవితర్కములు జరుగుతోంటే, రాముడు అనే ఒక హరిజన రైతును నీధాన్యం మొన్ననే పండాయి చూపించమని అక్కడికి వెళ్ళితే, ధాన్యంలో ఎక్కువభాగం పొల్లు కలిసియుండడం చూశారు. వెంటనే మేనేజరుగారు వానిచెయ్యి పట్టుకొని, లాగి, కొట్టారు. వెనుకనుంచి మరొకడు నడుముపై బలమైన తాపుతన్నాడు. మేనేజరుగారు తన మోటారు కారును వెంటనే సోంపేట పంపించివేసి, తుపాకీలతో పోలీసులను రప్పించారు. పోలీసులు ప్రజలమీదపడి, కొట్టడం, తుపాకీలు చూపించి భయపెట్టడం, అనేక దుర్భాషలాడటం, చేశారు. ఇద్దా ఎదిచ్చి అనేపిల్ల బాబూ రక్షించండి అని నమస్కరిస్తూ నిలబడితే, ఆమెను కర్రతోను, పటకాతోను కొట్టారు. బుర్రపార్తి అనే యుక్తవయస్సుగల స్త్రీని నర్సింగపాడి అనే ఎస్టేటు ఉద్యోగి రహస్యావయవములమీద కొట్టి అవమానపరచాడు. దారుణమైన యీ అత్యాచారాన్నిచూచి ప్రజలు అడవులలోనికి పారిపోయారు. అప్పుడు పోలీసులు, ఎస్టేటు ఉద్యోగస్తులు రైతుల ఇండ్లలో దూరి, ధాన్యపు పాతరలుతీయించి బయటపడవేశారు. ఉదయం అయేసరికి మందసానుండి బండ్లువచ్చాయి. వాటిపై ధాన్యం వేయించి అర్జీలు నౌకర్లు పట్టించుకు వెళ్ళారు.

గమనించండి

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ ది 16-2-39 తేదీని బెజవాడలో సమావేశమైన కార్యనిర్వాహకవర్గ తీర్మానములు.

1. కమ్యూనిస్టు పార్టీపై నిషేధాన్ని తొలగించాలను ప్రశ్నకు జవాబుచెబుతూ బొంబాయి కాంగ్రెసు మంత్రులు ప్రజాక్షేమం కోసం నిషేదాన్ని తొలగించరాదను వాదనను యీ సంఘం వారు తీవ్రముగా నిరశించుతున్నారు. ప్రతిపార్టీకి సక్రమంగా తనపని సాగించుకొను హక్కునిచ్చుట సామాన్య పౌరసత్వముల గౌరవించుటయే. ఇంగ్లండు, అమెరికా మొదలైన కాపిటలిస్టు ప్రజాతంత్ర దేశాలలోకూడ అట్టి హక్కువుంది.కాంగ్రెసు మంత్రివర్గాలు కమ్యూనిస్టు పార్టీపైనిషేధాన్ని తొలగించవలెనని ఇండియా ప్రభుత్వంపై ఒత్తిడి తేవలయునని కోరుతున్నాము.

2. ఏప్రిల్ నెల అంతయు పార్టీ ఆక్టివ్ సభ్యులందరిని వివిధ దళాలుగా విభజించి ప్రతి తాలూకాలోను సాధ్యమైనన్ని గ్రామాలలో రాబోవు పోరాటానికి తయారుగావాలని ప్రచారం గావించాలి. ఆయా గ్రామాలలో ముందుకువచ్చి పనిచేయదలచుకొన్నవారిని కలసికొని వారితో సంబంధాలు ఏర్పాటుచేసికోవలయును. వీరికందరికి మే నెలలో రాజకీయ పరిజ్ఞానము, తరిఫీదు యిచ్చుటకు వేసంగిపాఠశాలలు ఏర్పాటు చేయవలయును. ఈప్రచారమున ప్రతిగ్రామ ప్రజాసామాన్యంయొక్క వివిధ కష్టాలు గమనించి వానిని పోరాటం పెంపొందింప చేయడానికి ఏవిధంగా ఉపయోగించాలో కూడ ఈ పాఠశాలలో నేర్పాలి.

3. రాష్ట్ర యువజనసంఘము తరపున ఏర్పాటు జేయదలచుకొన్న వాలంటీరు శిక్షాశిబిరాన్ని వెంటనే స్వాతంత్ర్యపోరాటము ఆరంభమగు సూచనలు కనపడుతున్నాయిగాన ప్రస్తుతము మానివేయవలసినదిగా రాష్ట్రయువజనసంఘమును కోరుచున్నాము.

4. నవశక్తి రిపోర్టు చదివి అంగీకరించడమైనది. కార్యనిర్వాహక సభ్యులైనా తప్పక ప్రతి వారమూ విమర్శనలు పంపాలి. వచ్చిన విమర్శలకు జవాబుగా నెలకొకసారి ఎడిటోరియల్ బోర్డు మీటింగు ప్రొసీడింగ్సు పంపాలి.

పార్టీ సభ్యులు నవశక్తికి యివ్వాలసిన డబ్బంతయు మార్చి 8 వ తారీఖులోపల పంపించాలి. ఆయా జిల్లాలల్లో వున్న ఏజెంట్లు, ఎడ్వర్ టైజర్లవద్దనుండి డబ్బువసూలుచేసి పంపాలి.

5. క్రిందటి సంత్సరం కార్మికులలో చేసిన పనిని గురించి రిపోర్టు వ్రాయుటకు కామ్రేడ్ కె. యల్. నరసింహంను, రైతు ఉద్యమ రిపోర్టును వ్రాయుటకు కామ్రేడ్ చలసాని వాసుదేవరావును నియమించడమైనది. వీరు మార్చి 8 వ తేదీలోపల రిపోర్టులు తయారు చేయాలి.

6. సుభాషు చంద్రబోసు విజయం సోషలిస్టుల, తీవ్రవాదుల విజయంకాదు. గాంధీజం ఓటమియుకాదు. కాంస్టిట్యూషన విజయమువైపు మ్రొగ్గుట ఫెడరేషనుపై రాజీపడాలను పాలసీకి ఓటమిమాత్రమే. అంతర్జాతీయంగా బ్రిటీషు సామ్రాజ్యం క్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకొని స్వాతంత్ర్య పోరాటము జయప్రదమగుటకు చక్కని అవకాశాలున్న యీ రోజులలో కాంగ్రెసులో చీలికలుతేరాదు. ఇదివరకు తీవ్రవాదులు అల్పసంఖ్యాకులుగావున్నా కాంగ్రెసు కార్యక్రమాన్ని నెరవేర్చినట్లే గాంధీవాదులు యిపుడు త్రిపురీ కాంగ్రెసు నిర్ణయించబోవు కార్యక్రమాన్ని నెరవేర్చాలి. బోసు కాంగ్రెసులో ఐక్యతను కాపాడటానికి సర్వశక్తులు వినియోగించాలి. కాని ఫెడరేషన్ వ్యతిరేకించు కార్యక్రమంలో మాత్రం రాజీపడరాదు. కాంగ్రెస్‌లోని ఐక్యతను కాపాడుటకు తీవ్రవాదులు, సోషలిస్టులు, కమ్యూనిస్టులు కలసి లెఫ్ట్‌బ్లాక్ ఏర్పడుట అవసరమని తలంచుతూ, దాని నిర్మాణానికి సోషలిస్టులు సాయపడాలని యీ సంఘమువారు అభిప్రాయపడుచున్నారు.

7. ఇదివరకు సంస్థాన ప్రజా పోరాటాలలో పాల్గొనరాదనిన గాంధీజీయే తన అభిప్రాయాన్ని మార్చుకొని రాజకోట, జైపూర్ సంస్థానాల పోరాటాన్ని ప్రోత్సహించు చున్నందులకు సంతోషాన్ని వెల్లడించుచున్నాము. సంస్థాన ప్రజా ఉద్యమాలన్నిటికి కాంగ్రెసే నాయకత్వము వహించి నడపాలి. దానితోపాటు బ్రిటీషు ఇండియాలో కూడా ఫెడరేషనుకు వ్యతిరేకంగా పోరాటం సాగించాలని తీర్మానించుచున్నాము.

8. అన్యాయముగా పనినుండి తీసివేయబడిన తమకార్మికసోదరునికిసానుభూతినిచూపిన చిట్టివలస జనపనారమిల్లు కార్మికులమీద, అర్ధరాత్రిమిల్లు ద్వారములను మూసి, దీపములను ఆర్పి తుపాకులను కాల్పించి, లాఠీలతో చావమోదించిన జిల్లా ఆఫీసర్ల చర్యను తీవ్రముగా కార్యనిర్వాహకవర్గమువారు ఖండించుచున్నారు. పోలీసు రిపోర్టులమీద ఆధారపడి, సరియైన విచారణలను జరపకుండా, కార్మికుల మీద తప్పును రుద్దుట కాంగ్రెసు మంత్రివర్గమునకు తగనిపని అని భావించుచు, రాష్ట్ర కాంగ్రెసు కమిటీద్వారా విచారణను జరిపి, జిల్లా అధికారులమీద తగు చర్యను తీసుకొనవలెనని కోరుచున్నారు.

తమకోర్కెలీడేరువరకు కార్మికులను సమ్మె సాగించవలెననియూ, సమ్మె సహాయక నిధులను ప్రోగుజేసి సమ్మె జయప్రదమగుటకు తేవలెననియూ, ఆందోళనజరిపి నిష్పాక్షిక విచారణచేయమని మంత్రివర్గముమీద వత్తిడి తోడ్పడవలయునని పార్టీ సభ్యులను హెచ్చరించడమైనది.

9. తమ న్యాయమైన హక్కులకొరకు సమ్మెజేయుచున్న కాకినాడ స్టీమరు, బోటు కూలీలపట్ల హృదయపూర్వక సానుభూతిని కార్యనిర్వాహకవర్గమువారు తెల్పుతున్నారు. విరాళములను ప్రోగుజేసియు ఇతరరేవులనుండి కూలీలు కాకినాడ పోకుండా తీవ్రకృషి జేసియూ సమ్మెకు సహాయము చేయవలసినదిగా పార్టీ సభ్యులను హెచ్చరించడమైనది.

* * *

బాల బాలికల వసంత విహార శిబిరము.

విద్యావనం : మంతెనవారిపాలెం.

1939 వేసంగికి విద్యావనంలో బాలబాలికల విహార శిబిరము నడపవలెనని నిశ్చయించుకున్నాము. భారతదేశం అన్ని ప్రాంతాలనుండి 5—15 సంవత్సరాల వయస్సుగల బాలబాలికలు ఈ శిబిరంలో పాల్గొనవచ్చును. సముద్రతీరానికి నాల్గుమైళ్ళ దూరంలో విశాలము, సుందరము, ఆకర్షవంతము అయిన మామిడితోటలో విద్యావనం (వసతి పాఠశాల) నడపబడుతున్నది. ఈ తోటల్లో నేల్లరాబోవు వసంత సమయంలో మేనెల 1 వ తేదీనుండి ఒకనెల రోజులు బాలబాలికల విహారశిబిరం కూడా ఏర్పాటు చేయబడుతుంది. ఈవిధమైన సన్నాహాలు ఆంధ్రదేశానికే కాక అఖిల భారతదేశానికే అపూర్వం. కనుక ఈ సరిక్రొత్త ప్రయత్నానికి ఆంధ్ర మహాజనుల సంపూర్ణ సహకారము లభిస్తుందని నమ్ముతున్నాము.

యువజనులకు ఆధునిక వైజ్ఞానిక పద్ధతులపై విద్య నేర్పించవలెనని విశ్వప్రయత్నములు చేస్తున్న మనము మన బాలబాలికల విషయములో అవలంబిస్తున్న విద్యావిధానములు ఏదో విధంగా దోషభూయిష్టములుగానున అట్టి బిడ్డలలో అంతర్లీనమైఉన్న శక్తులను సక్రమమార్గాలలో నడిపించవలెనంటే వారియొక్క మనస్తత్వాన్ని సమగ్రంగా పరిశోధించి తత్తదనుగుణములైన పద్ధతులను అవలంబించడం ఎంతో అవసరం. ప్రతి బిడ్డయు శరీరపుష్టిని, సంఘీభావాన్ని, సమిష్టి జీవనాన్ని పెంపొందించుకోవాలి. శలవు దినములలో పల్లెటూరిలో వున్నా, పట్టణంలోఉన్నా బాలబాలికలు తరుచు అపమార్గాలుపట్టి, అసహ్యకర అభ్యాసాలకు వశముకావడం పరిపాటి అయిపోయింది. శలవు రోజులలో తలిదండ్రుల ప్రవర్తన ఎంత నిరంకుశంగా ఉంటున్నదో, దానిమూలాన పిల్లలు భావి జీవితములో తమ కుటుంబానికిగాని సంఘానికిగాని ఏవిధంగా పనికిరాకపోతున్నారో అందరికీ తెలిసినదే.

ఇటువంటి పరిస్థితుల్లో ఉత్సాహకరము, వినోదదాయకము, విజ్ఞానప్రదముఅయిన కార్యక్రమంతో ఏర్పాటు చేయబడుతున్న ఈ వసంత విహార శిబిరముయొక్క అవశ్యకత సర్వవిదితము.

గృహక్రీడలు, బహిఃక్రీడలు, వ్యాయామ క్రీడలు, మిలిటరీ కవాతు, స్కేటింగు, గరల్ గైడింగు, వినోద ప్రయాణములు, సముద్రతీరపు విడుదులు, చంద్రికా విహారములు, జానపద నాట్యములు, హాస్యసల్లాపములు,బహిరంగ రూపక ప్రదర్శనములు, శరీర బలప్రదర్శనములు మున్నగు వివిధ వినోదములతోపాటు అరోగ్య, విద్యా, వ్యవసాయ, పరిశ్రమ ప్రదర్శనములుకూడ ఏర్పాటు చేయబడుచున్నవి. ఇటువంటి కార్యక్రమము బాలబాలికలకే గాక సామాన్య జనసమూహమునకు గూడ ఉత్సాహ విజ్ఞాన ప్రదము కాగలదని మా విశ్వాసము.

శలవుదినములలో పిల్లలను జాగ్రత్త పెట్టుకొనజాలక శ్రమపడుతున్న తల్లిదండ్రులకు ఈ వసంతశిబిరము ఆశాజ్యోతి కాగలదని నమ్ముతున్నాము, వందలకొలదిగా పిల్లలను పంపియు, అమూల్యములైన సలహాలనిచ్చియు, వివిధ విద్యాసంస్థల ఉపాధ్యాయులు పాలకులు విశాల హృదయముతో చేయూతనొసగి ఈ వసంత శిబిరమును జయప్రదము చేయుదురని మిక్కిలి ఆశించుచున్నాము.

వివరములకు :—

అ. సరళాదేవిరావు,
విద్యావనం,
(పోస్టు) మంతెనవారిపాలెం
(వయా) పొన్నూరు, గుంటూరు జిల్లా.

* * *

విద్యార్థి ఉద్యమాన్ని సోషలిస్టులు డామినేటు చేయుటలేదు.

ఈ నెల 6 వ తేదీ బెజవాడలో రామమోహన లైబ్రరీలో జరిగిన సభకు నేను వెళ్ళాను, అది ఆంధ్రాస్టూడెంట్సు ఎసోసియేషన్‌వారివల్ల జరుపబడింది. ఈ ఎసోసియేషన్‌కూ, బెజవాడ విద్యార్థిసంఘానికి ఏవిధమైన సంబంధమూలేదు. బెజవాడ విద్యార్థిసంఘము మూడు సంవత్సరములక్రిందస్థాపించబడి, వేయిమంది సభ్యులను కలిగివుంది. ఆంధ్ర స్టూడెంట్సు ఎసోసియేషన్ మూడు నెలలక్రింద స్థాపించబడింది. దాదాపు పదిమంది సభ్యులున్నారని వినికిడి.

కాలేజీలో వున్న నన్ను ఆనాడు ఓ విద్యార్థి సోదరుడాసభకు రమ్మని పిల్చినాడు. చర్చనీయాంశ మేమిటని ప్రశ్నించాను. దానికతడు తగిన జవాబు చెప్పలేదు. తీరా వెళ్ళేటప్పటికి పదిమంది విద్యార్థులువ్నారు. అక్షరశోకవిద్యార్థి గత ఆంధ్రరాష్ట్ర విద్యార్థి మహాసభను విమర్శించడానికీసభచేస్తున్నారట అనిచెప్పాడు. వెంటనే ఒకరిని పంపి కాలేజీలో వున్న విద్యార్థులకు తెలియపరిచాను. కబురు విని బెజవాడ విద్యార్థి సంఘ ప్రముఖసభ్యులొక పాతికమందిదాకా వచ్చారు.పంద్రంగి కేశవరావుగారాసభకు అధ్యక్షత వహించారు. సూరిశాస్త్రిగారు స్వాతంత్రోద్యమాన్నిగురించి మాట్లాడారు. తరువాత ఒక విద్యార్థి లేచి, గత రాష్ట్ర విద్యార్థి మహాసభాహ్వాన పత్రాలు ఎర్రసిరాతో అచ్చువేయబడ్డవనీ (అసలు బ్రౌన్ సిరాతో అచ్చు వేయబడ్డవి) "విప్లవం వర్ధిల్లాలని" కేకలువేశారని, రంగాగారిని అధ్యక్షులుగా పిల్చారనీ, ఇవన్నీ సామ్యవాద చిహ్నాలనీ చెప్ప మొదలు పెట్టాడు. నేను లేచి విమర్శకు జవాబుచెప్పుకోనిస్తారా అని అడిగాను. అధ్యక్షులు అసలీసభ విమర్శనలకు కాదనీ, ఏ. విమర్శన చేయకూడదనీ చెప్పి, అవిద్యార్థితో అవాక్యాలుఉపసంహరింపచేసారు, తరువాత ఉపన్యాసాలన్నీ ఆంధ్రరాష్ట్రావసరము మీదే జరిగాయి.

9 వ తేదీ "హిందూ" మొదలగు పత్రికలలో ప్రకటింపబడి నట్లానాడు కేశవరావుగారు విద్యార్థ్యుద్యమం విషయంలో సామ్యవాదుల విషయమసలు మాట్లాడలేదు.

ఇంకా ఆనాడు ఏ తీర్మానం చేయబడలేదు. ఏవేవో తీర్మానాలు చేయబడ్డట్టు పత్రికల వార్తలన్నీ అభూతకల్పనలు. ఏ వ్యతిరేక తీర్మానం ప్రవేశపెట్టబడ్డా ప్రతిఘటించేవాళ్ళం ముప్పయిమందిమి వున్నాం. అనుకూలురు దాదాపు పదిమందే.

ఆంధ్ర విద్యార్థ్యుద్యమాన్ని ఏ రాజకీయ పార్టీకూడా నడపడంలేదు. నడుపబడుతుందనుకోవడం తెలివితక్కువ. విద్యార్థులలో అనేకభావాలు కలవాళ్లుంటారు. ఒకవేళ సామ్యవాదభావాలు కలవారధికమైతే సామ్యవాద దృక్పథముతో ఉద్యమం నడుపబడుతుందికాని, ఏపార్టీ కూడా ఉద్యమాన్ని "డామినేట్" చేయడమునులేదు. "విప్లవం వర్ధిల్లాలి" అని కేకవేస్తేనూ, రంగాగారధ్యక్షత వహిస్తేనూ, విద్యార్థ్యుద్యమాన్ని సోషలిస్టుపార్టీ "డామినేట్" చేస్తూన్నదనేవారిని ఏమంటాము? పరిస్థితులర్థం చేసుకోలేని వాళ్ళ తెలివితక్కువకు విచారిస్తాం. అంతే.

పత్రికల్లో అన్యాయంగా వ్రాసుకున్న వ్రాతలనుచూచి విద్యార్థి సోదరులు దురభిప్రాయాలపాలు కాకుంటారని, నాటి సభకు సంబంధించిన పత్రికల వార్తలలో మూడువంతులు కల్పనలనీ విన్నవిస్తున్నాను.

విధేయుడు,
జాస్తి నారాయణరావు,
ఆహ్వాన సంఘాధ్యక్షుడు,
15 వ ఆంధ్రరాష్ట్రీ విద్యార్థి మహాసభ, బెజవాడ.

యువజన సంఘాలు

(14 వ పేజీ తరువాయి)

నము గావించడాన్నికి కూడ ప్రత్యేక పాఠశాలలు నెలకొల్పడము మానివేయకూడబడింది.

కా మ్రే ప్ పిల్లలమర్రి ఉదాహరణ తెచ్చాడు. రష్యాలోని కాంసోమల్ ఉద్యమము (కమ్యూనిష్టు యువజనోద్యమం) నిజమైన యువజనోద్యమముగా విప్లవానంతరమే అయింది. కమ్యూనిస్టు ఇంటర్నేషనలు యొక్క కార్యనిర్వాహక సభ్యుడు "కుసినిన్" తన యువజన థీసిస్‌లో అది కమ్యూనిస్టు పార్టిలాగ పనిచేయకూడదన్ని హెచ్చరించాడు. యువకులను తరిఫీదు చేయడానికి కమ్యూనిస్టులుగా తయారుచేయడానికి అది పూనుకోవాలన్నాడు. అచ్చట ప్రభుత్వము కమ్యూనిస్టు ప్రభుత్వము. అచ్చట దేశమందలి రాజకీయ తత్వము. కమ్యూనిస్టు తత్వం. అందుచే ఆ ఉద్దేశముతో యువజను లందరూ పనిచేయడానికి ప్రయత్నించడం సులభసాధ్యము. ఇచ్చట అలాంటి ఉద్దేశాలతోనే ఆరంభించడమంటే ప్రభుత్వ నిర్బంధవిధానాన్ని, మన పురాతన ఆచార వ్యవహారాలను ఎదుర్కోవాలి. ఎదుర్కొనే సాహసము వచ్చేవరకు యువజన సంఘాలలో ఉండడము అసంభవము. అందుచేతనే మన యువజన సంఘాలను సోషలిస్టు యువజన సంఘాలుగ మార్చక, అట్టి యువకులను సోషలిస్టు పార్టిలో చేర్చుకొనుచూ, దేశమందలి యువజనులందరూ స్వాతంత్ర్య పోరాటములో పాల్గొనేటట్లు ఉత్సాహము, తదుపరి తరిఫీదు ఇవ్వడానికని పార్టి అలాంటి కార్యక్రమం ఏర్పరచింది. రష్యాలోని కాంసోమాల్సుకు కూడ అట్టి కార్యక్రమము ఉంది. వారు స్పోర్ట్సు, ఒలింఫిక్సులలో పాల్గొని కూడ మిగిలిన సామాజిక జీవనములో కమ్యూనిస్టు సమాజ నిర్మాణములో పాల్గొంటూ ఉన్నట్లే, మన యువజనులూ స్పోర్ట్సు, ఒలింఫిక్సులో పాల్గొని కూడ స్వాతంత్ర పోరాటములో పాల్గొంటారని ఆశించడం పొరపాటా?

విద్యార్థులు

(15 వ పేజీ తరువాయి)

క్షలలో లంపాలిచ్చో. సిఫార్సులు చేయించుకోనో కాపీలుచేశో, ప్యాసవటానికికూడా ఎక్కువ అవకాశాలున్నాయని ఘంటాపథంగా చెప్పవచ్చు. ఈపరీక్షల్లో ఇచ్చే ప్రశ్నపత్రాలు విద్యార్థి ఏ ప్రశ్నలిస్తే వ్రాయలేడా అని మారుమూలల ఉన్నప్రశ్నలు ఏరి ఇవ్వబడుతున్నాయి. మార్చి నెల వస్తోంది అనేటప్పటికల్లా ప్రతివిద్యార్థి గుండెల్లోనూ రాయిపడుతుంది. ఇలాంటి లోపములే అనేకమున్నాయి నేటిపరీక్షా విధానంలో. అందుకనే నేటి యీ పరీక్షల్ని విజ్ఞానవేత్తలందరూ పడ తిట్టుతున్నారు. విద్యార్థులుకూడా పరీక్షలు పోవాలి అనే నినాదాన్ని ఇస్తున్నారు, ఇవ్వబో తున్నారు కూడా.

సమ్మెలను అణచడం ఉత్తమమని లేఖకులు సెలవిచ్చారు. సంగతి సందర్భాలు ఆలోచించకుండాను, తెలిసికోకుండాను ఇలాగవ్రాయటం భారత భావిస్వాతంత్ర్యపోరాటానికి బలమైన చేయూత నివ్వటానికి సిద్ధంగా ఉన్న విద్యార్థి ఉద్యమానికి తీరని దెబ్బ. సమ్మెలు అనవసరంగానూ, అసందర్భంగానూ, అప్రస్తుతంగాను ఎక్కడా జరుపబడలేదు. విద్యార్థుల హక్కుల కోసం, ఆయాబానిస విద్యాపద్ధతులను రూపుమాపుచేసే టందుకోసం యీ సమ్మెలు సాగించబడుతున్నాయి. అందువల్లనే విద్యార్థులంతా కూడా సమ్మెల్లో పాల్గొని, జయప్రదం కావిస్తూ తమతమహక్కుల్ని, సౌకర్యాల్ని పొందకల్గుతున్నారు. ఈ సమ్మెలవిషయంలో ఆంధ్రరాష్ట్ర విద్యార్థిసంఘంవారూ, రాజధానీ విద్యార్థిసంఘం వారు ఎంతజాగరూకతతో ఉంటున్నదో మొన్నమొన్న జరిగినమహాసభల తీర్మానాలే ఋజువు చేస్తాయి. వీటిమూలాన విద్యార్థులకు క్రొత్తగా అనర్థమేమీ వాటిల్లదని స్పష్టంగా చెప్పవచ్చు.

. విద్యార్థి సంఘాలకు యీ సమ్మెలే కార్యక్రమంకాదని చదువరులు తెలిసికోవాలి. భారత దేశానికి స్వాతంత్ర్యం సంపాదించే టందుకు విద్యార్థి సంఘాలు అనేక తరహాల ఉపయోగపడతాయి. అందువల్లనే వచ్చే వేసంగిలో వయోజన విద్యావ్యాపకోద్యమాన్ని సాగించటానికి, ఆర్థిక, రాజకీయ పరిజ్ఞానాన్ని కల్గించటంకోసం వేసంగి పాఠశాలలను ఏర్పరచటానికి, కాలేజీలున్న రోజుల్లో రాత్రి పాఠశాలలు మొదలైన వాటిద్వారా ప్రజాసామాన్యానికి విజ్ఞానం కల్గించటానికి ఆంధ్రరాష్ట్ర విద్యార్థి సంఘం వారు చక్కని ఎర్పాట్లు చేస్తున్నారు. ఇంకా ఇలాంటి కార్యక్రమము కావాల్సినంత ఉంది, కాబట్టి విద్యార్థి సంఘాలు చక్కగా పనిచేసి ఆదర్శప్రాయ మవటానికి భారత స్వాతంత్ర్య పోరాటానికి చక్కని చేయూత నీయటానికి ఎల్లవుడూ సిద్ధంగానే ఉంటాయి.

జైళ్ల సంస్కరణ

(7 వ పేజీ తరువాయి)

చుట్టలు, బీడీలు.

చుట్టలు, బీడీలు వగైరా అలవాటు ఉన్న ఖయిదీలకు వాటిని ఉచితంగా, గవర్నమెంటు ఖర్చుమీద, సప్లయి చేయాలి, జైళ్ళలో వాటిని నిషేధించడం అనవసరమని మా అభిప్రాయం. ఎందువల్లనంటే ఇందుమూలంగానే సర్వసాధారణంగా ఖైదీలలో డిసిప్లిన్‌కి సంబంధించిన నేరాలు నిరంతరము జరుగుతున్నాయి. గవర్నమెంటు ఖర్చుమీద యివి అలవాటుగల ఖైదీలందరికీ సప్లయి చేస్తే, జైలులో చక్కని డిసిప్లిన్, ఖైదీలలో చక్కని నడవడిక, ఏర్పడగలవు.

రెమిషన్లు

మంచి నడవడికకు రెమిషన్ యిచ్చే నిబంధన 6 నెలల కంటె ఎక్కువ శిక్ష పొందిన ఖైదీలకు మాత్రమేగాక, మూడునెలల శిక్షితులకుకూడా వర్తింపజేయాలి.

ప్రతిరోజు ఒక అరగంటసేపు ఖైదీలు పాటలు పాడుకొనవచ్చు, మత కలహాలను ప్రోత్సహించే పాటలుగాని, అసభ్యమైన పాటలుగాని పాడకుండా నిషేధించాలి. ఈ సదుపాయం కలుగజేస్తే, ఖైదీలు తమతమ కష్టాలను మరచిపోయి, జైలు జీవితంలో కనపడే కాఠిన్యత కొంతవరకు తగ్గడానికి అవకాశం వుంటుంది. రేడియో సెట్లుకూడా నిర్మిస్తే, యీ ఉద్దేశం సులభంగా నెరవేరుతుంది.

జమీందారీ రైతుల హక్కులకై పోరాడేది నవశక్తి	**నవశక్తి**	కార్మిక, కర్షక రాజ్యం కావాలంటుంది నవశక్తి

నవశక్తి

త్రిపురీ సంచిక

మార్చి 8 బుధవారం

1857 నుండి 1938 వరకు

★

కాంగ్రెసు చరిత్ర

టెర్రరిస్టు ఉద్యమం

కమ్యూనిస్టు ఉద్యమం

సోషలిస్టు ఉద్యమం

★

కార్మిక కర్షకోద్యమాలు

ఇంకా ఎన్నో విప్లవ జీవితాలు! వీరగాథలు!!

త్రిపురీ కాంగ్రెసుకు స్వాతంత్ర్య శంఖారావం వినబడుతుంది; ఆనాడు, మరుగువడిన మన వీర చరిత్రల—ఉద్యమాల సంస్మరించుకోవాలంటే నవశక్తి ప్రత్యేక సంచిక చదవండి!

క్రౌన్ ¼ సైజున **100** పేజీలు — వెల పావలా

అడ్వర్టైజ్‌మెంటు రేట్లు

టైటిల్ వెనుక పేజీ	రు 20—0—0
పూర్తి పేజీ (¼ క్రౌన్)	15—0—0
అర పేజీ	8—0—0
పాతిక పేజీ	4—8—0
అంగుళం	0—6—0

షరా:— రూపాయికి తక్కువ ప్రకటనలు తీసికొనబడవు.

మేనేజరు,

నవశక్తి

గవర్నరుపేట, బెజవాడ.

Published by M. Chandrasekhara Rao
Printed by Tummala Venkata Ramiah } at Navasakti Press, Governorpet, Bezwada.

END OF ISSUE